జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జిలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.

అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు

9440231967

కృష్ణ సోమవారం 12 అక్టోబర్ 2026 సంపుటి : 01 సంచిక :269 పేజీలు : 12 వెల : 3/- PRGI No. APTEL/26/A0119,

శ్రీ పరాభవ నామ సంవత్సరం ఆషాఢ మాసం గ్రీష్మ ఋతువు దక్షిణాయనం సూర్యోదయం: 5.42 ၊ సూర్యాస్తమయం: 6.22 చంద్రోదయం: 4.57 ၊ చంద్రాస్తమయం: 5.20 తిథి: బహుళ చతుర్దశి రా. 1.37 వరకు, తదుపరి అమావాస్య నక్షత్రం: పుష్యమి సా. 10.23 వరకు, తదుపరి ఆశ్లేష యోగం: సిద్ధి రా. 8.18 వరకు, తదుపరి వ్యతీపాత కరణం: భద్ర ను. 2.45 వరకు, తదుపరి శకుని రా. 1.37 వరకు, తదుపరి చతుష్పాద

Published from KRISHNA, GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com



## ఏపీలో ఘనంగా
# దసరా నవరాత్రి ఉత్సవాలు

వివిధ అలంకరణల్లో దర్శనమిస్తున్న అమ్మవార్లు

రాష్ట్ర వ్యాప్తంగా దసరా ఉత్సవాలు ఘనంగా ప్రారంభమైయ్యాయి

అమ్మవారు వివిధ అలంకరణల్లో కొలువై భక్తులకు దర్శనమిస్తున్నారు

పదిరోజుల పాటు అమ్మవార్లు విశేష అలంకరాల్లో దర్శనం ఇవ్వనున్నారు.

రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా ప్రారంభమైన దసరా శరన్నవరాత్రులు



**అమరావతి**

రాష్ట్ర వ్యాప్తంగా దసరా ఉత్సవాలు ఘనంగా ప్రారంభమైయ్యాయి. అమ్మవారు వివిధ అలంకరణల్లో కొలువై భక్తులకు దర్శనమిస్తున్నారు. ఈ సందర్భంగా అమ్మవార్లకు ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. ఆలయాలకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుంటున్నారు. పదిరోజుల పాటు అమ్మవార్లు - మిగతా3లో

# విజయవాడ ఉత్సవాలను గ్రాండ్ సక్సెస్ చేయాలి

- ఇంద్రకీలాద్రి శరన్నవరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయాలని సీఎం ఆదేశం
- దసరా సామాన్యుల పండుగలా జరగాలి, వీఐపీలదిగా కాదని స్పష్టం
- అక్టోబర్ 13 నుంచి జాతీయ స్థాయి సరస్ మేళాకు పకడ్బందీ ఏర్పాట్లు
- విజయవాడ ఉత్సవ్ 2.0తో ఆర్థిక కార్యకలాపాలు పెరగాలని సూచన
- రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లపై అధికారులతో సీఎం సమీక్ష



**విజయవాడ**

విజయవాడలో జరుగుతున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు, త్వరలో ప్రారంభం కానున్న జాతీయ స్థాయి సరస్ మేళా, విజయవాడ ఉత్సవ్ 2.0లను అత్యంత వైభవంగా, విజయవంతంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఈ భారీ కార్యక్రమాల విజయానికి దేవాదాయ, పర్యాటక శాఖలతో పాటు జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని ఆయన స్పష్టం చేశారు. మంత్రులు, ఉన్నతాధికారులతో శుక్రవారం టెలీకాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన సమీక్షలో ఆయన కీలక ఆదేశాలు జారీ చేశారు. దసరా ఉత్సవాలు సామాన్యుల పండుగలా జరగాలని, వీఐపీల కోసం కాదని సీఎం స్పష్టం చేశారు. "ఇంద్రకీలాద్రి ఉత్సవాలు సామాన్యుల దసరాగా ఉండాలి, వీఐపీల దసరాగా కాదు. దీనికి అన్ని వర్గాలు సహకరించాలి" అని ఆయన అన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు, పలువురు కేంద్ర మంత్రులు, ప్రముఖులు వస్తున్న నేపథ్యంలో, వారి రాక వల్ల సామాన్య భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని సూచించారు. వీఐపీల రాకతో విధించే ట్రాఫిక్ ఆంక్షల గురించి ప్రజలకు ముందుగా తెలియజేయాలని, వారి ఇబ్బందులను తగ్గించేందుకు - మిగతా3లో



## ప్రపంచంలోనే రెండో అతిపెద్ద మొబైల్ తయారీదారుగా భారత్

- 25 నగరాలకు మెట్రో సేవలు
- 13 వేల కోట్ల రూపాయల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు
- చెన్నై విమానాశ్రయంలో ప్రధానికి ఘన స్వాగతం
- 2014 నుంచి మన ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు 11 రెట్లు పెరిగాయి
- తయారీ రంగంలో వృద్ధి వల్ల యువతకు ఉపాధి అవకాశాలు పెరిగాయి
- పరిశ్రమలు, రవాణారంగం హబ్‌గా తమిళనాడు తయారవుతోంది
- రాష్ట్రాలు శరవేగంగా అభివృద్ధి చెందితేనే దేశాభివృద్ధి సాధ్యం.

## ఆర్థిక నేరాల కేసుల నుంచి
# తప్పించుకునేందుకే జగన్ కాలయాపన

- జగన్ అందుకే తప్పుడు కథనాలు, కార్టూన్లతో తప్పుదోవ పట్టిస్తున్నారు: మంత్రి కొల్లు రవీంద్ర
- ఈడీ విచారణకు రాజకీయ రంగు పులుముతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపణ
- వివేకా హత్య కేసులోనూ జగన్ రాజకీయ నాటకాలు ఆడారని తీవ్ర విమర్శలు
- అవినీతి సొమ్ముతో పెట్టిన సాక్షి పత్రికతో అసత్య ప్రచారం చేస్తున్నారని ఆరోపణ
- కేసుల విచారణ వేగవంతం చేసి నిజాలు బయటపెట్టాలని మంత్రి రవీంద్ర డిమాండ్




**విజయవాడ**

వాస్తవాలను పక్కదారి పట్టించి, వాటిని రాజకీయంగా వాడుకోవడమే జగన్ రాజకీయ నీతి అని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర తీవ్రస్థాయిలో విమర్శించారు. ఆదివారం మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. తనపై ఉన్న ఆర్థిక నేరాల కేసుల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు జగన్ ఎదుటివారిపై నిందలు - మిగతా3లో



## ఢిల్లీలో బారికేడ్లు తొలగించండి, మెట్రో నడపండి

- ఇంటర్నెట్‌పై ఆంక్షలు వద్దు: సుప్రీంకోర్టు
- ఢిల్లీలో అనవసర బారికేడ్ల తొలగింపునకు సుప్రీంకోర్టు ఆదేశం
- ప్రజా ప్రయోజనాల దృష్ట్యా తప్ప మెట్రో, రైలు సేవలు ఆపవద్దని సూచన
- శాంతియుత నిరసనకారులను అక్రమంగా నిర్బంధించరాదని స్పష్టీకరణ
- నిరసనల వేళ ఆంక్షలపై దాఖలైన పిటిషన్లపై ప్రత్యేక విచారణ
- ఇంటర్నెట్, మెట్రో సేవలు పునరుద్ధరించామని కోర్టుకు తెలిపిన కేంద్రం



## ఆ చట్టాన్ని సవరించాల్సిందే

- పరీక్షల రోజుల్లో ర్యాలీలు, ఊరేగింపులకు అనుమతులు నిలిపివేయాలి
- ఎన్‌టీఏ సంస్కరణలపై పార్లమెంటరీ కమిటీ
- ఎన్‌టీఏలో సంస్కరణలు, దాని బలోపేతంపై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ కీలక సూచనలు
- 'ఇన్విజిలేషన్ ఫార్మాలిటీల కోసం 15 నిమిషాల అదనపు సమయం'
- మోదీ సర్కార్ అహంకారం వీడాలి : కాంగ్రెస్

# అడవితల్లి బాట లక్ష్యం అదే

- గ్రామాల అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి
- రాజకీయాలకు అతీతంగా గ్రామీణాభివృద్ధే లక్ష్యంగా నిధుల కేటాయించాము
- అడవితల్లి బాట 2.0 ద్వారా రూ.2,052 కోట్లతో 2,569 పనులకు శ్రీకారం
- రంపచోడవరం నియోజకవర్గం కాకవాడ గ్రామసభలో కార్యక్రమాన్ని ప్రారంభించి, ప్రసంగించిన ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్



**అమరావతి**

రాష్ట్రంలోని ప్రతి గ్రామం అభివృద్ధి చెందాలన్నదే కూటమి ప్రభుత్వం లక్ష్యమని గ్రామాల అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలని ముఖ్యంగా యువత భాగస్వాములై గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పిలుపునిచ్చారు ఆదివారం పోలవరం జిల్లా రంపచోడవరం నియోజకవర్గం కాకవాడలో అడవితల్లి బాట 2.0 కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ఉప ముఖ్యమంత్రి శ్రీ కొణిదెల పవన్ కళ్యాణ్ ప్రసంగించారు. గిరిజన గ్రామాలకు రహదారి సదుపాయాలు కల్పించి, వాటిని అభివృద్ధి పథంలోకి తీసుకురావడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం 'అడవితల్లి బాట' కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. రహదారుల నిర్మాణం ద్వారా గిరిజన ప్రాంతాల్లో విద్య, వైద్యం, ఉపాధి, రవాణా, - మిగతా3లో




## ప్రభుత్వం భయపడుతోంది

- అందుకే సీఈసీపై పోరాటాన్ని తమపైకి మళ్లించుకుంది
- సీఈసీకి వ్యతిరేక నిరసనను ప్రభుత్వం తమపైకి మళ్లించుకుంటోంది
- గత 72 గంటల్లో దేశంలో ఎమర్జెన్సీని మించిన అరాచకం చూశాం
- మోదీ, అమిత్ షా ఆదేశాలతోనే ఎన్నికల సంఘం పనిచేస్తోంది
- సీజేపీ వ్యవస్థాపకుడి కుటుంబ విషాదంలో ఢిల్లీ పోలీసుల తీరు అమానుషం
- తమ పోరాటానికి మద్దతిచ్చిన నలుగురు మాజీ ముఖ్యమంత్రులకు కృతజ్ఞతలు

# మున్సిపల్ చైర్మన్ పదవికి స్వతంత్ర అభ్యర్థిగా శీళ్ళ వెంకటరమణ పోటీకి సిద్ధం!






**బీసీ రిజర్వేషన్ కేటాయిస్తే బరిలోకి దిగుతా..**

**సేవా కార్యక్రమాలే నా బలం అంటున్న శీళ్ళ వెంకటరమణ**

**ప్రజా జ్యోతి నందికొట్కూరు** రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో నందికొట్కూరు మున్సిపల్ చైర్మన్ పదవికి బీసీ రిజర్వేషన్ కేటాయించి, ఎన్నికల నిబంధనల ప్రకారం తనకు అర్హత ఉంటే స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నానని శీళ్ళ వెంకటరమణ తెలిపారు. పట్టణ ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో ఎన్నికల బరిలోకి దిగేందుకు ఆసక్తి చూపుతున్నట్లు వెల్లడించారు.

**మూడు దశాబ్దాలుగా కుటుంబానికి వ్యాపార నేపథ్యం**

శీళ్ళ వెంకటరమణ తండ్రి బాలస్వామి వ్యవసాయంతో పాటు సుమారు 30 సంవత్సరాలుగా వస్త్ర వ్యాపారాన్ని కొనసాగిస్తున్నట్లు తెలిపారు. తమ కుటుంబానికి రాజకీయాలతోనూ అనుబంధం ఉందని, 2006 నుంచి రాజకీయ వ్యవహారాల్లో కుటుంబం చురుకుగా ఉంటున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం మాజీ మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డికి సన్నిహితంగా ఉంటూ రాజకీయ కార్యకలాపాల్లో భాగస్వామిగా కొనసాగుతున్నట్లు స్థానిక వర్గాల సమాచారం.

**సేవా కార్యక్రమాలే ప్రాధాన్యం**

ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో గతంలో పలు సామాజిక కార్యక్రమాల్లో పాల్గొన్నట్లు వెంకటరమణ తెలిపారు. రక్తదాన కార్యక్రమాలు నిర్వహించడం, వేసవిలో చలివేంద్రాలు ఏర్పాటు చేయడం, మొక్కలు నాటడం వంటి కార్యక్రమాల ద్వారా సమాజానికి తన వంతు సేవ అందించినట్లు వివరించారు. భవిష్యత్తులోనూ ప్రజా సమస్యల పరిష్కారానికి, పట్టణ అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు పేర్కొన్నారు. మరోవైపు, తన వృత్తిని కొనసాగిస్తూనే ముగ్గురు పిల్లలను ఎంబీబీఎస్ చదివిస్తున్నట్లు తెలిపారు.

## 31వ వార్డులో జనసేన అభ్యర్థిగా పోటీకి షేక్ వలి భాష సిద్ధం..!

**పవన్ కళ్యాణ్ సిద్ధాంతాలపై అభిమానంతో రాజకీయాల్లోకి..**



**ప్రజా జ్యోతి నందికొట్కూరు** జనసేన పార్టీ ముస్లిం మైనార్టీ నాయకుడు షేక్ వలి భాష 31వ వార్డు నుంచి కౌన్సిలర్ అభ్యర్థిగా పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌పై అభిమానంతో పాటు, చిన్నప్పటి నుంచే ఆయన సిద్ధాంతాలు, ఆశయాల పట్ల ఆకర్షితులై జనసేన పార్టీ పట్ల ఆసక్తి పెంచుకున్నట్లు తెలిపారు. పవన్ కళ్యాణ్ ఆశయాలు, ప్రజా సేవ పట్ల ఆయనకున్న నిబద్ధత తనను ఎంతగానో ప్రభావితం చేశాయని షేక్ వలి భాష పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో 31వ వార్డులో ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలనే లక్ష్యంతో కౌన్సిలర్ అభ్యర్థిగా పోటీ చేయడానికి సిద్ధమయ్యారు. వార్డులో తాగునీరు, పారిశుధ్యం, రహదారులు, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. జనసేన పార్టీ నుంచి అధికారికంగా అభ్యర్థిత్వం ఖరారైందనే సమాచారం లేనందున, ప్రస్తుతం పోటీకి సిద్ధమవుతున్నట్లు మాత్రమే పేర్కొనడం సముచితం.

# ఒకే దశలో పురపాలక ఎన్నికలు

**రెండు దశల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలపై పరిశీలనలి**

**3 దశల్లో పంచాయతీ ఎన్నికలు**

**వివరాలు వెల్లడించిన ఏపీ ఎన్నికల కమిషనర్... అనిల్ చంద్ర**




**నంద్యాల:అక్టోబర్=11 ప్రజాజ్వోతి** గ్రామ పంచాయతీలకు మూడు దశల్లో ఎన్నికలునిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ నిర్ణయించింది. పుర, నగరపాలక సంస్థలు, నగర పంచాయతీలకు ఒక దశలోనే నిర్వహించనున్నారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు రెండు దశల్లో నిర్వహించే విషయాన్ని పరిశీలిస్తున్నట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) అనిలచంద్ర పునేఠా తెలిపారు. నోటిఫికేషన్ విడుదల చేసిన సమయం నుండి ఎన్నికల కోడ్ అమల్లోకి నోటిఫికేషన్ వెలువడిన 14 రోజుల్లోనే పంచాయితీ ఎన్నికలు.. అదే రోజు ఫలితాలు 15 రోజుల్లో పుర, నగరపాలక సంస్థలు, నగర పంచాయతీల ఎన్నికలు. రెండు రోజుల్లో ఓట్ల లెక్కింపు ఫలితాలు 16 రోజుల్లో ఎంపిటిసీ,జడ్పీటీసీ ఎన్నికలు.. రెండు రోజుల తర్వాత ఫలితాలు పంచాయతీలకు మాత్రం పార్టీ రహితంగా ఎన్నికలు ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన రోజు నుంచి 14 రోజుల్లో పంచాయతీ ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని నిర్ణయించారు. పోలింగ్ ఉదయం 7 గంటలకు ప్రారంభమై ఒంటి గంటకు ముగియనుంది. అదేరోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్లు లెక్కించి, ఫలితాలు ప్రకటిస్తారు. పుర, నగరపాలక సంస్థలు, నగర పంచాయతీల ఎన్నికలు నోటిఫికేషన్ నుంచి 15 రోజుల్లో, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు 16 రోజుల్లో పూర్తి చేయనున్నారు. పోలింగ్ పూర్తయిన రెండు రోజుల తరువాత వీటిలో ఓట్లు లెక్కించనున్నారు. పంచాయతీ ఎన్నికలు పార్టీ రహితంగా.. మిగిలినవన్నీ పార్టీ పరంగా నిర్వహిస్తారు. నోటిఫికేషన్, ఎన్నికల షెడ్యూల్ ఏది ముందు వెలువడితే.. అదే రోజు నుంచి ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుంది. ఎన్నికలకు మొత్తం 1,05,432 బ్యాలెట్ బాక్సులు సిద్ధం చేశారు. తెలంగాణ నుంచి 17,650 బాక్సులు తెప్పించారు.

**ఎన్నికల నిర్వహణకు సిద్ధం: ఎస్ఈసీ**

వీడియో కాన్ఫరెన్స్ అనంతరం ఎస్ఈసీ విలేకర్లతో మాట్లాడారు. 'అన్ని జిల్లాల్లోనూ ఎన్నికల నిర్వహణకు యంత్రాంగం సిద్ధంగా ఉంది. ఓటర్ల జాబితాలు, పోలింగ్ కేంద్రాలు, బ్యాలెట్ బాక్సు, మెటీరియల్ సిద్ధం చేశాం. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు రెండు దశల్లో నిర్వహించాలన్న సూచనలు పరిశీలించి నిర్ణయాన్ని వెల్లడిస్తాం' అని వివరించారు..

## మెగాస్టార్ చిరంజీవిని మర్యాదపూర్వకంగా కలసిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు.



**ఆలమూరు అక్టోబర్ 11(ప్రజాజ్యోతి):**తూర్పుగోదావరి జిల్లాలోని మండల కేంద్రమైన కపిలేశ్వరపురంలో రాజానగరం జీఎస్ఎల్ ఆసుపత్రి యాజమాన్యం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సూర్యచారిటబుల్ హెల్త్ కేర్ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆదివారం రాజమండ్రి విమానాశ్రయానికి విచ్చేసిన మెగాస్టార్ చిరంజీవిని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యానందరావు యోగ క్షేమాలను చిరంజీవి అడిగి తెలుసుకున్నారు. గతం నుండి వారి మధ్య ఉన్న అనుబంధాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఎమ్మెల్యే సత్యానందరావుతో పాటు రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, ఆకుల రామకృష్ణ ఉన్నారు.

## అవుకు కన్యకాపరమేశ్వరి దేవి శరన్నవరాత్రి మహోత్సవాల ఆహ్వాన పత్రిక అందజేత






**బనగానపల్లె:అక్టోబర్=11ప్రజాజ్వోతి** దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని అవుకు పట్టణంలోని శ్రీ కన్యకాపరమేశ్వరి దేవి ఆలయంలో ఈ నెల 11వ తేదీ నుంచి 21వ తేదీ వరకు నిర్వహించనున్న శరన్నవరాత్రి మహోత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికను అవుకు మండల ఆర్యవైశ్య సంఘం సభ్యులు అందజేశారు. రాష్ట్ర మంత్రివర్యులు బీసీ జనార్దన్ రెడ్డి , వారి సతీమణి శ్రీమతి బీసీ ఇందిరా రెడ్డి అందుబాటులో లేని కారణంగా, నంద్యాల జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు టంగుటూరు శీనయ్య గారికి, మంత్రి గారి వ్యక్తిగత కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి గారికి ఆహ్వాన పత్రికను అందించారు. ఈ సందర్భంగా అవుకు పట్టణ శ్రీ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న శరన్నవరాత్రి మహోత్సవాలను భక్తిశ్రద్ధలతో, అత్యంత వైభవంగా నిర్వహించాలని ఆకాంక్షించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ కన్యకాపరమేశ్వరి దేవి అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు.

# గ్రామ రెవెన్యూ సహాయకులకు అండగా ఉంటాం, వైఎస్ఆర్ టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి గొలుగూరి సూర్రెడ్డి



**ఆలమూరు, అక్టోబర్ 11(ప్రజాజ్యోతి):**రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యానికి గురవుతున్న గ్రామ రెవెన్యూ సహాయకులకు (వీఆర్ఏలకు) అన్ని విధాలుగా అండగా ఉంటామని వైఎస్ఆర్ టీయూసీ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ప్రధాన కార్యదర్శి గొలుగూరి సూర్రెడ్డి భరోసా ఇచ్చారు.

**26వ రోజుకు చేరిన వీఆర్ఏల నిరసన దీక్ష**

ఆలమూరు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న ధర్నా చౌక్ వద్ద వీఆర్ఏలు తమ సమస్యల పరిష్కారం కోరుతూ నిర్వహిస్తున్న నిరసన దీక్ష ఆదివారం 26వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వైఎస్ఆర్సీపీ యువ నాయకుడు నాంద్ర నాగ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో గొలుగూరి సూర్రెడ్డి బృందం దీక్షా శిబిరాన్ని సందర్శించి వీఆర్ఏలకు సంఘీభావం తెలిపింది. ఈ సందర్భంగా సూర్రెడ్డి మాట్లాడుతూ, వీఆర్ఏలు ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహిస్తున్న నిరసన దీక్షకు పార్టీ తరఫున సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. దీర్ఘకాలంగా వీఆర్ఏలు తమ సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం విచారకరమన్నారు.

**వైఎస్ జగన్ దృష్టికి వీఆర్ఏల సమస్యలు**

వీఆర్ఏలు ఎదుర్కొంటున్న సమస్యలను వైఎస్ఆర్సీపీ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి ద్వారా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి దృష్టికి తీసుకువెళతామని సూర్రెడ్డి హామీ ఇచ్చారు. వీఆర్ఏలకు న్యాయం జరిగే వరకు వారికి అండగా నిలుస్తామని భరోసా కల్పించారు. అనంతరం వైఎస్ఆర్ టీయూసీ తరఫున వీఆర్ఏల మండల శాఖకు గొలుగూరి సూర్రెడ్డి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో తమలంపూడి ఈశ్వరరెడ్డి, తాడి మధుసూదన్ రెడ్డి, ఇంద్రారెడ్డి, ఆనంద్ మోహన్ రెడ్డితో పాటు గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం అధ్యక్షుడు తాతపూడి ఇస్సాక్, కార్యదర్శి కంతేటి శివరామారావు, ఉపాధ్యక్షుడు భువనగిరి ఏసు, సలహాదారు గూనపల్లి నాగేశ్వరరావు, కోశాధికారి కుందేటి శ్రీను, పలువురు వీఆర్ఏలు పాల్గొని తమ సమస్యల పరిష్కారం కోరుతూ నినాదాలు చేశారు.

## ఆళ్ళగడ్డలో తెలుగు దేశం పార్టీకి భారీ షాక్





**నంద్యాల ఆళ్లగడ్డ:అక్టోబర్=11 ప్రజా జ్వోతి** ఆళ్ళగడ్డలో తెలుగు దేశం పార్టీకి భారీ షాక్ తగిలింది. ఆళ్ళగడ్డలోని స్థానిక వైఎస్ఆర్సిపి కార్యలయం నందు ఆళ్ళగడ్డ మునిసిపాలిటీ పరిధి లోని 13వ వార్డ్ మాజీ కౌన్సిలర్ శ్రీమతి మునగాల మల్లీశ్వరి, మునగాల సంజీవ కుమార్, గుత్తి రంగయ్య, సాత్రి రాజు, దూదేకుల గిరి బాబు, కూరగాయల శ్రీను, యెల్లాలు మరియు సుధీర్ తో పాటు 100 కుటుంబాలు టిడిపిని వీడి వైసిపి తీర్థం పుచ్చుకున్నారు. వీరిని పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదనంగా ఆహ్వానించిన కర్నూల్ పార్లమెంట్ పరిశీలకులు మరియు మాజీ శాసన మండలి సభ్యులు శ్రీ గంగుల ప్రభాకర్ రెడ్డి

## నవరాత్రుల సందర్భంగా వైభవంగా శ్రీనివాస స్వామి కల్యాణోత్సవం




**ప్రజా జ్యోతి నందికొట్కూరు** నందికొట్కూరు మండలం 10-బొల్లవరం గ్రామంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో నవరాత్రుల సందర్భంగా గుజ్జుల గౌరీశ్వర నాయుడు కుటుంబ సభ్యులు శ్రీనివాస స్వామి కల్యాణోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. వేదమంత్రాలు, ప్రత్యేక పూజలు, మంగళవాయిద్యాల నడుమ కల్యాణోత్సవం కన్నులపండువగా సాగింది. ఈ సందర్భంగా గుజ్జుల గౌరీశ్వర నాయుడు మాట్లాడుతూ, పూర్వీకుల నుంచి వస్తున్న ఆచార సంప్రదాయాలను కాపాడుకుంటూ భావితరాలకు అందించాలని అన్నారు. స్వామివారి కృపతో ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు, సిరిసంపదలు, ఆయురారోగ్యాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో భక్తిభావాన్ని పెంపొందించడంతో పాటు, సమాజంలో ఐక్యతను బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు.

# చొప్పెల్ల పిహెచ్ సి ని ఆధునీకరించాలని రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్‌కు బీజేపీ నాయకులు విజ్ఞప్తి.




**ఆలమూరు అక్టోబర్ 11(ప్రజాజ్యోతి):** తూర్పుగోదావరి జిల్లాలోని మండల కేంద్రమైన కపిలేశ్వరపురంలో రాజానగరం జీఎస్ఎల్ ఆసుపత్రి యాజమాన్యం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సూర్యచారిటబుల్ హెల్త్ కేర్ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆదివారం కపిలేశ్వరపురం వచ్చిన రాష్ట్ర వైద్య,ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్ ను కలిసి వినతిపత్రం ఇచ్చిన బీజేపీ ఆలమూరు మండల అధ్యక్షుడు సుంకర శ్రీరాములు(శ్రీరామ్),చొప్పెల్ల పిఏసిఎస్ డైరక్టర్, బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు నాగిరెడ్డి స్వామి. ఈ సందర్భంగా బిజెపి నాయకులు మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం చొప్పెల్ల గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పిహెచ్ సి)లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి, ఆసుపత్రిని ఆధునీకరించడంతో పాటు రోగులకు మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్‌కు విజ్ఞప్తి చేశామని,చొప్పెల్ల పిహెచ్ సి పరిధిలో సుమారు తొమ్మిది గ్రామాలకు చెందిన 45 వేల మంది ప్రజలు వైద్య సేవల కోసం ఈ ఆసుపత్రి పై ఆధారపడుతున్నారని తెలిపారు. అయితే, ఆసుపత్రిలో మౌలిక సదుపాయాలు సరిగా లేకపోవడంతో రోగులు, వైద్య సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మంత్రి కి ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నారు.

**ఆపరేషన్ థియేటర్‌కు మరమ్మతులు అవసరం**

ఆసుపత్రిలోని ఆపరేషన్ థియేటర్‌లో లైట్లు, సీలింగ్ దెబ్బతినడంతో వైద్య సేవలకు ఇబ్బందులు కలుగుతున్నాయని వీటికి తక్షణమే మరమ్మతులు చేపట్టి, అవసరమైన సదుపాయాలు కల్పించాలని మంత్రిని కోరారు.

**స్టోర్ రూమ్ లేక ఇబ్బందులు**

ఆసుపత్రిలో ప్రత్యేక స్టోర్ రూమ్ లేకపోవడంతో మందులు, ఇతర వైద్య సామగ్రిని రోగులు ఉండాల్సిన గదుల్లోనే నిల్వ చేయాల్సి వస్తోందని వివరించారు. దీనివల్ల రోగులకు అసౌకర్యం కలుగుతోందని, మందులు మరియు వైద్య సామగ్రి నిల్వ చేసేందుకు ప్రత్యేక గదిని నిర్మించాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు.

**రోగుల నిరీక్షణ గది నిర్మించాలి**

వైద్య సేవల కోసం ఆసుపత్రికి వచ్చే రోగులు, వారి సహాయకులు వేచి ఉండేందుకు తగిన స్థలం లేకపోవడంతో రోగులు బయటే నిరీక్షించాల్సి వస్తోందని తెలిపారు. రోగుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఆసుపత్రిలో ప్రత్యేక నిరీక్షణ గదిని నిర్మించాలని కోరారు.

**రాత్రివేళ వాచ్‌మెన్‌ను నియమించాలి**

చొప్పెల్ల పిహెచ్ సి లో 24 గంటల పాటు నర్సింగ్ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నప్పటికీ, రాత్రివేళ వాచ్‌మెన్ లేకపోవడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. ఆసుపత్రి భద్రతను దృష్టిలో ఉంచుకుని వాచ్‌మెన్‌ను నియమించాలని కోరారు. ప్రజారోగ్య పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ చొప్పెల్ల పిహెచ్ సి లో అవసరమైన మరమ్మతులు చేపట్టాలని, అదనపు గదులు నిర్మించి, మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని మంత్రి వై. సత్యకుమార్ యాదవ్‌కు విజ్ఞప్తి చేశారు. సంబంధిత అధికారులు ఈ సమస్యలపై స్పందించి, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి కి వినతిపత్రం ద్వారా తెలియజేసినట్లు బిజెపి నాయకులు సుంకర శ్రీరాములు, నాగిరెడ్డి స్వామి తెలియజేశారు.

## ఎన్ టి ఆర్ వైద్య సేవ ట్రస్ట్ లో దోసుకొంటున్న ఆస్పత్రుల పై చర్యలు



**నంద్యాల:అక్టోబర్=11 ప్రజాజ్యోతి** ఎన్ టి ఆర్ వైద్యసేవ ట్రస్ట్'లో అక్రమాలకు పాల్పడే ఆస్పత్రులపై చర్యలు. 203 ఆస్పత్రులపై రూ.34.39 కోట్ల జరిమానాలు విధించిన ఎన్ టి ఆర్ వైద్యసేవ ట్రస్ట్. 25 ఆస్పత్రులపై సస్పెన్షన్లు, 13 ఆస్పత్రులకు చెల్లింపులు నిలిపివేత. 5 ఆస్పత్రులను నెట్‌వర్క్ జాబితాల నుంచి తొలగించిన ఎన్ టి ఆర్ వైద్యసేవ ట్రస్ట్. ఓ ఆస్పత్రి గుర్తింపు రద్దు చేసిన ఎన్ టి ఆర్ వైద్యసేవ ట్రస్ట్ అలాగే తగు అధికారులు నంద్యాలలో ఉన్నట్టు వంటి ఎన్ టి ఆర్ వైద్య సేవ ట్రస్ట్ కొనసాగుతున్న ఆస్పత్రులను కూడ తనిఖీలు చేస్తే చాల అరాచకాలు బయట పడుతాయని నంద్యాల జిల్లా ప్రజలు కోరుతున్నారు

## విశ్వాహిందూ పరిషత్, బజరంగ్ దళ్ వారి నెలవారీ సమావేశం



**గాలివీడు –ప్రజాజ్యోతి.**అన్నమయ్య జిల్లా గాలివీడు మండలంలోని వెంటేశ్వర స్వామి ఆలయం వద్ద విశ్వాహిందూ పరిషత్, బజరంగ్ దళ్, =గూ మరియు బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి అంగడి. శ్రీనివాసులు ఆధ్వర్యంలో నెలవారీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హిందూ సోదరులంతా ఐక్యంగా ఉంటూ ఆలయాల అభివృద్ధి కి కృషి చేయాలని అలాగే హిందూ ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో మండల అధ్యక్షులు హరినాథ్ రెడ్డి మరియు సీనియర్ నాయకులు యర్రనాగు. భాస్కర్ రెడ్డి, రేవనూరు. రాజకుమార్, సీనియర్ నాయకులు రామచంద్ర రెడ్డి గారు మరియు హిందూ సోదరులు పాల్గొన్నారు.

## నంద్యాల : శ్రీశైలంలో ఆదివారం నుంచి ఈ నెల 20 వరకు శ్రీ దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు




**నంద్యాల శ్రీశైలం:అక్టోబర్=11 ప్రజాజ్యోతి** ఆదివారం 9 గంటలకు భ్రమరాంబదేవి ఆలయంలో ఉత్సవాలకు అంకురార్పణ అదేరోజు రాత్రి 7 గంటలకు 'శైలపుత్రి అలంకారం'లో అమ్మవారి దర్శనం రాత్రి 7:30 గంటలకు శ్రీ స్వామి, అమ్మవార్లకు బృంగి వాహనంపై గ్రామోత్సవం. శరన్నవరాత్రి మహోత్సవాల దృష్ట్యా ఉత్సవాలు, ఆర్జిత హోమాలు నిలుపుదల

## నందికొట్కూరు పట్టణంలో రూ.17.50 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శ్రీకారం



**ప్రజా జ్యోతి నందికొట్కూరు** నందికొట్కూరు పట్టణంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి మరో ముందడుగు పడింది. పట్టణ ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా, మొత్తం 9.70 కిలోమీటర్ల మేర రూ.17.50 కోట్ల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు నంద్యాల పార్లమెంట్ టీడీపీ ఇన్‌చార్జి శ్రీ మాండ్ర శివానందరెడ్డి నందికొట్కూరు శాసనసభ్యులు గిత్త జయసూర్య భూమిపూజ నిర్వహించి పనులను ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో భాగంగా బైరెడ్డి శేషశయనారెడ్డి నగర్‌లోని 6 రోడ్లు, అయ్యప్ప స్వామి దేవాలయం వద్ద సీసీ రోడ్డు, పటేల్ సెంటర్--గుడ్డి జిన్ను సీసీ రోడ్డు, మారుతి నగర్ సీసీ రోడ్డు, బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి నగర్ --కర్నూలు సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు.ఈ రహదారుల నిర్మాణం పూర్తయితే పట్టణ ప్రజలకు రాకపోకలు మరింత సులభతరం కావడంతో పాటు, ట్రాఫిక్ సమస్యలు తగ్గి, కాలనీల్లో రహదారి సౌకర్యాలు మెరుగుపడనున్నాయి. ప్రజల అవసరాలను గుర్తించి పట్టణ అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు.నందికొట్కూరు పట్టణాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రజాప్రతినిధులు నిరంతరం కృషి చేస్తున్నారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించి, పట్టణ అభివృద్ధికి బాటలు వేయడమే తమ లక్ష్యమని వారు తెలిపారు.ఈ కార్యక్రమం లో మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి, డి ఈ, నాసిర్ బాషా,ఏఈ దినేష్ కుమార్, ముత్తు జావలి, లాయర్ జాకీర్, మాజీ కౌన్సిలర్ జాకీర్ ఉస్సేన్, సురేంద్రబాబు, మల్లికార్జున్ రెడ్డి, ఆయిల్ రవికుమార్, దేశెట్టి శ్రీనివాసులు, సుమలత, డాక్టర్ వనజ, మీనాక్షి, అనురాధ, సన అబ్దుల్లా, గోవర్ధనగిరి, పాండు, గని కళాఖర్, తదితరులు పాల్గొన్నారు.

## వెంకటాయపాలెం గ్రామంలో విద్యుత్ మోటారు బోరు ఏర్పాటు



**కూనవరం అక్టోబర్ 11. ప్రజా జ్యోతి** పోలవరం జిల్లా కూనవరం మండలం వెంకటాయపాలెం గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న తీవ్ర నీటి కొరత సమస్యను పరిష్కరించేందుకు జలజీవన్ మిషన్ ద్వారా విద్యుత్ మోటారుతో కూడిన బోరును ఏర్పాటు చేశారు. గ్రామసభలో గ్రామ ప్రజలు నీటి సమస్యను స్పెషల్ ఆఫీసర్ దృష్టికి తీసుకెళ్లగా, సమస్య పరిష్కారానికి తీర్మానం చేయడం జరిగింది. అనంతరం బోరు ఏర్పాటు చేపట్టి, ఈరోజు నాయకులు కొబ్బరికాయలు కొట్టి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో టీడీపీ మండల ఆర్గనైజింగ్ సెక్రటరీ మడకం చిన్ని, గ్రామ శాఖ అధ్యక్షులు మేడం రవిచంద్ర ప్రసాద్, బూత్ ఇన్‌చార్జి మడకం రవి, గ్రామ శాఖ ఎస్సీ సెల్ అధ్యక్షులు బెల్లం సుధాకర్, జనసేన ముఖ్య నాయకులు బల్లెం వంశీ తదితరులు పాల్గొన్నారు.గ్రామ ప్రజలకు నీటి సౌకర్యం కల్పించేందుకు చేపట్టిన ఈ కార్యక్రమం పట్ల స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు.

## నందికొట్కూరులో వైభవంగా వాసవి దేవి శరన్నవరాత్రులు ప్రారంభం



**ప్రజా జ్యోతి నందికొట్కూరు** నందికొట్కూరు పట్టణంలోని శ్రీ చక్ర సహిత వాసవి కన్యకా పరమేశ్వరి దేవి ఆలయంలో ఆదివారం (అక్టోబర్ 11) శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారికి సుప్రభాత సేవ, పవిత్ర జలాలు, పంచామృతాలు, పంచద్రవ్యాలతో అభిషేకాలు, గోపూజ, పతాకావిష్కరణ, కలశ స్థాపన, విశేష పూజలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ ఈసీ సభ్యుడు వీరబొమ్మ నాగ సత్యనారాయణ, భూదాతల కుటుంబ సభ్యులు, ఇతర ప్రముఖులు, ప్రత్యేక అతిథిగా బ్రాహ్మణ కోట్కూరు ఎస్సై మణికంఠ పాల్గొన్నారు. అనంతరం మహా మంగళహారతి, తీర్థప్రసాదాల పంపిణీ జరిగింది. పట్టణ ఆర్యవైశ్యులు, ఆలయ కమిటీ సభ్యులు కుటుంబ సమేతంగా పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేశారు. ఈ విషయాన్ని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు భీమిశెట్టి జయరామకృష్ణ తెలిపారు.

## పబ్లిక్ టాయిలెట్స్ వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలి

-ఎఐటియుసి

### పబ్లిక్ టాయిలెట్స్ వర్కర్స్ కు కనీస వేతనం అమలు చేయకపోతే ఉద్యమం తప్పదు



**నంద్యాల:అక్టోబర్=11 ప్రజాజ్యోతి** నంద్యాల సిపిఐ కార్యాలయంలో జరిగిన పబ్లిక్ టాయిలెట్ వర్కర్స్ యూనియం సమావేశంలో కాంట్రాక్టర్ను, అధికారులను హెచ్చరించిన ఎఐటియుసి నంద్యాల సిటీ అధ్యక్ష, కార్యదర్శులు డి. శ్రీనివాసులు, ధనుంజయ్ పబ్లిక్ టాయిలెట్ వర్కర్స్ కు కనీస వేతనం 16500 ఇవ్వాలని,పని భారం ఒత్తిడి తగ్గించాలని పబ్లిక్ టాయిలెట్ వర్కర్స్ ను తీసివేయకుండా ఎవరి స్థానంలో వారినే కొనసాగించాలని, జీతాలు ఐదు నుండి పదో తేదీ లోపు ఇవ్వాలని,పబ్లిక్ టాయిలెట్స్ క్లీన్ చేయడానికి కావాల్సిన సామాగ్రిని అందజేయాలని, గత రెండు నెలల నుండి పెండింగ్ లో ఉన్నటువంటి పబ్లిక్ టాయిలెట్ వర్కర్స్ జీతాలను తక్షణమే చెల్లించాలని ఈరోజు స్థానిక సిపిఐ కార్యాలయంలో జరిగినటువంటి పబ్లిక్ టాయిలెట్ వర్కర్స్ యూనియన్ సమావేశంలో ఏఐటియుసి నంద్యాల పట్టణ అధ్యక్ష కార్యదర్శులు డి శ్రీనివాసులు ధనుంజయ్, పబ్లిక్ టాయిలెట్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఈశ్వరమ్మ సుబ్బమ్మ,రాధ లు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పబ్లిక్ టాయిలెట్స్ వర్కర్స్ లక్ష్మి దేవి, కాశమ్మ,సరోజమ్మ, లక్ష్మదేవి, వెంకటమ్మ, సునీత, భరత్, పెంచలమ్మా,నాగమద్దమ్మ, పెంచలమ్మా, నరసమ్మ దేవి తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో రౌడీషీటర్లకు పోలీసుల కౌన్సెలింగ్



**బద్వేల్ స్టాఫ్ రిపోర్టర్ అక్టోబర్ 11 (ప్రజాజ్యోతి)** రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బద్వేల్ అర్బన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు, అనుమానితులకు పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించారు. మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్, బద్వేల్ అర్బన్ సీఐ బి. రామకృష్ణ ఆధ్వర్యంలో అర్బన్ ఎస్ఐలు జయరాములు, రంగారావు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రౌడీషీటర్లు, అనుమానితులు ఎలాంటి నేరపూరిత, సంఘవిద్రోహ కార్యకలాపాలకు పాల్పడకూడదని పోలీసులు స్పష్టంగా ఆదేశించారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు దూరంగా ఉండాలని, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియలో పాల్గొనేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని పోలీసులు సూచించారు.

## చొప్పెల్ల శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి గుడి సెంటర్‌లో ఘనంగా శ్రీ శారదాదేవి అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం



**ఆలమూరు అక్టోబర్ 11(ప్రజాజ్యోతి):**ఆలమూరు మండలం చొప్పెల్ల గ్రామంలోని శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి గుడి సెంటర్‌లో శ్రీ శారదాదేవి అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు ఆదివారం గ్రామస్థులు, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి.గ్రామ పురోహితులు బ్రహ్మశ్రీ ముసునూరి వెంకన్నబాబు సారథ్యంలో శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ కనకమహాలక్ష్మి ఈవెంట్స్ అధినేత నందపునీడి గోవిందరాజు, భాగ్యలక్ష్మి దంపతులు అమ్మవారి కలశ స్థాపన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ ఏడాది కూడా శ్రీ శారదాదేవి అమ్మవారి విగ్రహాన్ని నందపునీడి గోవిందరాజు, భాగ్యలక్ష్మి దంపతులే సమకూర్చడం విశేషం. అమ్మవారి నవరాత్రి ఉత్సవాల ప్రారంభంతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.గ్రామస్థులు, కమిటీ సభ్యులు ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు, భారీ అన్నసంతర్పణ చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నామని,ఇక్కడ శ్రీ శారదాదేవి అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు చేయడం ఇది 34 వ సంవత్సరం అని ఉత్సవ కమిటీ సభ్యులు తెలియజేసారు.

## టి.డి.పిలో చేరిన మద్దిపాడు గ్రామం యువతీ. యువకులు.



**అనంతగిరి మండలం. అక్టోబర్ 11. ప్రజా జ్యోతి న్యూస్.రిపోర్టర్ శంకర్.** అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం. గుమ్మ గ్రామపంచాయతీ పరిధి మద్దిపాడు గ్రామానికి చెందిన పదిమంది యువతీ యువకులు గుమ్మ పంచాయతీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పాడి నాగేశ్వరరావు. మాజీ సర్పంచ్ దూరు వీరన్న దొర. దూరు నాగేశ్వరరావు దూరు రామన్న దొర. తదితరుల సమక్షంలో ఆదివారం నాడు తెలుగుదేశం పార్టీలో చేరినట్లు గ్రామ అధ్యక్షుడు పాడి నాగేశ్వరరావు విలేకరులకు తెలిపారు. కూటమి ప్రభుత్వం అమలుపరుస్తున్న అభివృద్ధి పథకాలు ఆకర్షితులై పార్టీలోకి రావడం జరిగిందని అన్నారు.

## మెగాస్టార్ చిరంజీవిని మర్యాదపూర్వకంగా కలిసిన టీడీపీ మండల కార్యదర్శి సలాది నాగేశ్వరరావు.



**ఆలమూరు అక్టోబర్ 11(ప్రజాజ్యోతి):**మెగాస్టార్ చిరంజీవిని టీడీపీ ఆలమూరు మండల కార్యదర్శి, వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం పాలక మండలి సభ్యులు సలాది నాగేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిశారు. తూర్పుగోదావరి జిల్లాలోని మండల కేంద్రమైన కపిలేశ్వరపురంలో రాజానగరం జీఎస్ఎల్ ఆసుపత్రి యాజమాన్యం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సూర్యచారిటబుల్ హెల్త్ కేర్ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆదివారం రాజమండ్రి విమానాశ్రయానికి విచ్చేసిన మెగాస్టార్ చిరంజీవిని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావుతో కలిసి సలాది నాగేశ్వరరావు మెగాస్టార్ ని కలిశారు. ఈ సందర్భంగా చిరంజీవికి అభివందనం చేసి ఆయన ఆశీస్సులు పొందారు. మెగాస్టార్‌ను కలుసుకోవడం పట్ల సలాది ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, తెలుగు రైతు అధికార ప్రతినిధి ఆకుల రామకృష్ణతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## ఆలూరులో టీడీపీ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి బీసీ సమావేశం!



**అక్టోబర్ 11 (ప్రజా జ్యోతి) న్యూస్ రిపోర్టర్ వీరేష్** బీసీలకు 34% పార్టీ టికెట్ల కేటాయింపుపై కీలక చర్చ! రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34% పార్టీ టికెట్లు కేటాయించే అంశంపై ఆలూరు టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి బీసీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆలూరు టీడీపీ ఇంచార్జ్ శ్రీమతి వైకుంఠం జ్యోతి గారు అధ్యక్షత వహించి, బీసీల రాజకీయ ప్రాతినిధ్యానికి అధిక ప్రాధాన్యత కల్పించడంపై నాయకులతో చర్చించారు. బీసీల రాజకీయ ప్రాతినిధ్యంలో రాజీ లేదు బీసీలకు తగిన ప్రాధాన్యత కల్పించడమే లక్ష్యం! ఈ సమావేశంలో నియోజకవర్గ చైర్మన్, ఆరు మండలాల కన్వీనర్లు, సొసైటీ చైర్మన్లు, పార్టీ నాయకులు పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేశారు.

## లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా దేవరకొండ వరప్రసాద్

రిటైర్డ్ డీఎస్పీకి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడి సమక్షంలో బాధ్యతలు



**బాపట్ల అక్టోబర్ 11 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** రిటైర్డ్ డీఎస్పీ దేవరకొండ వరప్రసాద్ లిబరేషన్ కాంగ్రెస్ పార్టీలో చేరడంతో పాటు రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమితులయ్యారు. పార్టీ అధ్యక్షుడు, మాజీ ఐఏఎస్ అధికారి విజయ్ కుమార్ జి. శ్రీకర్ సమక్షంలో ఆయన పార్టీ కండువా కప్పుకున్నారు. వరప్రసాద్‌తో పాటు ఆయన అనుచరులు కూడా పార్టీలో చేరారు. ఈ సందర్భంగా లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు అత్తులూరి సుభాష్ దినకర్ వరప్రసాద్‌కు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. పార్టీలో చేరిన వరప్రసాద్‌తో పాటు ఆయన అనుచరులకు సాదర స్వాగతం పలికారు.

# స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధతపై టీడీపీ నాయకుల సమావేశం





**కూనవరం, అక్టోబర్ 11:** ప్రజా జ్యోతి స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధతలో భాగంగా కూనవరం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఎడవల్లి భాస్కరరావు, ప్రధాన కార్యదర్శి పొడియం అప్పారావు బొజ్జరాయి గూడెం మరియు లింగాపురం నాయకులతో మరియు. ఆ గ్రామాలకు చెందిన టీడీపీ సీనియర్ నాయకులు, గ్రామస్తులతో సమావేశమై ఎన్నికల సన్నద్ధతపై చర్చించారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ఎలా పనిచేయాలి, కేడర్‌ను ఎలా బలోపేతం చేయాలి, గ్రామస్థాయి నాయకులతో కలిసి పనిచేస్తూ ప్రజలతో నిరంతరం ఎలా మమేకం కావాలి అనే అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఎన్నికల సమయంలో అనుసరించాల్సిన కార్యాచరణ, గ్రామస్థాయిలో పార్టీ కార్యకలాపాలను బలోపేతం చేసే అంశాలపై నాయకులకు సూచనలు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లిటీడీపీ మండల అధ్యక్షుడు ఎడవల్లి భాస్కరరావు, ప్రధాన కార్యదర్శి పొడియం అప్పారావుతో పాటు క్లస్టర్ ఇంచార్జ్ మోసం రాము కో క్లస్టర్ షేక్ రసూల్ ఎస్టీ సెల్ కార్యదర్శి సోడె మధుసూదన్ రావు యూనియన్ పించార్జ్ కుంజ వెంకట్ , సోడే వీరభద్రం బొగ్గ రాఘవయ్య బొగ్గ ప్రసాద్ బిరబోయిన సుబ్బారావు, బొగ్గ కన్నయ్య, పైదా రాజయ్య, గుండం రాజు ,పులి కిరణ్, జల్లి రామారావు, తదితరులు నాయకులు కార్యకర్తలు పాల్గొనడం జరిగింది .

# దాతల సహాయంతోనే అమ్మవారి విగ్రహం ఏర్పాటు

..ఏటి గంగమ్మ ఆలయ కమిటీ



చెన్నూరు.. స్థానిక వనం వీధిలో ఏటిగట్టున నిర్మించ తలపెట్టిన ఏటి గంగమ్మ దేవస్థానంలో అమ్మవారి విగ్రహం ఏర్పాటు చేయడం కోసం, భక్తుల సహకారంతోనే ఏర్పాటు చేయాలని ఏ ఒక్కరి పేరుతో అమ్మవారి విగ్రహం ఉండకూడదన్న ఉద్దేశంతోనే జోల పట్టే కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని స్థానిక వనం వీధి ఏటి గంగమ్మ ఆలయ కమిటీ నిర్వాహకులు పేర్కొన్నారు. ఆదివారం అమ్మవారి విగ్రహం కోసం జోల పట్టె కార్యక్రమాన్ని తలపెట్టడం జరిగింది. ఈ సందర్భంగా ఏటి గంగమ్మ ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ అమ్మవారి విగ్రహాన్ని మేము ఒకరమే తీపిస్తామంటూ ఎంతోమంది దాతలు ముందుకు రావడం జరిగిందని, అలా చేస్తే రాబోయే కాలంలో ఏవైనా సమస్యలు తలెత్తుతాయి అన్న ఉద్దేశంతోనే దాతల సహకారంతోనే అమ్మవారి విగ్రహ ఏర్పాటు కోసం జోల పట్టే కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. విగ్రహ ఏర్పాటుకు ఎంత ఖర్చు అవుతుందో అంతా ఏ ఒక్కరి పేరు మీద కాకుండా అందరి సహకారంతోనే ఏర్పాటు చేయాలని, ఆలయ కమిటీ నిర్ణయించడం జరిగిందన్నారు. కావున దాతలు తోచినంత ఎంత తోస్తే అంత సహాయం చేయాలని అమ్మవారి విగ్రహ ఏర్పాటు కోసమేనని పేర్కొన్నారు. ఇప్పటికే దాతల సహకారంతో ఏటి గంగమ్మ గుడి నిర్మాణం దాదాపుగా పూర్తికావచ్చిందని ఇంకా విగ్రహ ఏర్పాటు ప్రతిష్ట కార్యక్రమాలు తదితర పనులు చేయాల్సి ఉందన్నారు. అందుకోసమే అమ్మవారి విగ్రహ ఏర్పాటు కోసం జోల పట్టే కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందని, దాతలు సహకరించి విగ్రహ ఏర్పాటుకు సహకరించాలని ఆలయ కమిటీ నిర్వాహకులు కోరారు. ఈ ఆలయ నిర్మాణం కోసం స్థానిక యువ నాయకుడు గుగ్గిళ్ళ చాణుక్య 10 లక్షల రూపాయలు విరాళం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో గుగ్గిళ్ళ చాణుక్య, ఏటి గంగమ్మ ఆలయ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.

# బీసీలకు 34 శాతం రిజర్వేషన్లపై హర్షం

సీఎం చంద్రబాబుకు టీడీపీ మైనారిటీ నేతల కృతజ్ఞతలు....!

హొళగుందలో వహీద్ హుస్సేన్‌కు ఘన సత్కారం..

మండల సమస్యలు, పార్టీ బలోపేతంపై చర్చలు



**హొళగుంద, అక్టోబర్ 11, ప్రజా జ్యోతి న్యూస్** బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించే అంశానికి ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు టీడీపీ హొళగుంద మండల మైనారిటీ నాయకులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. బీసీల రాజకీయ ప్రాతినిధ్యం, సామాజిక అభ్యున్నతికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై వారు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం నాడు వివాహ శుభకార్యంలో పాల్గొనేందుకు హొళగుందకు విచ్చేసిన టీడీపీ మాజీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, మార్కాపురం పరిశీలకులు వహీద్ హుస్సేన్‌ను మండల టీడీపీ మైనారిటీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. అనంతరం హొళగుంద మండలంలోని స్థానిక సమస్యలు, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు, మైనారిటీల సంక్షేమం, పార్టీ సంస్థాగత బలోపేతం తదితర అంశాలపై చర్చించారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని, రాబోయే ఎన్నికల్లో పార్టీ విజయానికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో, ఐక్యంగా పనిచేయాలని అభిప్రాయపడ్డారు. బీసీలకు రాజకీయంగా మరింత ప్రాతినిధ్యం కల్పించడంతో పాటు వారి అభ్యున్నతికి కృషి చేయడం అభినందనీయమని నాయకులు పేర్కొన్నారు. "బీసీలు అంటే తెలుగుదేశం పార్టీ.. తెలుగుదేశం పార్టీ అంటే బీసీలు" అనే నినాదానికి అనుగుణంగా బీసీల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం మరింత కృషి చేయాలని ఆకాంక్షించారు. బీసీల అభ్యున్నతికి ప్రాధాన్యతనిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు మరోసారి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ మైనారిటీ నాయకుడు డీఎస్ బాషా,మండల మైనారిటీ అధ్యక్షుడు ముల్లా మోయిన్, మాజీ సర్పంచ్ హెసాన్, టీడీపీ యువ నాయకుడు ఈబదుల్లా, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

# 15 రోజులుగా రోడ్డుపైనే వృద్ధురాలు.. ఆదుకున్న అల్-ఇందద్ చారిటబుల్ ట్రస్ట్

– వృద్ధురాలికి వైద్యం అందించి నిర్మల వృద్ధాశ్రమానికి తరలింపు



**హిందూపురం: ప్రజా జ్యోతి న్యూస్: అక్టోబర్ 11:** శ్రీ సత్య సాయి జిల్లా బ్యూరో అంజి:హిందూపురం మున్సిపాలిటీ పరిధిలోని ఎల్లమ్మ దేవస్థానం బాయిపేట సమీపంలో గత 15 రోజులుగా ఉంటున్న 76 ఏళ్ల వృద్ధురాలిని అల్-ఇందద్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు ఆదుకున్నారు స్థానికులు ఆమెకు భోజనం అందిస్తూ సహాయం చేస్తున్నప్పటికీ ఆరోగ్యం బాగోలేకపోవడంతో ఈ విషయాన్ని ట్రస్ట్ దృష్టికి తీసుకువచ్చారు వెంటనే స్పందించిన ట్రస్ట్ అధ్యక్షుడు ఎం డీ ఎస్ అమన్ వృద్ధురాలి కుటుంబ సభ్యులతో మాట్లాడి పరిస్థితిని తెలుసుకున్నారు అనంతరం ఆమెను హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్య సహాయం అందించి తదుపరి సంరక్షణ కోసం హిందూపురం సమీపంలోని కుట్నూరు వద్ద ఉన్న నిర్మల వృద్ధాశ్రమానికి తరలించారు ఈ సందర్భంగా ట్రస్ట్ అధ్యక్షుడు ఎం డీ ఎస్ అమన్ మాట్లాడుతూ తల్లిదండ్రులు దైవంతో సమానమని వృద్ధాప్యంలో వారిని ప్రేమతో ఆదరించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు మనల్ని కంటికి రెప్పలా కాపాడి, మన ఆకలి తీర్చిన అమ్మకు వృద్ధాప్యంలో కన్నీళ్లు మిగలకూడదు తల్లిదండ్రులను బతికున్నప్పుడే ప్రేమించాలి గౌరవించాలి వారు కోరుకునేది ఆస్తులు కాదు నాలుగు ప్రేమ మాటలు ఆప్యాయత ఆదరణ మాత్రమే తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేయకుండా వృద్ధులకు అండగా నిలవడమే నిజమైన మానవత్వం అని సమాజానికి సందేశమిచ్చారు ఈ సేవా కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు ఎం డీ ఎస్ అమన్ కార్యదర్శి ఉమర్ ఫరూక్ క్యాషియర్ అర్ఫాత్ రెహాన్ హుజిఫ్ ముబారక్ గౌస్ చిన్న అబూబకర్ ఇస్మాయిల్ ఆటో అఫ్జల్ తదితరులు పాల్గొన్నారు ఆపదలో ఉన్నవారికి మతాలకు అతీతంగా సహాయం చేయడమే అల్-ఇందద్ చారిటబుల్ ట్రస్ట్ లక్ష్యమని సభ్యులు తెలిపారు సమాజానికి సందేశం అమ్మను ప్రేమించండి నాన్నను గౌరవించండి వృద్ధులను ఆదరించండి మనల్ని పెంచిన చేతులు వృద్ధాప్యంలో ఒంటరిగా మిగిలిపోకుండా చూడటం మనందరి బాధ్యత

## గ్రామాల్లో రాత్రి బసతో ప్రజలకు భరోసా

ప్రశాంత ఎన్నికలే లక్ష్యంగా మెగా పల్లె నిద్ర




**విజయనగరం అక్టోబర్ 11 (ప్రజా జ్యోతి ప్రతినిధి)** స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా, స్వేచ్ఛాయుతంగా నిర్వహించడంతో పాటు గ్రామాల్లో శాంతిభద్రతలను పటిష్టంగా పర్యవేక్షించేందుకు పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా జిల్లా ఎస్పీ ఎ.ఆర్. దామోదర్ ఆదేశాలతో శనివారం జిల్లా వ్యాప్తంగా మెగా పల్లె నిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. పోలీసు అధికారులు, సిబ్బంది గ్రామాల్లో రాత్రి బస చేసి ప్రజలతో సమావేశమై స్థానిక సమస్యలు, ఎన్నికల సమయంలో ఎదురయ్యే సవాళ్లపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో గతంలో చోటుచేసుకున్న వివాదాలు, రాజకీయ ఘర్షణలకు ఆస్కారమున్న ప్రాంతాలను గుర్తించి ముందస్తు చర్యలు చేపట్టాలని పోలీసు సిబ్బందికి సూచించారు. ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని కోరారు. ఎన్నికల సమయంలో ప్రలోభాలకు లొంగకుండా, గొడవలకు దూరంగా ఉండాలని ప్రజలకు సూచించారు. చట్టవిరుద్ధ కార్యకలాపాలు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఘటనలపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. డ్రగ్స్‌కు దూరంగా ఉండటం, మహిళలు, బాలల భద్రత, రహదారి భద్రత, సైబర్ నేరాల నివారణపై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. విజయనగరం డీఎస్పీ ఎస్. లక్ష్మణమూర్తి కొండరాజుపేటలో, చీపురుపల్లి డీఎస్పీ ఎస్. రాఘవులు ఉత్తరావల్లిలో, బొబ్బిలి డీఎస్పీ ఆర్. గోవిందరావు రోంపల్లిలో పల్లె నిద్ర కార్యక్రమంలో పాల్గొని రాత్రి బస చేశారు. ఆయా ప్రాంతాల్లో సీఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొని ప్రజలకు భద్రతపై అవగాహన కల్పించారు.

## ఎన్నికల నేపథ్యంలో పోలీసుల విస్తృత తనిఖీలు. వాహనాలు, మద్యం స్వాధీనం

జిల్లాలో కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లు. 107 వాహనాలు, 29 మద్యం బాటిళ్లు స్వాధీనం




**బాపట్ల అక్టోబర్ 11 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగేలా పటిష్ట చర్యలు చేపడుతున్నట్లు బాపట్ల జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి పోలీసు తనిఖీలు ముమ్మరం చేసినట్లు పేర్కొన్నారు. ఆదివారం జిల్లాలోని మార్టూరు, కర్లపాలెం, చీరాల రూరల్, చిన్నగంజాం పోలీస్‌స్టేషన్ల పరిధిలో నిర్వహించిన కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లలో సరైన ధ్రువపత్రాలు లేని 107 వాహనాలు, అక్రమంగా విక్రయిస్తున్న 29 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఎస్పీ ఆదేశాలతో బాపట్ల డీఎస్పీ సీహెచ్. చంద్రమౌళి, చీరాల డీఎస్పీ ఎం.డి. మోయిన్ ఆధ్వర్యంలో పోలీసులు ఆయా ప్రాంతాల్లో ఇంటింటా తనిఖీలు నిర్వహించారు. కొత్త వ్యక్తులు, అనుమానాస్పద కదలికలపై ఆరా తీశారు. స్వాధీనం చేసుకున్న వాహనాల్లో 98 ద్విచక్ర వాహనాలు, తొమ్మిది ఆటోలు ఉన్నాయి. మార్టూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని జనార్దన్ కాలనీలో నిర్వహించిన తనిఖీల్లో 53 వాహనాలు, కర్లపాలెం పరిధిలోని తుమ్మలపల్లి గ్రామంలో 19 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. చీరాల రూరల్ పరిధిలోని గవినివారిపాలెంలో 35 వాహనాలతో పాటు 29 మద్యం బాటిళ్లను పట్టుకుని కేసు నమోదు చేశారు. చిన్నగంజాం పరిధిలోని సంతరావూరు గ్రామంలో తనిఖీల అనంతరం పోలీసులు కవాతు నిర్వహించారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఈ ఆపరేషన్లు చేపట్టారు.

## నేడు జిల్లా వ్యాప్తంగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ప్రజల సమస్యలకు సత్వర పరిష్కారం

జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి



**నంద్యాల జిల్లా: బ్యూరో అక్టోబర్ 11 (ప్రజా జ్యోతి)** జిల్లా ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు సోమవారం జిల్లా వ్యాప్తంగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో ఆమె ఈ వివరాలు వెల్లడించారు. జిల్లా కలెక్టరేట్‌తో పాటు రెవెన్యూ డివిజన్, మండల పరిషత్, మున్సిపల్ కార్యాలయాల్లో ఉదయం 10 గంటల నుంచి ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు సమర్పించిన అర్జీలను సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల మేరకు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటారని తెలిపారు. ప్రజలు తమ సమస్యలను ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లోనూ నమోదు చేసుకోవచ్చని కలెక్టర్ వివరించారు. సమర్పించిన అర్జీల పరిష్కార స్థితిని 1100 టోల్‌ఫ్రీ నంబరు ద్వారా తెలుసుకోవచ్చన్నారు. ప్రజలు ముందుగా మండల, రెవెన్యూ డివిజన్ లేదా మున్సిపల్ స్థాయిలో తమ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. ఆయా స్థాయిల్లో పరిష్కారం కాని సమస్యలను జిల్లా స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సమర్పించాలని కోరారు. జిల్లా కేంద్రంలో నిర్వహించే కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరై ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించాలని కలెక్టర్ ఆదేశించారు.

# ప్రజా ఉద్యమాలపై నిర్బంధ కాండను ఖండించండి

### ఎలక్షన్ కమిషన్ రాజీనామా చేసే వరకు ప్రజా ఉద్యమం ఆగదు...

### వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు కంకణాల ఆంజనేయులు....




**బ్రహ్మంగారిమఠం- ప్రజా జ్యోతి అక్టోబర్ 11** చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసేవరకు ప్రజా ఉద్యమాలు ఆగవని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కోశాధికారి కంకణాల ఆంజనేయులు అన్నారు. సర్‌ను రద్దు చేయాలని, సిఇసి జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని బ్రహ్మం గారిమఠం లోని 5రోడ్ల సెంటర్ నందు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ జ్ఞానేశ్ కుమార్ ను కేంద్ర ప్రభుత్వం అక్రమ పద్ధతుల్లో ఎన్నికల కమిషనర్ గా నియమించిందని అన్నారు. తమకు అనుకూలమైన ఓట్లను పెంపొందించుకొని, వ్యతిరేకమైన ఓట్లను కుదించే విధంగా ఓటర్ లిస్ట్ ను తయారు చేయడం వంటి పద్ధతిని బిజెపి డైరెక్షన్ లో ఎలక్షన్ కమిషన్ నిర్వహిస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తొలగించబడిన ఓట్లన్నీ విదేశాల నుంచి అక్రమంగా చొరబడి వచ్చిన వారే అని దేశ ప్రజలను మభ్యపుచ్చే విధంగా బిజెపి ప్రచారం చేస్తున్నదని అన్నారు. ఈ కాలంలో జరిగిన 8 రాష్ట్రాల ఎన్నికల్లో ఎలక్షన్ కమిషన్ ఈ తరహా లోనే బిజెపికి అనుకూలంగా వ్యవహరించిందని అన్నారు. బెంగాల్లోని భవానీపూర్ మమతా బెనర్జీ నియోజకవర్గంలో 47,094 ఓట్లు తొలగించారని, ఆమె 15,102 ఓట్లతో ఓడిపోయారని తెలిపారు. తమిళనాడులోనీ కోలట్టూరు లో 83,402 ఓట్లు తొలగించారని, 8,597 ఓట్లతో స్టాలిన్ ఓడిపోయారని అన్నారు. తమకు వ్యతిరేకంగా మాట్లాడుతున్న వారి పట్ల, వ్యతిరేకిస్తారు అనే ఓట్ల పట్ల ప్రభుత్వం ఈ పద్ధతిలోనే అనుసరిస్తున్నదని అన్నారు. దేశంలో 13.85 కోట్ల ఓట్లు సర్ పేరుతో తొలగించారని అన్నారు. భారత రాజ్యాంగం వయోజనులందరికీ కల్పించిన ఓటు హక్కును కొందరికి పరిమితం చేసే విధంగా, అప్రజాస్వామిక పద్ధతులో బిజెపి, ఎలక్షన్ కమిషన్ కలిసి వ్యవహరించటం చట్టరీత్యా నేరమని, వారిని గద్దె దించాలని, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. భారత రాజ్యాంగం కల్పించిన భావ ప్రకటనా స్వేచ్ఛను హరించే విధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని మండి పడ్డారు. సభలు పెట్టుకోవటం, అన్యాయాన్ని ప్రశ్నించడం, నిరసన తెలిపే హక్కు రాజ్యాంగం కల్పించిందని అన్నారు. ఢిల్లీలోను, దేశవ్యాప్తంగా ఎలక్షన్ కమిషన్ అక్రమాలను ప్రశ్నించిన, నిరసించిన వారిని బిజెపి ప్రభుత్వం అరెస్టులు చేయడం, నిర్బంధానికి గురి చేయటం రాజ్యాంగాన్ని ధిక్కరించటమేనని అన్నారు. ప్రజాతంత్ర వాదులంతా బిజెపి నిరంకుశత్వంపై నిరసన తెలపాలని విజ్ఞప్తి చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లాఅధ్యక్ష కార్యదర్శులు జి.శివకుమార్, వి,అన్వేష్ మాట్లాడుతూ ఎలక్షన్ కమిషన్ అక్రమాలపై దేశమంతా గగ్గోలు పెడుతుంటే మన రాష్ట్రంలో ఉన్న టిడిపి, జనసేన, వైసీపీ లాంటి పార్టీలు స్పందించకపోవడం విచారకరమని అన్నారు. రాష్ట్రంలో ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసుకుంటున్న ఈ పార్టీలు కేంద్రంలో బిజెపికి వాంతపడటం సిగ్గుచేటని అన్నారు. దేశంలో ఆధార్ కార్డు అన్నిటికీ గుర్తింపు కార్డుగా ఉంటే, ఓటు కార్డుకు దాన్ని పరిగణలోకి తీసుకోకపోవడం అన్యాయం అని అన్నారు. ప్రపంచంలో గొప్ప ప్రజాస్వామ్య దేశం అని చెప్పుకుంటున్న మన దేశం జీవించి ఉన్న ఓటర్లను హత్య చేసిందని అన్నారు. ఇది ఒక రకంగా ప్రజాస్వామ్యాన్ని హత్య చేయడం లాంటిదేగాని అన్నారు. రాజ్యాంగాన్ని కాపాడాల్సిన పాలకులు, రాజ్యాంగం కల్పించిన హక్కులను తుంగలో తొక్కుతున్నారని మండిపడ్డారు. బిజెపి అండతో ఎలక్షన్ కమిషన్ నిర్వహిస్తున్న అక్రమాలకు వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమాన్ని ప్రజాతంత్ర వాదులంతా బలపరచాలని, ప్రజా ఉద్యమాలపై నిర్బంధకాండను ఖండించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమానికి గండి సునీల్ కుమార్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వీరయ్య,మండల అధ్యక్షులు హరి, షరీఫ్, జహంగీర్ లాజర్, రమనమ్మ, అజయ్,రాహుల్, వీరభద్రుడు, తమస్, చిన్నక్క, కళావతి, సుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు

# కలకలం రేపుతున్న గౌహతి హిమశ్రీ బోరో మృతి

### - పోలీసులను పరుగులు పెట్టిస్తున్న సంఘటన

### - ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు స్పందించడంతో మరింత వేగవంతమైన దర్యాప్తు

### - రైలు నుండి డమ్మీ బొమ్మ విసిరి సంఘటనను రిక్రియేషన్ చేసిన పోలీసులు





**పొందూరు , జ్యోతి న్యూస్:** శ్రీకాకుళం జిల్లా పొందూరు మండలం పెనుబర్తి--బొడ్డేపల్లి గ్రామాల మధ్య రైల్వే ట్రాక్ వద్ద అస్సాంకు చెందిన యువతి హిమశ్రీ బోరో అనుమానాస్పద మృతి కేసు సంచలనంగా మారింది. యువతి మరణానికి గల అసలు కారణాలను గుర్తించేందుకు రైల్వే పోలీసులు వివిధ కోణాల్లో దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ ఘటనపై అస్సాం ముఖ్యమంత్రి స్పందించి సమగ్ర విచారణకు ఆదేశించడంతో ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. డాన్స్ షోలో పాల్గొనేందుకు గత నెల 30న తన బృందంతో కలిసి విశాఖపట్నం వచ్చిన హిమశ్రీ బోరో.. సొంత రాష్ట్రంలో పరీక్ష ఉండటంతో ఈ నెల 6న అస్సాంకు తిరుగు ప్రయాణమైంది. కన్యాకుమారి నుంచి దిబ్రూగఢ్ వెళ్లే వివేక్ ఎక్స్‌ప్రెస్‌లోని ఎస్2 కోచ్‌లో ఆమె ప్రయాణించింది. ప్రయాణ సమయంలో తన కోచ్‌లో కొందరు యువకులు మద్యం సేవిస్తున్నారని, తనకు భయంగా ఉందని హిమశ్రీ కుటుంబ సభ్యులతో చెప్పినట్లు సమాచారం. అనంతరం కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చినట్లు వారు తెలిపారు. ఈ క్రమంలో పెనుబర్తి సమీపంలో రైల్వే ట్రాక్ వద్ద ఆమె మృతదేహం లభ్యమైంది. తొలుత రైలు నుంచి జారిపడి మృతి చెందినట్లు కేసు నమోదు చేసిన పోలీసులు కుటుంబ సభ్యుల ఆరోపణల మేరకు దర్యాప్తును ముమ్మరం చేశారు. హిమశ్రీ రైలులో రికార్డు చేసి పంపిన వీడియో పోలీసుల దర్యాప్తులో కీలకంగా మారింది. అసోం ,ఆంధ్ర రెండు రాష్ట్రాలు దీనిని ప్రతిష్టాత్మకంగా తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు. శనివారం నాడు అసోం ఐజీ జిల్లా ఎస్పీ తో ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించగా, ఆదివారం నాడు ఆధారాలను సేకరించేందుకు ప్రభుత్వ రైల్వే పోలీసులు (జీఆర్పీ), సంయుక్తంగా శాస్త్రీయ అనుకరణ ప్రయోగం (సిమ్యులేషన్ ఎక్సర్‌సైజ్) నిర్వహించారు. కదులుతున్న రైలు నుంచి యువతి ఏ పరిస్థితుల్లో పడిపోయి ఉండవచ్చనే అంశాన్ని శాస్త్రీయంగా పరిశీలించడమే ఈ ప్రయోగం ప్రధాన ఉద్దేశంమానవ నమూనాలు (మానికిన్లు), రెండు రాళ్లను ఉపయోగించారు. మృతురాలి శరీర బరువుకు సుమారుగా సమానమైన బరువు ఉండేలా మానవ నమూనాలను సిద్ధం చేశారు. రాళ్ల కదలికలు, అవి పడిన పథాన్ని సులభంగా గుర్తించేందుకు వాటికి వేర్వేరు రంగుల పెయింట్‌ను పూశారు. వివిధ పరిస్థితుల్లో నమూనాలు కదులుతున్న రైలు నుంచి పడినప్పుడు వాటి కదలికలు, పతన పథం (ట్రాజెక్టరీ) ఎలా ఉంటాయనే అంశాలను పరిశీలించి నమోదు చేశారు. సాధ్యమైన వివిధ పరిస్థితులను అధ్యయనం చేసేందుకు నాలుగు బృందాలను ఏర్పాటు చేశారు. నమూనాలు రైలు నుంచి పడిన తీరు, వాటి కదలికలు, పడిన ప్రదేశం తదితర అంశాలను పరిశీలించారు. ఈ ప్రయోగం ద్వారా లభించిన వివరాలను ఇతర ఆధారాలతో సరిపోల్చి కేసు దర్యాప్తులో ఉపయోగించనున్నారు. శ్రీకాకుళం జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్ రెడ్డి, విశాఖపట్నం డీఎస్ఆర్పీ కె. ప్రమోద్, శ్రీకాకుళం డీఎస్పీ ధనుంజయ నాయుడు పర్యవేక్షణలో ఈ ప్రయోగం నిర్వహించారు. డీజీపీ హరీష్ గుప్తా, ఐజీ రాజకుమారి, ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీ (ఎఫ్ఎస్ఎల్) డైరెక్టర్, రైల్వే అధికారుల మార్గదర్శకత్వంలో శాస్త్రీయ పరిశీలన చేపట్టామని ,యువతి ప్రమాదవశాత్తూ రైలు నుంచి పడిపోయిందా, భయంతో తానే దూకిందా, లేక ఎవరైనా తోసేశారా అనే కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోందని,శాస్త్రీయ అనుకరణ ప్రయోగం ఫలితాలు, ఫోరెన్సిక్ ఆధారాలు, పోస్టుమార్టం తుది నివేదికతో పాటు ఇతర సాక్ష్యాలను విశ్లేషించిన తర్వాతే హిమశ్రీ బోరో మృతికి గల అసలు కారణంపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు. ఈ పరిశీలనలో వన్ టౌన్ సి. ఐ పైడి నాయుడు ఆమదాలవలస ఎస్. ఐ బాలరాజు పొందూరు ఎస్. ఐ రాజేష్ ,జి సిగడాం ఎస్. ఐ అప్పలసూరి , జి.ఆర్.పి. ఎఫ్ సి. ఐ,ఎస్. ఐ ,సిబ్బంది పాల్గొన్నారు.

# ఆర్‌ఎస్ రంగాపురం మద్దిలేటి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

### శ్రీ ఆదిలక్ష్మి దేవి అలంకారంలో దర్శనమిచ్చిన అమ్మవారు

**బేతంచర్ల: అక్టోబర్ 11(ప్రజా జ్యోతి)**బేతంచర్ల మండల పరిధిలోని ఆర్‌ఎస్ రంగాపురం గ్రామంలో వెలసిన ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ మద్దిలేటి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో శ్రీ మహాలక్ష్మి అమ్మవారి శరన్నవరాత్రి మహోత్సవాలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు శ్రీ ఆదిలక్ష్మి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజలు, వైదిక కార్యక్రమాలతో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. ఉత్సవాల్లో భాగంగా తొలుత గోపూజ నిర్వహించి భగవదాజ్ఞ స్వీకరించారు. అనంతరం విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, పంచగవ్యప్రాశనం, యాగశాల ప్రవేశం, ఋత్విగ్వరణం, రక్షాబంధనం, అంకురార్పణం తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. యాగశాలలో పాలికా పాత్రస్థాపన, ధ్వజ ,కుంభ ఆహ్వానాలు, అగ్నిప్రతిష్ఠ, చతుస్థానార్చన తదితర విశేష పూజలు జరిపించారు. ఈ సందర్భంగా శ్రీ ఆదిలక్ష్మి దేవి అలంకారంలో కొలువుదీరిన అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు.



అనంతరం శ్రీ లలితా సహస్రనామ కుంకుమార్చన, సహస్ర దీపాలంకరణ సేవలతో పాటు వాహన సేవను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో దేవస్థానం డిప్యూటీ కమిషనర్, కార్యనిర్వహణాధికారి ఎం. రామాంజనేయులు, ధర్మకర్తల మండలి చైర్మన్ ఎల్ల నాగయ్య, ధర్మకర్తల మండలి సభ్యులు, వేద పండితులు, అర్చక స్వాములు, భక్తులు పాల్గొన్నారు. శరన్నవరాత్రి ఉత్సవాలతో దేవస్థాన ప్రాంగణం భక్తజన సందోహంతో సందడిగా మారింది.

# ప్రధాని మోడీ మన దేశాన్ని అన్ని రంగాలలో ఆగ్రగామిగా నిలుపుతున్నారు

**బిజెపి సంకల్ప్ సేవలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు యర్రంశెట్టి పద్మారావు.**

**పోడూరు. ప్రజాజ్యోతి రిపోర్టర్ కొట్టి రామం. అక్టోబర్ 11.** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మన దేశాన్ని అన్ని రంగాలలో అగ్రగామిగా నిలుపుతూ ప్రపంచ దేశాలన్నీ భారత్ వైపు చూసేలా చేస్తున్నారని బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు యర్రంశెట్టి పద్మారావు అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రజాసేవలో 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా పోడూరు మండలం వేడంగిలో కాపు సంక్షేమ సంఘం భవనం వద్ద బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు యర్రంశెట్టి పద్మారావు ఆధ్వర్యంలో బిజెపి సేవా సంకల్ప్ కార్యక్రమాలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని కూటమి నాయకులతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన సభకు అధ్యక్షత వహించిన యర్రంశెట్టి పద్మారావు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ భారతదేశాన్ని శక్తివంతమైన దేశంగా తయారు చేస్తున్నారన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అరాచకాలు కుంభకోణాలు తో విసిగిపోయిన దేశ ప్రజానీకం బిజెపికి అధికారాన్ని కట్టబెట్టిందని ప్రధానమంత్రిగా మోడీ ఎంతో సమర్ధవంతమైన పాలన అందించడంతో మరో రెండు సార్లు ప్రధానిగా ఎన్నికయ్యారని అన్నారు ప్రధాని నరేంద్ర మోడీ వికసిత్ భారత్ లక్ష్యసాధనకు దేశాన్ని అభివృద్ధి చేస్తూ ముందుకు సాగుతున్నారని అన్నారు కూటమి ప్రభుత్వానికి ప్రధాని మోడీ అందిస్తున్న సహకారంతో ముఖ్యమంత్రి





చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లు రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. మండల బిజెపి అధ్యక్షుడు చింతపల్లి రమేష్ శెట్టి మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ 25 సంవత్సరాల ప్రజాసేవ పూర్తయిన సందర్భంగా జిల్లా వ్యాప్తంగా మండల వ్యాప్తంగా సేవా సంకల్ప కార్యక్రమాలు చేస్తున్నామని అన్నారు. మండలంలోని అంగన్వాడీ కేంద్రాలలో ఉత్సవాలు జరిపి అంగన్వాడీ టీచర్లను సత్కరించామన్నారు. మన దేశం, రాష్ట్రం అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం ఉండాలని ఆయన పేర్కొన్నారు. జనసేన పాలకొల్లు అసెంబ్లీ కోఆర్డినేషన్ సభ్యులు ఇనుకొండ రంగారావు మాట్లాడుతూ ప్రధాని మోడీ నేతృత్వంలో బిజెపి అధికారం చేపట్టిన తర్వాత ప్రపంచ దేశాలు భారత వైపు కన్నెత్తి చూడటానికి సాహసం చెయ్యటంలేదన్నారు దేశ పరిరక్షణకు, దేశ అభివృద్ధి కి మోదీ చేస్తున్న కృషి ప్రజల మన్ననలు అందుకుంటున్నదన్నారు టిడిపి నాయకులు బొలిశెట్టి మంగయ్య నాయుడు కొండేటి దుర్గా ప్రసాద్ జనసేన నాయకులు యర్రంశెట్టి నరసింహారావు నల్లి వెంకటేశ్వరరావు కొర్రకూటి హరి మోదీ పాలనను, రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు పవన్ కళ్యాణ్ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను, పాలకొల్లు నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు ను అభినందించారు. ఈ సందర్భంగా వందమంది వృద్ధులకు దుప్పట్లను బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు పద్మారావు అందజేశారు బిజెపి తెలుగుదేశం జనసేన నాయకులను యర్రంశెట్టి పద్మారావు శాలువాలతో సత్కరించారు. ఉచిత కంటి వైద్య శిబిరంలో కంటి వైద్యులు 200 మందికి కంటి వైద్య పరీక్షలు జరిపి ఉచితంగా తగు మందులు అందచేశారు. సొసైటీ అధ్యక్షులు లంకలపల్లి రవీంద్ర ప్రసాద్ జనసేన నాయకులు బొలిశెట్టి నాగ రమేష్ యడ్ల ప్రసాద్ యర్రంశెట్టి అన్నవరం మండల బిజెపి నాయకులు వల్లూరి నాగ వరప్రసాద్ కౌరు నాగబాబు కనుమూరి గోపాలకృష్ణంరాజు టీడీపీ నాయకులు కుసుమే సురేష్ కొల్లు వెంకట్రావు దుప్పనపూడి సూర్యచంద్రరావు వై సూర్య పవన్ కొట్టి రామం తదితరులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన విందు భోజనాలకు వృద్ధులు, పేదలు హాజరయ్యారు.

# మూడు దశాబ్దాల సేవకు అంతర్జాతీయ గుర్తింపు

**పెద్దిరెడ్డి రామ్ సతీష్ రెడ్డికి యునైటెడ్ అమెరికన్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్**

**బద్వేలు ప్రజలకు విశేష సేవలు.. పేదలు, అనాథలు, వృద్ధులకు అండగా నిలుస్తూ ప్రత్యేక గుర్తింపు**

**బద్వేలు స్టాఫ్ రిపోర్టర్ అక్టోబర్ 11 (ప్రజాజ్యోతి)** సమాజ సేవనే లక్ష్యంగా, నిరుపేదలకు అండగా నిలుస్తూ మూడు దశాబ్దాలుగా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్న బద్వేలుకు చెందిన ప్రముఖ సంఘసేవకుడు, పద్మావతి హాస్పిటల్ అధినేత, క్లాస్-1 కాంట్రాక్టర్ పెద్దిరెడ్డి రామ్ సతీష్ రెడ్డికి అంతర్జాతీయ గౌరవం లభించింది. ఆయన అందిస్తున్న సామాజిక సేవలను గుర్తించిన యునైటెడ్ అమెరికన్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. చెన్నైలోని టీ.నగర్ కృష్ణ గానసభ ఆడిటోరియంలో శనివారం నిర్వహించిన అంతర్జాతీయ డాక్టరేట్ ప్రదానోత్సవంలో యూనివర్సిటీ ప్రతినిధులు ఆయనకు డాక్టరేట్ పట్టాతో పాటు జ్ఞాపికను అందజేసి సత్కరించారు. గత 30 ఏళ్లుగా ప్రచార ఆర్భాటాలకు దూరంగా, సేవా కార్యక్రమాలకే ప్రాధాన్యమిస్తూ పెద్దిరెడ్డి రామ్ సతీష్ రెడ్డి బద్వేలు ప్రాంతంలో తనదైన గుర్తింపు పొందారు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేదలు, బడుగు బలహీన వర్గాలు, అనాథలు, వృద్ధులకు తన వంతు సహాయం అందిస్తూ, ఆపదలో ఉన్నవారికి అండగా నిలుస్తున్నారు. సేవ అనేది కేవలం మాటల్లో కాకుండా చేతల్లోనూ ఉండాలనే స్ఫూర్తితో పలు సామాజిక కార్యక్రమాల్లో భాగస్వాములవుతున్నారు.

**మొక్కల పెంపకం.. పర్యావరణ పరిరక్షణకు ప్రత్యేక కృషి**

సామాజిక సేవతో పాటు పర్యావరణ పరిరక్షణపైనా ఆయన ప్రత్యేక దృష్టి సారించారు. తాను స్థాపించిన మంచి పనులు సేవ ఫౌండేషన్ ద్వారా నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో మొక్కలు నాటించడం, పచ్చదనాన్ని పెంపొందించడం, నాటిన మొక్కల సంరక్షణకు చర్యలు చేపట్టడం వంటి కార్యక్రమాలకు ప్రాధాన్యమిస్తున్నారు. వన్యప్రాణుల సంరక్షణకు కూడా తన వంతు కృషి చేస్తున్నారు.

**గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి తోడ్పాటు**

ఆధ్యాత్మిక, సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలోనూ ఆయన భాగస్వాములవుతున్నారు. ముఖ్యంగా నిరుపేదలకు ఉపయోగపడేలా స్మశానవాటికల నిర్మాణం వంటి కార్యక్రమాలకు ప్రాధాన్యమిస్తూ సామాజిక బాధ్యతను చాటుతున్నారు. మూడు దశాబ్దాలుగా కొనసాగుతున్న సేవా ప్రయాణానికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించడం బద్వేలు ప్రాంతానికి విశేష ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. ఈ గౌరవం భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలకు స్ఫూర్తినిస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. డాక్టరేట్



అందుకున్న పెద్దిరెడ్డి సతీష్ రెడ్డికి పలువురు ప్రముఖులు స్నేహితులు బంధుమిత్రులు అభినందనలు తెలిపారు.

# వెంకటాంపల్లెకు గోరుకల్లు రిజర్వాయర్ నీళ్లు,

**డోన్ ప్రజా జ్యోతి అక్టోబర్ 1** నంద్యాల జిల్లా డోన్ మండలం వెంకటనాయునిపల్లి గ్రామంలో ఆదివారం జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాస్ యాదవ్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు శీలం భాస్కర్ నాయుడు, మాజీ సర్పంచ్ చంద్రశేఖర్ నాయుడు, ఆధ్వర్యంలో డోన్ శాసనసభ్యులు కోట్ల జయ సూర్య ప్రకాశ్ రెడ్డి చేతుల మీదుగా. గోరుకల్లు రిజర్వాయర్ నుంచి వాటర్ గ్రిడ్ పైప్‌లైన్ ద్వారా ఏర్పాటు చేసిన తాగునీటి కుళాయిలను ప్రారంభించి, గ్రామ ప్రజలకు తాగునీటి సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా అవసరమైన చర్యలు చేపట్టడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. వెంకట నాయన పల్లిగొర్ల పెంపకదారులు కున్నూరు గొర్ల పెద్దరాజు, ఆవుల పెద్ద గోపాల్, అర్జీ బోయినిమాధవస్వామి, ఆవుల చిన్నగోపాల్, అర్జీ బోయిని గోరంట్ల, ఆవుల మాధవస్వామి, బోయిని రామాంజనేయులు, తోడిసెట్ మద్దయ్య, కున్నూరు జయరాముడు, వీరు లింగమయ్య స్వామికి, గంగమ్మకు,





గ్రామదేవతలకు, (ఎనిమిది)8పొట్టేళ్లతో పూజా కార్యక్రమాలు చేసి వచ్చిన నాయకులకు, ప్రజలకు, అధికారులకు, అందరికీ అన్నదాన కార్యక్రమములు ఏర్పాటు చేశారు అని తెలిపారు, డోన్ ఎమ్మెల్యే ఎనిమిది మంది (గొర్ల) పొట్టేలు పెంపక దారులకు శాలువలు వేసి సన్మానం చేశారు, నాయకులు ,మాట్లాడుతూ ఎలక్షన్ టైంలో ప్రచారానికి వచ్చినప్పుడుకోట్ల జయ సూర్య ప్రకాశ్ రెడ్డి తెలుగుదేశం పార్టీని గెలిపిస్తే తప్పనిసరిగా వెంకటనాయనిపల్లెకు త్రాగడానికి, పశువులకు, గొర్రెలకు, నీళ్లుఇస్తానని మాట ఇచ్చారు కనుక ప్రత్యేక దృష్టి పెట్టి ఫండ్స్ తెచ్చి ఉడుములపాడు చెరువు నుంచి వెంకటనాయునిపల్లి నీటికుంటకు నీటిని విడుదల చేశారు. దీంతో గ్రామంలోని నీటి అవసరాలకు మరింత తోడ్పాటు లభించిందని తెలిపారు,ఈ కార్యక్రమంలో ప్రజలు,గ్రామస్థులు, గ్రామ పెద్దలు, అధికారులు,పాల్గొన్నారు ,.

# అనారోగ్య బాధితురాలికి వసుధా ఫౌండేషన్ ఆర్థిక సాయం

**పోడూరు. ప్రజాజ్యోతి రిపోర్టర్ కొట్టి రామం. అక్టోబర్ 11**పోడూరు గ్రామానికి చెందిన సప్పరపు నాగదుర్గ (30) కొంతకాలంగా మెదడు సంబంధిత అనారోగ్యంతో బాధపడుతున్నారు. చికిత్స కోసం లక్షలాది రూపాయలు ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. వారిది పేద కుటుంబం కావడంతో వైద్య ఖర్చులు ఎంతో భారంగా మారాయి. పాలకొల్లు క్షత్రియ పరిషత్ అధ్యక్షులు చేకూరి సూరిబాబు నాగదుర్గ పరిస్థితిని వసుధ ఫౌండేషన్ కన్వీనర్ పెనుమత్స బుద్ధరాజు ద్వారా ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకటరామరాజు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన మానవతా హృదయంతో స్పందించి నాగ దుర్గ వైద్య ఖర్చులకోసం ఫౌండేషన్ ద్వారా రూ. 10,000 ఆర్థిక సాయం చెక్కును పంపించారు. పోడూరులో పాలకొల్లు క్షత్రియ పరిషత్ అధ్యక్షులు చేకూరి సూరిబాబు ఆదివారం నాగదుర్గ భర్త మల్లేశ్వరరావుకు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా సూరిబాబు మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతూ వైద్య ఖర్చులకి ఇబ్బందులు పడుతున్న వారికి వసుధ ఫౌండేషన్ చైర్మన్ వెంకట్రామరాజు ఆర్థికంగా సహాయం అందించటం ఎంతో అభినందనీయమన్నారు. సూరిబాబు, నాగదుర్గ భర్త మల్లేశ్వరరావు, కుటుంబ సభ్యులు వసుధ ఫౌండేషన్ చైర్మన్ వెంకట రామరాజుకు కృతజ్ఞతలు తెలిపారు.



## బాలా త్రిపుర సుందరి దేవి అలంకరణతో దర్శనం.

**ముత్తుకూరు ,అక్టోబర్ 11 (ప్రజా జ్యోతి)** బాలా త్రిపుర సుందరి దేవి అలంకరణతో మహాలక్ష్మి దేవి అమ్మవారు కృష్ణపట్నం గ్రామస్తులకు ఆదివారం రాత్రి దర్శన భాగ్యం కల్పించారు. ఈ గ్రామంలోని కరణాలు వీధి నందు మహాలక్ష్మి దేవస్థానం నందు శ్రీదేవి శరన్నవరాత్రులు ప్రారంభం అయినాయి. విద్యుత్ దీపాల అలంకరణతో దేవస్థానం కళకళలాడింది. ప్రత్యేక పుష్ప అలంకరణతో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయ కర్తలగా తొండమనాటి పుల్లయ్య, పెద్దపాలెం సురేష్, పెద్దపాలెం హరి ప్రసాద్ దంపతులు వ్యవహరించారు. కుటుంబ సభ్యులందరూ భక్తిశ్రద్ధలతో అమ్మవారిని పూజించారు. దేవస్థానం అర్చకులు గూడలి సుబ్బారావు శర్మ పూజ కార్యక్రమాలు చేశారు. భజన కార్యక్రమం తో పాటు కోలాటం ప్రదర్శన జరిగింది. కార్యక్రమాలు ముగింపు అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదము వినియోగం జరిగింది. కార్యక్రమంలోకరణాల వీధి బృందం, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



## భవసార క్షత్రియ అంబా భవాని ఆలయంలో వైభవంగా దసరా నవరాత్రులు

**శ్రీ బాల త్రిపుర సుందరిదేవిగా అమ్మవారి దర్శనం**

**ప్రజాజ్యోతి. జిల్లా బ్యూరో సుబ్బు** శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా స్థానిక శ్రీ భవసార క్షత్రియ అంబా భవాని దేవాలయంలో దేవీ నవ రాత్రి వేడుకలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు భక్తులకు శ్రీ బాల త్రిపుర సుందరి దేవి అలంకరణలో అద్భుతంగా దర్శనమిచ్చారు. మనస్సుకు ఆహ్లాదాన్ని ప్రశాంతతను చేకూర్చే ఈ బాల రూప అవతారంలో కొలువుదీరిన అంబా భవాని మాతను దర్శించుకోవడానికి భక్తులు తెల్లవారు జాము నుంచే ఆలయానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు అర్చనలు నిర్వహించి రంగురంగుల పుష్పాలు విశేష ఆభరణాలతో జగన్మాతను ముగ్ధమనోహరంగా అలంకరించారు. బాల త్రిపుర సుందరి దేవి అమ్మవారి అనుగ్రహం కోసం మహిళా భక్తులు కుంకుమార్చనలు లలితా సహస్రనామ పారాయణాలు చేశారు. చిన్న పిల్లలకు మంచి విద్య విజ్ఞానం ఆయురారోగ్యాలు కలగాలని కోరుకుంటూ అమ్మవారికి నివేదనలు సమర్పించారు. భవసార క్షత్రియ ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆలయ ప్రాంగణమంతా భక్తి కీర్తనలు వేద మంత్రోచ్ఛారణలతో మారుమోగింది. దర్శనానంతరం భక్తులకు ఆలయ కమిటీ తరపున తీర్థప్రసాదాల వితరణ చేశారు. ఈ నవరాత్రి ఉత్సవాల్లో ప్రతిరోజూ అమ్మవారు ఒక్కో విశేష అవతారంలో భక్తులకు దర్శనమిస్తారని భక్తులందరూ ఈ వేడుకల్లో పాల్గొని తరించాలని ఆలయ నిర్వాహకులు కోరారు.





## కృష్ణపట్నం అభివృద్ధి పై చర్చ.



**ముత్తుకూరు ,అక్టోబర్ 11( ప్రజా జ్యోతి)** కూటమి ప్రభుత్వ పరిపాలనలో కృష్ణపట్నం గ్రామపంచాయతీలో జరిగిన అభివృద్ధి పనులపై నియోజకవర్గ అధికార పార్టీ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చర్చించారు. ఆదివారం జరిగిన తెలుగు యువత సమావేశంలో ముత్తుకూరు మండల తెలుగు యువత అధ్యక్షుడు రాగాల శివకృష్ణతో సమన్వయకర్త సోమిరెడ్డి క్షేత్రస్థాయిలో మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగు యువత సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. అదే విధంగా అనేక అంశాల పైన మాట్లాడారు. ఎన్నికల్లో తన వంతు సహకారం ఉంటుందని సోమిరెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

## ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు పంపిణీ



**బద్వేలు స్టాఫ్ రిపోర్టర్ అక్టోబర్ 11 (ప్రజాజ్యోతి)** బద్వేలు మున్సిపాలిటీ పరిధిలోని ఆంజనేయ నగర్‌కు చెందిన యడల్ల సత్యనారాయణకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ. 3.50 లక్షల చెక్కును బద్వేలు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి మంచూరు సూర్యనారాయణ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులతో వైద్య ఖర్చులు భరించలేని నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో తోడ్పాటునందిస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అర్హులైన పేదలకు వైద్య చికిత్సల కోసం ఆర్థిక సహాయం అందిస్తోందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆర్థిక ఆరోపణలు, కేసులతో పార్టీకి దూరంగా ఉంచిన గంటా కృష్ణ కు స్థానిక ఎన్నికల సమన్వయకర్త పదవి తీవ్ర అసంతృప్తిలో జనసైనికులు

## ప్రజలలో తప్పుడు సంకేతాలు వెళ్తాయని జన సైనికుల ఆవేదన

**తాళ్లపూడి, అక్టోబర్ 11, ప్రజాజ్యోతి న్యూస్** కొవ్వూరు నియోజకవర్గ స్థానిక సంస్థల ఎన్నికల సమన్వయ కమిటీ జాబితాలో అసెంబ్లీ సమన్వయకర్తగా గంటా శివ రామకృష్ణ (అలియాస్ గంటా కృష్ణను) నియమించడంపై తాళ్లపూడి మండల జనసేన నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ రాజమండ్రి పార్లమెంట్ స్థానిక ఎన్నికల సమన్వయకర్త మరియు కొవ్వూరు నియోజకవర్గ ఇంచార్జ్ మాజీ ఎమ్మెల్యే టి.వి. రామారావుకు ఫిర్యాదు లేఖ అందజేశారు. గంటా శివరామకృష్ణ పలు కేసుల్లో నిందితుడిగా ఉన్నాడని నకిలీ పాస్ బుక్కులు సృష్టించి, ఉద్యోగాలు, రుణాలు ఇప్పిస్తానని చెప్పి అనేక మంది వద్ద నుండి కోట్ల రూపాయలు వసూలు చేసి చేసిన వ్యక్తికి జనసేన సమన్వయకర్తగా ఎలా నియమిస్తారని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా వివిధ పోలీస్ స్టేషన్ లో కేసులు నమోదయినట్లు ముఖ్యంగా జనవరి నెలలో కృష్ణ చేతిలో మోసపోయిన ఓ మహిళ డబ్బులు తిరిగి ఇవ్వాలని అడగడంతో ఆమెపై దాడికి పాల్పడ్డాడని దీంతో బాధిత మహిళ ఫిర్యాదు మేరకు తాళ్లపూడి పోలీసులు అతనిని అరెస్టు చేశారని లేఖలో పేర్కొన్నారు. ఈ ఘటన అనంతరం జిల్లా పార్టీ అధ్యక్షులు అతనిపై నమోదైన కేసుల వివరాలు కోరుతూ నిజ నిర్ధారణ పూర్తయ్యే వరకు పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండాలని లేఖ విడుదల చేశారని ఆ తర్వాత అతనిని తిరిగి



పార్టీలో కొనసాగిస్తున్నట్లు ఎటువంటి ఉత్తర్వులు రాలేదని వారు గుర్తు చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో మహిళపై దాడి చేసి పలు కేసుల్లో నిందితుడిగా ఉన్న వ్యక్తిని సమన్వయ కమిటీలో నియమించడం వల్ల నియోజకవర్గంలో తీవ్ర ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తుందని వారు లేఖలో ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ అధ్యక్షులు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సిద్ధాంతాలు నిజాయితీకి నిదర్శనమని, ఆ సిద్ధాంతాలను నమ్ముకుని ప్రజల్లోకి వెళ్తున్న తమకు ఇలాంటి ఆర్థిక ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిని ముందు పెట్టి ఎన్నికలకు వెళితే ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళ్తాయని పార్టీ ప్రతిష్ట దెబ్బతింటుందని పేర్కొన్నారు. కాబట్టి ఆర్థిక ఆరోపణలు ఎదుర్కొంటున్న గంటా శివ రామకృష్ణను సమన్వయ కమిటీలో నియమించడంపై పార్టీ పెద్దలు పునరాలోచించాలని ఇటువంటి వారిని పార్టీకి దూరంగా ఉంచాలని ఫిర్యాదులో కోరారు. ఈ



ఫిర్యాదుపై నియోజకవర్గ ఇంచార్జ్ టి.వి. రామారావు స్పందిస్తూ ఈ విషయాన్ని మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయం మరియు పార్టీ పెద్దల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు

# 162 మందికి రూ.64 లక్షల సి యమ్ అర్ యఫ్ చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే పితాని. పోడూరు.



**ప్రజాజ్యోతి రిపోర్టర్ కొట్టి రామం. అక్టోబర్ 11.** ఆచంట నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన అనారోగ్యంతో వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన పేద కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచింది. ముఖ్యమంత్రి సహాయ నిధిగా 162 మంది బాధితులకు మంజూరైన రూ.64 లక్షల 614/- విలువైన చెక్కులను ఆచంట శాసనసభ్యులు పితాని సత్యనారాయణ. పోడూరు మండలం కొమ్ముచిక్కాల కార్యాలయంలో ఆదివారం లబ్ధిదారుల కు చెక్కులను అందజేశారు. వైద్య చికిత్సల కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో తోడ్పాటునందిస్తోందని ఎమ్మెల్యే పితాని పేర్కొన్నారు. ఈ నిధి ద్వారా మంజూరైన ఆర్థిక సహాయం బాధిత కుటుంబాలకు వైద్య ఖర్చుల భారాన్ని తగ్గించడంలో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే పితాని తెలిపారు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీ, భారతీయ జనతా పార్టీ కూటమికి చెందిన మండల, గ్రామ అధ్యక్షులు, ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, లబ్ధిదారులు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# ఆడపిల్లలను పుట్టనిద్దాం బ్రతకనిద్దాం జిల్లా వైద్యా ఆరోగ్య శాఖ అధికారిడాక్టర్ శారదా బాయి

**నంద్యాల జిల్లా:అక్టోబర్ (ప్రజా జ్యోతి)** అంతర్జాతీయ బాలికల దినోత్సవ సందర్భంగా వైద్య సిబ్బంది, ఆర్ ఆర్ నర్సింగ్ విద్యార్థులతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శారదాబాయి సమావేశం ఏర్పాటు చేసి ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ శారదాబాయి మాట్లాడుతూ ఆడపిల్లలను బ్రతకనిద్దాం ఎదగనిద్దాం ,చదవనిద్దాం బాలికల హక్కులలో పెట్టుబడులు పెడదాం మగ బిడ్డ ఆడ బిడ్డని తేడా లేకుండా ప్రజలను చైతన్య పరిచే బాధ్యత వైద్య సిబ్బంది. మీద ఉంది అన్నారు. బాలికలకు వారి హక్కుల గురించి వారి చట్టాల గురించి ఆరోగ్య విద్య అందించాలన్నారు. ఆడబిడ్డ సమాజానికి ఎంతో అవసరమని అటువంటి ఆడబిడ్డను సమానంగా తల్లిదండ్రులు చూడాలని ఉన్నత చదువులు చదివించాలని కోరారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా నంద్యాల జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీల విద్యార్థులకు ఆడపిల్లను బతకనిద్దాం , అనే నినాదం మీద ఫిలిం షో కాంపిటీషన్ నిర్వహించడం జరిగిందని మొదటి బహుమతి ద్వితీయ బహుమతి తృతీయ బహుమతి విద్యార్థుల టీములకు సోమవారం పిజిఆర్ఎస్ భవనంలో జిల్లా కలెక్టర్ మరియు మెజిస్ట్రేట్ రాజకుమారి గనియ చేతుల మీదుగా బహుమతులు విద్యార్థులకు అందజేస్తారని డిఎంహె ఓ డాక్టర్ శారదా బాయి ,తెలిపారు. ఆడబిడ్డలకు చిన్న వయసులో వివాహాలు చేయడం వల్ల కుటుంబాన్ని అర్థం చేసుకోలేక కాన్పు సమయంలో కష్టాలు పడుతూ సంసార బాధ్యతలు తెలియకపోవడం ఆమె నిర్ణయంయం తీసుకోలేకపోవడం వల్ల కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. సమాజంలో ఆడపిల్లల సంఖ్య తగ్గిపోతుందని వాటిని పెంపొందించవలసిన బాధ్యత ప్రతి పౌరుని మీద ఉందని తల్లి గర్భవతిగా ఉన్నప్పుడు ఆడపిల్ల లేదా మగ బిడ్డ అని స్కానింగ్ సెంటర్ లోకి వెళ్లి అడగకూడద నీ, అడిగినటువంటి వారికి లింగ నిర్ధారణ చెప్పిన వైద్యులకు పిసిపి ఎన్డిటి 1994 చట్ట ప్రకారం శిక్షార్హులవుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిసిహెచ్ఎస్ డాక్టర్ ఓ. లలిత, సూపరిండెంట్ డాక్టర్ చిట్టిబాబు, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ జగదీశ్, చంద్రారెడ్డి, డాక్టర్ కాంతారావు, నాయక్ డెమో మల్లేపల్లి పామన్న వైద్యులు ఆర్ఆర్ నర్సింగ్ కాలేజ్ విద్యార్థులు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికలే లక్ష్యం.. టీడీపీ నేతల ముందస్తు కసరత్తు!

**చూచిరేవుల గూడెంలో ముఖ్య నాయకుల సమావేశం..**

గ్రామాల వారీగా ఎన్నికల వ్యూహాలపై చర్చ



**కూనవరం: అక్టోబర్ 11 ప్రజా జ్యోతి** స్థానిక సంస్థల ఎన్నికలకు ముందస్తు సన్నద్ధతలో భాగంగా కూనవరం మండలం చూచిరేవుల గూడెం ఎంపీటీసీ పరిధిలో తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలతో మండల పార్టీ అధ్యక్షుడు ఎడవల్లి భాస్కరరావు, ప్రధాన కార్యదర్శి అప్పారావు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో పార్టీ విజయానికి అనుసరించాల్సిన వ్యూహాలు, క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి చేపట్టాల్సిన చర్యలపై విస్తృతంగా చర్చించారు. గ్రామాల వారీగా పార్టీ పరిస్థితిని అంచనా వేయడం, ఓటర్ల జాబితాలను క్షుణ్ణంగా పరిశీలించడం, బూత్‌ల వారీగా ఓట్ల వివరాలను సేకరించడం, నాయకులు--కార్యకర్తల మధ్య సమన్వయాన్ని పెంపొందించడం వంటి అంశాలపై దృష్టి సారించారు. ఎన్నికలకు ముందుగానే పటిష్ఠమైన ప్రణాళికలు రూపొందించుకుని, క్షేత్రస్థాయి లో సమన్వయంతో పనిచేయాలని నాయకులకు సూచించారు. ఈ సమావేశంలో ఎంపీటీసీ పరిధి యూనిట్ ఇన్‌ఛార్జి దాసరి నాగేశ్వరరావు, బూత్ ఇన్‌ఛార్జి జిగిని విజయ్, సీనియర్ నాయకులు శ్రీమంతుల సతీష్, మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు కరక సర్వేశ్వరరావు, బీసీ సెల్ అధ్యక్షుడు ముప్పెనబోయిన నాగరాజు, మాజీ సర్పంచ్ కీకర ముత్తయ్య, గ్రామ శాఖ అధ్యక్షుడు ఆవుల గోపాలకృష్ణ, మాడెం సీతారామయ్య, కర్నాటి శ్రీను, అనిగి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగాఎఫ్.జే.సీ.సీ,చర్చి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు!..



**వైద్య శిబిరంతో సేవా కార్యక్రమాలు!..**
**గర్భిణీలకు,రోగులకు,ఉచిత వైద్య పరీక్షలు!..**
**వృద్ధులకు,నిరుపేదలకు,దుస్తుల పంపిణీ!..**
**రాధా హాస్పటల్ వైద్య బృందానికి ఘన సన్మానం!..**
**ఎఫ్.జె.సీ.సీ,పాస్టర్ యేసు రత్నం!..**







**వరరామచంద్రాపురం, అక్టోబర్ 11 (ప్రజాజ్యోతి ప్రతినిధి)** సేవాభావంతో, చేసే ప్రతీపని, సామాన్యులకు అందాలనే సంకల్పంతో ఎఫ్.జె.సీ.సీ, చర్చి పాస్టర్ యేసురత్నం స్పష్టం చేశారు. ఆదివారం ఎఫ్. జె.సీ.సీ,చర్చి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భద్రాచలంలోని రాధా హాస్పటల్ ఫౌండర్స్, సెయింట్ పాల్స్ పాఠశాల అధినేతలు డాక్టర్ కె అబ్రహం రేవా,డాక్టర్ కె రాధామంజరి, డాక్టర్ కె అలీనా శాంతి, డాక్టర్ మట్టశశికిరణ్, హాస్పటల్ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్ రాజేష్, ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చర్చి ప్రాంగణంలో రాధా హాస్పటల్ వైద్య బృందం ఆధ్వర్యంలో ఉచితవైద్య శిబిరాన్ని నిర్వహించారు. దాదాపు100 మంది గర్భిణులు, 30 మంది వృద్ధులతో పాటు గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి రక్త పరీక్షలు చేసి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు. అలాగే చర్చిఆవిర్భావ దినోత్సవానికి హాజరైన సంఘ సభ్యులతో పాటు వైద్య శిబిరానికి వచ్చిన వారికి భోజన సౌకర్యాన్ని నిర్వాహకులు కల్పించారు. పాస్టర్ యేసురత్నం ఆధ్వర్యంలో వృద్ధులకు దుస్తులనుపంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన రాధా హాస్పటల్ వైద్య బృందాన్ని పాస్టర్ యేసురత్నం,దంపతులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఎఫ్.జే.సీ.సీ,చర్చి ఆధ్వర్యంలో పాస్టర్ ఉంగుటూరు యేసురత్నం నిర్వహిస్తున్నసేవాకార్యక్రమాలపై ముఖ్య అతిథులు హర్షంవ్యక్తం చేశారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు పేదలు, వృద్ధులు, గర్భిణులు, గ్రామస్తులకు వైద్య సేవలు అందించడం అభినందనీయమని వారు పేర్కొన్నారు.

**పాస్టర్ యేసురత్నం మంచి మనస్సు,గొప్పఆశయాలు కలిగిన వ్యక్తిత్వం!..**

పాస్టర్ యేసురత్నం, వయస్సులో చిన్నవాడైనా పెద్దలను గౌరవించడంలో, పేదలకు సహాయం చేయడంలో గొప్ప జ్ఞానాన్ని కలిగి ఉన్నారని రాధా హాస్పిటల్స్ ఫౌండర్స్ డాక్టర్ రాధా మంజరి, హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్ రాజేష్, మాట్లాడుతూ నిజంగా చెప్పాలంటే ఈరోజుచాలా సంతోషంగా ఉందని, ఏజెన్సీలో పేదలకుసేవలు చేయడం అంతు లేని గొప్ప అనుభూతి కలిగిందని చెప్పారు. మళ్లీ, మళ్లీ చెపుతున్నా మన భద్రాచలంలోని రాధా హాస్పిటల్లో మీకు అవసరమైన ఉచిత సేవలు ప్రతీ శనివారం అందుబాటులో ఉంటాయని వివరించారు. సాధ్యాసాధ్యాలు మీకు ఇబ్బందిలేకుండా లోబడ్జెట్ నాణ్యమైన సేవలు చేస్తామని సూచించారు. ఒక్కసారి రండి మీకు కావాల్సిన సేవలు ఏరూపంలో కావాలో కోరుకోండి మేము మీకోసంతప్పకుండా మీ అభిప్రాయాల మేరకే సేవలందిస్తామని పేర్కొన్నారు. సీనియర్ వైద్యులు, అందుబాటులో ఉండి సేవలు చేస్తారని వివరించారు. వరరామచంద్రాపురంలో ఎఫ్.జె.సీ.సీ,చర్చి పాస్టర్ యేసురత్నం, ఆధ్వర్యంలో రక్త పరీక్షలు నిర్వహించి,వైద్య సేవలు, అందించామన్నారు. ప్రతీ ఒక్కరికీ బ్లడ్ శాతం తక్కువగా ఉందని పండ్లు, పాలు, తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రోగులు, ఉంగుటూరి యేసురత్నం, తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, గర్భిణీలు, వృద్ధులు, తదితరులు పాల్గొన్నారు

# కరువును అధికమించడానికి రాగులపాడు ఉప కాలువ పనులు ప్రారంభించాలీ

**అక్టోబర్ 15 గురువారం**

**హంద్రీనీవా ఆఫీసు వద్ద జరిగే రైతుల ధర్నాను జయప్రదం చేయండి: డి జగదీష్**



**గుంతకల్లు అక్టోబర్ 11 (ప్రజా జ్యోతి):** గుంతకల్లు మండలంలోని కరువు ను అధికమించడా నికి రాగులపాడు ఉపకాలవ పనులు ప్రారంభించడానికి 60 కోట్లు నిధులు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి జగదీష్ ప్రభుత్వం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆదివారం గుంతకల్లు మండలంలోని నాగసము ద్రం గ్రామంలో ప్రచార సభను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిపిఐ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి జగదీష్, రైతు సంఘం నాయకులు పులు గుట్టపల్లి జయన్న, నాగస ముద్రం పాండురంగారెడ్డి , పాల్గొని మాట్లాడుతూ నాగసముద్రం గ్రామంలో పర్యటించి హంద్రీనీవా ఆఫీస్ దగ్గర జరిగే ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ గ్రామంలో పర్యటిస్తూ కరపత్రాలు పంచడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హంద్రీనీవా మైన్ కెనాల్ నుండి రాగులపాడు దగ్గర ఉపకాలువను నిర్మించి, వజ్రకరూరు, గుంతకల్లు, పామిడి మండలాలలోని చెరువులకు, చెక్ డ్యాము లకు, కుంటలకు, కృష్ణ జలాలు ఇవ్వాలని 2014వ సంవత్సరం నుండి సి.పి.ఐ. పార్టీ, రైతు సం ఘాలు కలిసి పోరాటాలు చేస్తున్న విషయం తమరికి తెలియందికాదు. 2017వ సంవత్సరం పామిడి బహిరంగ సభలు ఏప్రిల్ 20వ తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పుట్టిన రోజున రాగులపాడు కాలువ ద్వారా పై 3 మండలాలకు హంద్రీనీవా నుండి కృష్ణజలాలు ఇస్తానని హామీ ఇవ్వడం జరిగిందినీ అన్నారు. 2023న ఈ కాలువకు జగన్ మోహన్ రెడ్డి అనుమతులు ఇచ్చి ఫైనాన్స్ మంజూరు చేసినారని అప్పటి యం.ఎల్.ఎ. వెంకటరామి రెడ్డి భూమిపూజ కూడా చేశారు. కాని నిధులు రానందువల్ల భూసేకరణ జరగలేదు. పనులు ప్రారంభం కాలేదునీ తెలిపారు. 2024 అధికారం లోకి వచ్చిన టి.డి.పి. ప్రభుత్వపై సి.పి.ఐ. పార్టీ రైతుసంఘాలు, నాయకులు ఆర్థికశాఖ మంత్రిని, నీటి పారుదల శాఖమంత్రిని పలు మార్లు కలవడం జరిగింది. అయినా నిధులు మంజూరు కాలేదునీ ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల గత్యంతరం లేక 20-2-2026 నుండి 27-2-2026 వరకు సి.పి.ఐ. పార్టీ రైతుసంఘాలు ఆధ్వర్యములో మునిపల్ కార్యాలయం ముందు అన్ని గ్రామాల రైతులు సామూహి క దీక్షలు చేయడం జరిగింది. ఈ దీక్షల సమయంలోనే స్థానిక యం.ఎల్.ఎ. గుమ్మనూరు జయరామ్ స్వయంగా దీక్షాశిబిరం దగ్గరకు 27-2-2026 వచ్చి జూలై నెలలో నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. కాని ఇప్పటివరకు నిధులు మంజూరు కాలేదు. భూసేకరణ జరగలేదు. పనులు ప్రారంభించలేదునీ కావున రైతు సోదరులంతా పార్టీలకు అతీతంగా 15-10-2026 తేదీ గుంతకల్లు హంద్రీనీవా కార్యాల యం (రాజేంద్రనగర్ లో) దగ్గర జరిగే ధర్నాకు వేలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు వీరభద్ర స్వామి, రాము రాయల్, ఎస్ఎండి గౌస్, రామాంజనే యులు యాదవ్, దేవేంద్ర, మురళీకృష్ణ, సయ్యద్ భాష, అంజి, నాగసముద్రం రైతులు తదితరులు పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన ములకనూరు తిమ్మరాయుడు

**కంబదూరు అక్టోబర్:11(ప్రజా జ్యోతి) న్యూస్ రిపోర్టర్ ఖాన్,** కంబదూరు మండల కేంద్రానికి చెందిన పంచర్ షాప్ రషీద్, కుమారుడు, వైఎస్సార్సీపీ మైనార్టీ నాయకుడు ఫారూక్, సుమియా, ల వివాహ మహోత్సవం ఆదివారం కంబదూరు మండల కేంద్రంలో కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో ఘనంగా జరిగింది. ఈ వివాహ వేడుకకు రషీద్ ఆహ్వానం మేరకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ములకనూరు తిమ్మరాయుడు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో సాగాలని ఆకాంక్షించారు. అనంతరం వధూవరుల కుటుంబ సభ్యులతో ఆత్మీయంగా ముచ్చటించి, వివాహ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ జిల్లా డాక్టర్ల విభాగం అధ్యక్షుడు డాక్టర్ బొమ్మయ్య, జిల్లా బూత్ విభాగం కార్యదర్శి నీలి శంకరప్ప, టౌన్ కన్వీనర్ వడ్డే వెంకటప్ప, నియోజకవర్గ మైనార్టీ అధ్యక్షుడు దాదు, క్రాంతి, ఫయాజ్ తదితర వైఎస్సార్సీపీ నాయకులు పాల్గొని నూతన వధూవరులకు శు



భాకాంక్షలు తెలిపారు.

## ఐడి కార్డులు పంపిణీ చేసిన వైస్సార్సీపీ గుంతకల్లు నియోజకవర్గం మాజీ శాసన సభ్యులు,ఇంచార్జ్ వై.వెంకటరామి రెడ్డి



**గుంతకల్లు అక్టోబర్ 11 (ప్రజా జ్యోతి):** ఆదివారం మాజీ ఎమ్మెల్యే వై. వెంకటరామిరెడ్డి క్యాంప్ కార్యాలయంలో వైస్సార్సీపీ రాష్ట్ర కార్యదర్శి, మాజీ మున్సిపల్ చైర్మన్ జింకల రామాంజినేయులు అధ్యక్షతన పట్టణంలోని 4వ వార్డ్ వైస్సార్సీపీ నాయకులకు వైస్సార్సీపీ గుంతకల్లు నియోజకవర్గం మాజీ శాసన సభ్యులు, ఇంచార్జ్ వై.వెంకటరామి రెడ్డి ఐడి కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు ఎం డి ఆర్.ఖలీల్, పట్టణ ఉపాధ్యక్షులు నవీన్, వార్డ్ మాజీ కౌన్సిలర్ జింకల సుజాత,పార్టీ మైనారిటీ సీనియర్ నాయకులు నూర్ నిజామి, యూత్ వింగ్ అధ్యక్షులు అబ్దుల్ బాసిత్ వార్డ్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేడు పిఠాపురం పాడా కార్యాలయంలో 'ప్రజా ఫిర్యాదుల' కార్యక్రమం రద్దు



**పిఠాపురం (ప్రజా జ్యోతి)** పిఠాపురం మున్సిపల్ గెస్ట్ హౌస్ ఆవరణలోని పిఠాపురం ప్రాంతీయ అభివృద్ధి సంస్థ కార్యాలయంలో సోమవారం జరగవలసిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు పాడా ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ ఎన్.వి. శివరామ్ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. పరిపాలనా కారణాల వల్లనే ఈ కార్యక్రమాన్ని రద్దు చేయాల్సి వచ్చిందని ఆయన పేర్కొన్నారు.ఈ విషయాన్ని గమనించి అర్జీదారులు ఎవరూ వ్యయప్రయాసలకు ఓర్చి పాడా కార్యాలయానికి రావద్దని ఆయన కోరారు. ప్రజలు తమ ఫిర్యాదులు లేదా అర్జీలను వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చని సూచించారు. ప్రజలందరూ ఈ ఆన్‌లైన్ సదుపాయాన్ని వినియోగించుకుని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని జీడీ కోరారు.

## గొల్లప్రోలు మార్కెట్ వ్యాపారుల సమస్యలను పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్తాం: డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి బాబు





**గొల్లప్రోలు (ప్రజా జ్యోతి)** గొల్లప్రోలు మార్కెట్ వ్యాపారులు ఎదుర్కొంటున్న సమస్యలను స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత కొణిదెల పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరిస్తామని కాకినాడ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి బాబు, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు హామీ ఇచ్చారు. నాయకుల హామీతో వ్యాపారులు తమ రిలే నిరాహార దీక్షలను విరమించారు. గత మూడు రోజులుగా గొల్లప్రోలు మార్కెట్ వ్యాపారుల సంఘం సభ్యులతో జనసేన, కూటమి నాయకులు విస్తృతంగా చర్చలు జరిపారు. వ్యాపారులు ఎవరూ ఆందోళన చెందవద్దని, తమ వ్యాపారాలను యథావిధిగా కొనసాగించాలని సూచించారు. మార్కెట్‌ను ప్రస్తుత స్థలం నుండి వేరే అనువైన ప్రాంతానికి తరలించే అంశంపై అధికారులతో పాటు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తో స్వయంగా చర్చిస్తామని భరోసా ఇచ్చారు. వ్యాపారులందరికీ అనుకూలంగా ఉండేలా మార్కెట్‌ను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా మార్కెట్ వ్యాపారుల సంఘం సభ్యులు తమ అభిప్రాయాలను నాయకుల ముందు ఉంచారు. రావి చెరువు లేదా శివాలయం సమీపంలో మార్కెట్ ఏర్పాటు చేయడం తమకు ఇష్టం లేదని వారు తేల్చి చెప్పారు. వీటికి బదులు వ్యాపార అభివృద్ధికి తోడ్పడే ఇతర అనువైన ప్రాంతంలో మార్కెట్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. సమస్య పరిష్కారానికి నాయకులు పూర్తి స్థాయిలో హామీ ఇవ్వడంతో, తాము చేపట్టిన రిలే నిరాహార దీక్షను విరమిస్తున్నట్లు వ్యాపారులు మీడియా ముఖంగా ప్రకటించారు. ఈ కార్యక్రమంలో గొల్లప్రోలు పట్టణ జనసేన పార్టీ అధ్యక్షులు మామిడాల సూరిబాబు, నాయకులు బస చిట్టిబాబు, బసరాజ ,బత్తిన ఏసుబాబు, కడారి తమ్మయ్య నాయుడు, మొగలి రాజా, గొల్లపల్లి చినబాబి, అన్నం దేవర పట్టాభి, తలారి శ్రీను, వినుకొండ అమ్మాజీ, మొగలి జయబాబు, పేకెటి సుబ్రహ్మణ్యం, రెడ్డేమ్ వీరస్వామి, పేకెటి బాబీ, అక్కిరెడ్డి శ్రీను మరియు మార్కెట్ వ్యాపార సంఘ ప్రతినిధులు, కూటమి కార్యకర్తలు పాల్గొన్నారు.

# రేపల్లె అభివృద్ధికి భారీగా నిధులు.. పనులకు శ్రీకారం

### విద్యుత్ లైన్లు, తాగునీటి వసతులు, రహదారుల అభివృద్ధికి శ్రీకారం



**రేపల్లె అక్టోబరు 11 (ప్రజా జ్యోతి ప్రతినిధి)** ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. రేపల్లె నియోజకవర్గంలో ఆదివారం మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వాసుదేవ తో కలిసి సుమారు 144 కోట్ల రూపాయల విలువైన వివిధ అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు.రేపల్లె పట్టణంలో 3.47 కోట్ల రూపాయలతో నిర్మించిన సీసీ రోడ్లు, సామాజిక భవనాలు, స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు సచివాలయ భవనాలను ప్రారంభించారు. ఎన్టీఆర్ కాలనీలో 3 కోట్ల రూపాయలతో సీసీ రోడ్లు, 5.61 కోట్ల రూపాయలతో తాగునీటి సరఫరా వ్యవస్థ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. పట్టణంలో విద్యుత్ సరఫరాను మెరుగుపరిచేందుకు 56.76 కోట్ల రూపాయలతో 27 కిలోమీటర్ల మేర హై లెవల్ విద్యుత్ టవర్లు, లైన్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. బేతపూడి--రావి అనంతవరం బీటీ రోడ్డును 3 కోట్ల రూపాయలతో నిర్మించి ప్రారంభించారు. పల్లెపండుగ 3.0 కింద బేతపూడి పంచాయతీలో 13 కోట్ల రూపాయలతో సీసీ రోడ్ల పనులు, గ్రామీణ ప్రాంతాల్లో 60 కోట్ల రూపాయలతో జలజీవన్ మిషన్ పనులు ప్రారంభించారు. పట్టణంలో 131 మంది లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణం కోసం ఒక్కొక్కరికి 2.50 లక్షల చొప్పున మొత్తం 3.27 కోట్ల రూపాయలకు పైగా మంజూరు పత్రాలు అందజేశారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి 67 మందికి 47.34 లక్షల రూపాయల ఆర్థిక సాయం పంపిణీ చేయగా, అర్వపల్లి పంచాయతీ పరిధిలో 11 మంది పేదలకు ఇళ్ల పట్టాలు అందించారు.ఈ సందర్భంగా మంత్రి పార్థసారథి మాట్లాడుతూ రాష్ట్రంలో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పరిశ్రమలు, షిప్‌యార్డులు, విమానాశ్రయాల వంటి ప్రాజెక్టుల ద్వారా 20 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. 2029 నాటికి రాష్ట్రంలో ఇల్లు లేని పేదవారు ఉండకూడదన్న లక్ష్యంతో గృహ నిర్మాణానికి ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు తెలిపారు. రేపల్లె అభివృద్ధికి మంత్రి అనగాని సత్యప్రసాద్ చేస్తున్న కృషిని అభినందించారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ, ప్రజలకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. గత ఏడాది వరదల సమయంలో రేపల్లె ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లడంతో విద్యుత్ వ్యవస్థ బలోపేతానికి నిధులు మంజూరయ్యాయని తెలిపారు. వ్యవసాయ విద్యుత్ సరఫరా సమస్యల పరిష్కారానికి కూడా చర్యలు చేపడుతున్నామన్నారు. మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ, రేపల్లె చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా పెద్దఎత్తున అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. రహదారుల నిర్మాణంతో పాటు ప్రతి ఇంటికీ తాగునీటి సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ మాట్లాడుతూ, అభివృద్ధి పనులను నాణ్యతతో, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి మోపిదేవి వెంకటరమణ, వివిధ శాఖల అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# పార్టీలో కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుంది

### - వైసీపీ ఎమ్మెల్యే డా.దాసరి సుధా, రాష్ట్ర విద్యార్థి విభాగంప్రధాన కార్యదర్శి దేవసాని ఆదిత్య రెడ్డి



**బద్వేల్ స్టాఫ్ రిపోర్టర్ అక్టోబర్ 11 (ప్రజా జ్యోతి)** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కార్యకర్తలే వెన్నెముక అని వైసీపీ ఎమ్మెల్యే డా. దాసరి సుధా, రాష్ట్ర విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శి దేవసాని ఆదిత్య రెడ్డి లు పేర్కొన్నారు.ఆదివారం బద్వేల్ మండలం, చింతలచెరువు పంచాయతీకి సంబంధించి నటువంటి వైయస్సార్సిపి పార్టీ అధ్యక్ష, అనుబంధ విభాగాల కార్యకర్తల గుర్తింపు కార్డుల పంపిణీ కార్యక్రమానికి కడప జిల్లా సేవాదళ్ అధ్యక్షులు నాగిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి అధ్యక్షతన బయనపల్లి గ్రామం బొజ్జిరెడ్డి కల్యాణ మండపం నందు జరిగిన వైఎస్ఆర్సిపి పార్టీ సమావేశానికి ముఖ్య అతిధులుగా బద్వేల్ ఎమ్మెల్యే డాక్టర్.దాసరి సుధా, రాష్ట్ర విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శి దేవసాని ఆదిత్య రెడ్డి లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ స్థాపన నాటి నుంచి క్షేత్రస్థాయిలో నిరంతరం శ్రమిస్తున్న ప్రతి కార్యకర్త సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. పార్టీ శ్రేణులకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని, ప్రజా సమస్యలపై ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.కార్యకర్తలే పార్టీకి వెన్నెముక అని, వారికి గుర్తింపు, గౌరవం కల్పించడమే కార్డుల పంపిణీ ఉద్దేశమన్నారు రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి గ్రామంలో వైఎస్ఆర్‌సీపీ జెండా ఎగరవేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమం లో బద్వేల్ మాజీ జెడ్పిటిసి చిన్నపోలి రెడ్డి,మాజీ ఎంపీపీ బోడపాటి రామసుబ్బారెడ్డి,మాజీ ఎంపీపీ అంబవరం వెంకటేశ్వర్లు రెడ్డి,బీరం మధుసూదన్ రెడ్డి,మాజీ సర్పంచ్ గాజులపల్లి కృష్ణారెడ్డి ,మాజీ సర్పంచ్ బీరం జయ సుబ్బారెడ్డి, మాజీ సర్పంచ్ కుప్పాల రమణ, మాజీ ఎంపీటీసీ గంగసాని వెంకట సుబ్బారెడ్డి , కో ఆప్షన్ మెంబెర్ షేక్ మహబూబ్ బాషా,మాజీ సర్పంచ్ పద్మ వేణుగోపాల్ , ఉప సర్పంచ్ రవికుమార్ రెడ్డి ,మాజీ ఉప సర్పంచ్ చరణ్ రెడ్డి,గంగసాని సుబ్బారెడ్డి , మన్యం ఈశ్వర్ రెడ్డి , ప్రసాద్ పెద్ద ఎత్తున పార్టీ కార్యకర్తలు, తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా వైసీపీ శ్రేణులు సిద్ధంగా ఉండాలి

### -తోట నరసింహం

### జగ్గంపేట నియోజకవర్గంలో వైసీపీ ఐడీ కార్డుల పంపిణీ చేసిన తోట నరసింహం,తోట రాంజీ



**కాకినాడ జిల్లా అక్టోబర్ 11(ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్)** కృష్ణవరం, గంగంపాలెం, తిరుమలాయపాలెం గ్రామాల్లో వైసీపీ గ్రామ అధ్యక్షుల ఆధ్వర్యంలో పార్టీ ఐడీ కార్డుల పంపిణీ కార్యక్రమాలు నిర్వహించారు. కృష్ణవరంలో రాష్ట్ర వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ తోట శ్రీరాంజీ, గంగంపాలెం, తిరుమలాయపాలెం గ్రామాల్లో జగ్గంపేట నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి, మాజీ మంత్రి తోట నరసింహం పాల్గొని పార్టీ శ్రేణులకు ఐడీ కార్డులు పంపిణీ చేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కృష్ణవరంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు పుర్రె పద్మారావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర వైఎస్సార్‌సీపీ వ్యవసాయ విభాగం అధికార ప్రతినిధి ఆదారి రాజబాబు, నియోజకవర్గ సీనియర్ నాయకుడు పలికెల గంగరాజు, జిల్లా బీసీ విభాగం ఉపాధ్యక్షుడు దాడి రాజా, నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షుడు పాఠంశెట్టి కృష్ణమూర్తి, బూత్ కమిటీ అధ్యక్షుడు పల్లెల వెంకట అప్పలరాజు (అరుబోలు వాసు), విద్యార్థి విభాగం అధ్యక్షుడు నకిరెడ్డి సుధాకర్, జిల్లా కార్యదర్శి బేరి వీర వెంకట సత్యనారాయణ (బాబ్జి), జిల్లా ఆర్గనైజేషన్ కార్యదర్శి ఓలేటి రాజేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు పెనగంటి రాజేష్, మండల ఉపాధ్యక్షుడు పాముల చంటి, వాలంటరీ విభాగం అధ్యక్షుడు అడబాల సుబ్బారాయుడు, ప్రధాన కార్యదర్శి అడబాల నాగు, కార్యవర్గ సభ్యుడు గెంజి శేఖర్, పాముల వీరబాబు తదితరులు పాల్గొన్నారు. గంగంపాలెంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు బొదిరెడ్డి శ్రీనుబాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ విభాగం కార్యదర్శి దాసరి చినబాబు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సుంకర వీరబాబు, మండల పార్టీ అధ్యక్షుడు పాటి రాంబాబు, జిల్లా కార్యదర్శి వరుపుల సూరిబాబు, క్రైస్తవ విభాగం కార్యదర్శి అంబటి అబ్రహం, ఆర్టీఏ విభాగం ప్రధాన కార్యదర్శి నున్నం రాంబాబు, రౌతు జోగేశ్వరరావు, మాజీ సర్పంచులు కనిశెట్టి నాగశేషు, దొడ్డి నాగేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ సీత దుర్గబాబు, ద్వారంపూడి నాగిరెడ్డి, ఆదారి వీరాస్వామి, ఆదారి గణపతి, కనిశెట్టి సత్యనారాయణ, కనుసు సూరిబాబు తదితరులు పాల్గొన్నారు. తిరుమలాయపాలెంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు బట్టేటి సత్తిబాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ విభాగం కార్యదర్శి దాసరి చినబాబు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సుంకర వీరబాబు, గోకవరం మండల పార్టీ అధ్యక్షుడు పాటి రాంబాబు, జిల్లా కార్యదర్శి వరుపుల సూరిబాబు, అంబటి అబ్రహం, నున్నం రాంబాబు, రౌతు జోగేశ్వరరావు, పురంశెట్టి పెదబాబు, పురంశెట్టి నరేంద్ర, మనే బుజ్జి, దాకారపు దుర్గాప్రసాద్, ఓమ్మి కృష్ణ తదితర గ్రామ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# 20 ఏళ్ల జ్ఞాపకాలలో ఆ "పూర్వ" విద్యార్థుల ఆత్మీయ కలయిక





**గుంతకల్లు అక్టోబర్ 11 (ప్రజా జ్యోతి):** పట్టణంలోని శ్రీ సాయిబాబా ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ 2006-2007 సంవత్సరం లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు 20 ఏళ్ల తరువాత ఆదివారం శ్రీ సాయిబాబా హై స్కూల్లో కలుసుకున్నారు. ప్రస్తుతం ఎక్కడెక్కడో స్థిరపడ్డవారు పూర్వ విద్యార్థుల సమావేశానికి హాజరయ్యా రు. అలనాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకు న్నారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించు కుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాల పరిసరాలు కలియ తిరుగుతూ అనాడు చేసిన అల్లరిని నెమరు వేసుకున్నా రు. తోటి మిత్రలతో పోటాపోటీగా సెల్ఫీలు తీసుకుని ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉల్లాసంగా గడిపారు. 20 ఏళ్ల క్రితం పాఠశాలలో చేసిన అల్లరిని, మధురాను భూతులను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీ సాయిబాబా ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ కరస్పాండెంట్ ప్రభాకర్ కు మరియు తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు శాలవాలు, పూలమాలలు వేసి ఘనంగా సన్మానించి, జ్ఞాపక పీఠికలను అందజేసి ఆశీర్వచనాలు తీసుకున్నా రు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు శ్రావణ్, రాజేష్, శ్రీకాంత్, సుధీర్, గని, నాగరాజు, స్వాతి, లీలావర్ధిని, భువన తదితర పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

# దేశ చరిత్రలో రిజర్వేషన్ కల్పించిన ఘనత ఎన్టీఆర్ చంద్రబాబులదే.

మంత్రి నిమ్మల రామానాయుడు

**రూ 41.55 లక్షలతో ఎన్టీఆర్ కాలనీల్లో విద్యుత్ సౌకర్యం ప్రారంభం.**

**పాలకొల్లు. ప్రజాజ్యోతి రిపోర్టర్ కొట్టి రామం. అక్టోబర్ 11.** దేశ చరిత్రలో రిజర్వేషన్ కల్పించిన ఘనత ఎన్టీఆర్ చంద్రబాబుల దేనని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. యలమంచిలి మండలం దొడ్డిపట్ల గ్రామ ఎన్టీఆర్ కాలనీలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో రూ 41.55 లక్షలతో ఆ కాలనీతోపాటు పలు గ్రామాల్లో ఎన్టీఆర్ కాలనీలకు విద్యుత్ సౌకర్యమును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల మాట్లాడుతూ తొలిసారిగా స్థానిక సంస్థల్లో 24 శాతం రిజర్వేషన్ను ఎన్టీఆర్ అమలు చేస్తే చంద్రబాబు 34 శాతానికి పెంచారన్నారు. వైకాపా ప్రభుత్వ హయాంలో జగన్ బీసీ రిజర్వేషన్ల కోటా 34 నుంచి 24 శాతానికి తగ్గించడం వలన స్థానిక సంస్థల్లో 16 వేల పోస్టులను కోల్పోయారన్నారు. బడుగు, బలహీన వర్గాలకు రాజకీయంగా సముచిత స్థానం కల్పించడమే తెలుగుదేశం పార్టీ లక్ష్యమని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు సామాజిక న్యాయం కల్పించేందుకు, 34 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు తెదేపా కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో గొడ్డలి పార్టీ న్యాయస్థానాల్లో కేసులు వేసి అడ్డంకులు సృష్టించారని విమర్శించారు. ఎన్టీఆర్, చంద్రబాబు నాయుడు హయాంలో బీసీలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించేందుకు చర్యలు తీసుకున్నామని అందరు ముఖ్యమంత్రులు రిజర్వేషన్ అమలు చేస్తే ఒక జగన్ మాత్రమే తగ్గించారన్నారు. గొడ్డలి పార్టీ బీసీలు రాజకీయంగా ఎదగకుండా అడ్డుకునే ప్రయత్నాలు చేస్తుంటే వారి హక్కుల పరిరక్షణకు తెదేపా నిరంతరం కృషి చేస్తుందని నిమ్మల రామానాయుడు తెలిపారు. స్థానిక సంస్థల్లో బీసీలకు తగిన ప్రాతినిధ్యం కల్పించడం ద్వారా సామాజిక న్యాయాన్ని ఆచరణలో చూపడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని



పేర్కొన్నారు. బీసీలకు అన్యాయం అంటూ జరిగిందంటే జగన్ వలనేనని విషయాన్ని బీసీ సామాజిక వర్గం అంతా గుర్తించి జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గొడ్డల పార్టీకి గుణపాఠం చెప్పాలన్నారు. కూటమి ప్రభుత్వం రెండేళ్లలో అన్ని వర్గాల ప్రజలకు అభివృద్ధి సంక్షేమాన్ని అందించే దిశగా పనిచేస్తుందన్నారు. దొడ్డిపట్ల ఎన్టీఆర్ కాలనీతోపాటు మరో 15 కాలనీల వరకు గత టిడిపి ప్రభుత్వంలో ఇళ్ల స్థల పట్టాలు ఇచ్చామని, ఆ తరువాత అధికారంలోకి వచ్చిన గొడ్డల పార్టీ ఆ కాలనీలో ఎటువంటి మౌలిక సౌకర్యాలు కల్పించలేదని, ముఖ్యంగా విద్యుత్ సౌకర్యం లేక అనేక అవస్థలు అనుభవించారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆ కాలనీలో మౌలిక సౌకర్యాలు కల్పించాలని దిశగా దృష్టి సారించానని, అందులో భాగంగా విద్యుత్ సౌకర్యాన్ని కల్పించడం జరిగిందన్నారు. ప్రజల కోసం పనిచేస్తున్న మంచి కూటమి ప్రభుత్వాన్ని రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆశీర్వదించాలని మంత్రి రామానాయుడు కోరారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు మామిడి శెట్టి పెద్దిరాజు, చేగొండి రవిశంకర్, బోనం నాని, తోలేటి చంటి, గుబ్బల మోహన్, చేగొండి వెంకటేశ్వరరావు తదితరులతోపాటు అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఆత్మీయ మిత్రుల మధ్య ఘనంగా ప్రజాజ్యోతి రిపోర్టర్ ఏసుదాసు జన్మదిన వేడుకలు

**ఆలమూరు, అక్టోబర్ 11(ప్రజాజ్యోతి):** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండల ప్రజాజ్యోతి రిపోర్టర్ యర్రంశెట్టి ఏసుదాసు జన్మదిన వేడుకలను ఆయన ఆత్మీయ మిత్రులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మిత్రులంతా ఒకచోట చేరి ఏసుదాసుతో కేక్ కట్ చేయించి, జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

**ఆత్మీయతకు చిరునామాగా మిత్రుల కలయిక**

రైతు కుటుంబానికి చెందిన ఏసుదాసు రైతు సోదరులైన మిత్రులతో కలిసి ప్రతిరోజూ సాయంత్రం 5 గంటల నుంచి 7 గంటల వరకు చొప్పెల్ల గ్రామంలోని నాగమ్మతల్లి లేఅవుట్ సైట్‌లో ఆత్మీయంగా గడుపుతుంటారు. ఎలాంటి ఆర్థిక అసమానతలు, మనస్పర్థలు లేకుండా అందరూ సమానంగా కలిసిమెలిసి మాట్లాడుకుంటూ తమ సంతోషాలను, అనుభవాలను పంచుకుంటారు. రోజువారీ జీవితంలోని ఒత్తిళ్లను పక్కనపెట్టి, మిత్రులతో సరదాగా కబుర్లు చెప్పుకోవడం వల్ల మనసుకు ప్రశాంతత, ఎంతో ఆహ్లాదం కలుగుతాయని మిత్రులు తెలిపారు. అందుకే వీలైనంతవరకు ఏరోజూ మిస్ కాకుండా పది మంది మిత్రులమంతా కలుసుకుని ఆత్మీయంగా మాట్లాడుకుంటామని పేర్కొన్నారు.

**మిత్రుల అభిమానానికి ఏసుదాసు కృతజ్ఞతలు**

తమలో ఒకరైన ఏసుదాసు జన్మదినాన్ని పురస్కరించుకుని మిత్రులంతా కలిసి వేడుకలు నిర్వహించడం విశేషంగా నిలిచింది. కేక్ కట్ చేయించి, జన్మదిన శుభాకాంక్షలు



తెలియజేస్తూ తమ మధ్య ఉన్న స్నేహబంధాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఏసుదాసు మాట్లాడుతూ, తనపై సొంత అన్నదమ్ముల్లా ప్రేమాభిమానాలు చూపించిన మిత్రులకు జీవితాంతం రుణపడి ఉంటానని భావోద్వేగంగా తెలిపారు. తన జన్మదినం సందర్భంగా ప్రత్యక్షంగా శుభాకాంక్షలు తెలిపిన మిత్రులతో పాటు, ఫోన్, వాట్సాప్ ద్వారా శుభాకాంక్షలు అందించిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

**వేడుకల్లో పాల్గొన్న మిత్రులు**

ఈ జన్మదిన వేడుకల్లో ఏసుదాసు ఆత్మీయ మిత్రులు మురకొండ సూరిబాబు, తోరాటి సత్తిబాబు (ర్యాలి సత్తిబాబు), నందపునీడి వెంకట శ్రీనివాస్ (ఎన్ఎస్), తోరాటి సుబ్బన్న, తిర్నాతి వెంకన్న, వానపల్లి చంద్రరావు, మీసాల కిట్టయ్య, దొడ్డా నాని, తోరాటి ఏసురాజు తదితరులు పాల్గొన్నారు.

# గొల్లప్రోలులో వైభవంగా ప్రారంభమైన దేవీ శరన్నవరాత్రులు





**బాలాత్రిపురసుందరిగా దర్శనమిచ్చిన అమ్మవారు**

**గొల్లప్రోలు (ప్రజా జ్యోతి)** గొల్లప్రోలులో దేవీ శరన్నవరాత్రోత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా ప్రారంభమయ్యాయి. నవరాత్రుల తొలి రోజైన ఆదివారం నాడు స్థానిక ఆలయాలన్నీ ఆధ్యాత్మిక శోభతో విరాసిల్లాయి. స్థానిక పాత బస్టాండ్ వద్ద వేంచేసియున్న శ్రీ విజయ దుర్గమ్మ ఆలయం, కరణంగారి తోటలోని శ్రీ కనక దుర్గమ్మ ఆలయాల్లో శరన్నవరాత్రుల సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలు నిర్వహించారు. ఉత్సవాల మొదటి రోజున అమ్మవారు "శ్రీ బాలాత్రిపురసుందరి దేవి" అలంకారంలో భక్తులకు భవ్య దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తెల్లవారుజాము నుంచే పెద్ద సంఖ్యలో ఆలయాలకు తరలివచ్చారు. అర్చకులు ప్రత్యేక హారతులు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. శరన్నవరాత్రుల ప్రారంభంతో మండలంలోని పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఈ పూజా కార్యక్రమాల్లో జనసేన పార్టీ నాయకులు కడారి తమ్మయ్య నాయుడు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వారు ఆలయాలను సందర్శించి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. సాంస్కృతిక ప్రదర్శనలు షురూ కరణంగారి తోటలో నవరాత్రుల 10 రోజులను పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా మొదటి రోజు ఏర్పాటు చేసిన భరతనాట్యం ప్రదర్శనను జనసేన నాయకులు కడారి తమ్మయ్య నాయుడు రిబ్బన్ కటింగ్ చేసి ఘనంగా ప్రారంభించారు. అనంతరం ఆలయంలో భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేసిన ఆయన, కాసేపు అక్కడే ఆసీనులై భరతనాట్య ప్రదర్శనను తిలకించారు.



నవరాత్రుల ప్రారంభంతో గొల్లప్రోలు పరిసర ప్రాంతాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

## దుర్గాడ శివాలయంలో వైభవంగా ప్రారంభమైన దేవీ శరన్నవరాత్రులు



**గొల్లప్రోలు (ప్రజా జ్యోతి)** దుర్గాడ గ్రామంలోని ప్రసిద్ధిగాంచిన దుర్గాడ శివాలయంలో దేవీ శరన్నవరాత్రులను పురస్కరించుకుని ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. శరన్నవ రాత్రి ఉత్సవాల తొలిరోజును పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తు సోదరుల ఆధ్వర్యంలో వేదమంత్రాల నడుమ మహాగణపతి పూజ, కలసస్థాపన, మండపారాధన కార్యక్రమాలను ఘనంగా జరిపారు. అనంతరం అమ్మవారికి 11 రకాల విశేష ద్రవ్యాలతో పాటు, హరిద్ర, కుంకుమ జలాలతో వైభవంగా అభిషేకం నిర్వహించారు. ఈ పూజా మహోత్సవంలో భాగంగా సౌభాగ్య స్త్రీలచే సామూహిక లలితా సహస్రనామ కుంకుమార్చనలు చేయించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు నీరాజనాలు, మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆలయంలో ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వేళల్లో అమ్మవారికి కుంకుమార్చనలు జరుగుతాయని ఆలయ సేవా సభ్యులు ఈ సందర్భంగా తెలియజేశారు. భక్తులందరూ ఈ పూజా కార్యక్రమాల్లో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు.

## దివ్యాంగుల హక్కుల పోరాట యోధురాలు 'మేడిశెట్టి నాగమణి'కి జనసేన అధిష్ఠానంలో కీలక బాధ్యతలు!



**గొల్లప్రోలు (ప్రజా జ్యోతి)** "అవయవాలకే అంగరక్షణ తప్ప మనసుకు కాదు" అని నిరూపిస్తూ, శారీరక వైకల్యాన్ని సైతం లెక్కచేయకుండా జనసేన పార్టీ బలోపేతానికి అహర్నిశలు శ్రమిస్తున్న వీర మహిళ మేడిశెట్టి నాగమణికి పార్టీ అధిష్ఠానం సముచిత స్థానం కల్పించింది. పిఠాపురం అసెంబ్లీ నియోజకవర్గ స్థానిక ఎన్నికల కోఆర్డినేషన్ కమిటీ సపోర్ట్ టీం సభ్యురాలిగా ఆమెను నియమిస్తూ అధిష్ఠానం ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే ఆమెతో పాటు గుణబత్తుల శాంతి కుమారిని కూడా సమన్వయ కమిటీ సభ్యురాలిగా నియమించారు. మహిళలకు కమిటీలో ప్రాధాన్యత కల్పించడం పట్ల స్థానిక నాయకులు, వీర మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**పార్టీ కోసం అంకితభావం.. సేవా తత్పరత**

గొల్లప్రోలు జనసేన పార్టీ చేపట్టే ప్రతి కార్యక్రమంలోనూ నాగమణి ముందుంటూ తనదైన శైలిలో దూసుకుపోతున్నారు. జనసేనాని పవన్ కళ్యాణ్ ఆశయాలను శిరోధార్యంగా భావిస్తూ, నిరంతరం ప్రజల్లో ఉంటూ, ముఖ్యంగా మహిళలందరినీ ఎంతో ఆప్యాయంగా పలకరిస్తూ అందరి మన్ననలు పొందారు. మానవత్వం, సేవాతత్పరతతో దివ్యాంగుల హక్కుల కోసం ఆమె చేస్తున్న పోరాటం నియోజకవర్గంలో ఎంతోమందికి స్ఫూర్తిదాయకంగా నిలిచింది. దివంగత నాయకుల ఆశయాలను ముందుకు తీసుకెళ్తూ పార్టీపై ఎనలేని ప్రేమని చాటుకుంటున్న నాగమణికి ఈ పదవి దక్కడం ఆమె కష్టానికి దక్కిన ఫలితమని స్థానిక నేతలు కొనియాడారు. మేడిశెట్టి నాగమణి రాబోయే రోజుల్లో పార్టీలో దివ్యాంగుల విభాగంలో మరింత గొప్ప స్థానాన్ని అధిరోహించాలని ఆకాంక్షిస్తూ.. పిఠాపురం నియోజకవర్గ స్థానిక నాయకులు, జనసేన వీర మహిళల తరఫున ఆమెకు ప్రత్యేక అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు.

## గొల్లప్రోలులో వైభవంగా ప్రారంభమైన దేవీ శరన్నవరాత్రులు



**గొల్లప్రోలు (ప్రజా జ్యోతి)** దేవీ శరన్నవరాత్రోత్సవాలు ప్రారంభం కావడంతో గొల్లప్రోలు ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద వెలసిన శ్రీ విజయ దుర్గమ్మ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు వైభవంగా నిర్వహించారు. శరన్నవరాత్రుల తొలి రోజు సందర్భంగా అమ్మవారు బాలాత్రిపుర సుందరి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. నవరాత్రుల ప్రారంభంతో పట్టణంలోని రెండు ఆలయాల్లోనూ భక్తిశ్రద్ధలు, ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిశాయి. ఉత్సవాల మొదటి రోజు కావడంతో అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. అర్చకులు అమ్మవారికి శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. శ్రీ విజయ దుర్గమ్మ అమ్మవారిని పట్టణ జనసేన అధ్యక్షుడు మామిడాల సూరిబాబుతో పాటు పలువురు జనసేన నాయకులు దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన నాయకులకు ఆలయ కమిటీ సభ్యులు స్వాగతం పలికారు. అనంతరం వారు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. భవాని భక్తులకు అన్న ప్రసాదం ఏర్పాట్లు నవరాత్రుల ఉత్సవాల సందర్భంగా ఆలయంలో ప్రతిరోజూ భవానీ మాలధారులకు, భక్తులకు భిక్ష అందించేందుకు దాతలు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఉత్సవాలు ప్రశాంతంగా, విజయవంతంగా జరిగేలా ఆలయ కమిటీ అన్ని చర్యలు చేపట్టింది.

# గొల్లప్రోలు ఈబీసీ కాలనీలో కార్డన్ అండ్ సెర్చ్

# సరైన రికార్డులు లేని 31 వాహనాలు స్వాధీనం





**గొల్లప్రోలు (ప్రజా జ్యోతి)** గొల్లప్రోలు ఈబీసీ కాలనీలో ఆదివారం తెల్లవారుజామున పోలీసులు విస్తృత స్థాయి కార్డన్ అండ్ సెర్చ్ తనిఖీలునిర్వహించారు. పిఠాపురం సీఐ జి.వి.వి. సత్యనారాయణ, గొల్లప్రోలు ఎస్ఐ ఎన్. రామకృష్ణ, ఈగల్ టీమ్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు సంయుక్త ఆధ్వర్యంలో సర్కిల్ పోలీసు సిబ్బంది, రిక్రూట్ కానిస్టేబుళ్లతో కలిసి ఉదయం 5:00 గంటల నుండి 7:00 గంటల వరకు ఈ శోధన కార్యక్రమం కొనసాగింది.ఈ తనిఖీల్లో భాగంగా కాలనీలోని పలు ఇళ్లను, వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఇందులో సరైన రికార్డులు, ధృవీకరణ పత్రాలు లేని 31 మోటారు వాహనాలను పోలీసులు గుర్తించి, తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం స్వాధీనం చేసుకున్నారు.

**'త్రిశూల్' కార్యక్రమంతో అవగాహన**

తనిఖీల అనంతరం గొల్లప్రోలు పోలీస్ స్టేషన్ ఆవరణలో ప్రజల రక్షణే ధ్యేయంగా 'త్రిశూల్' అనే ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు, మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణం, మహిళల భద్రత, రహదారి భద్రతా నియమాలు మరియు అక్రమ కార్యకలాపాల నివారణపై స్థానికులకు కూలంకషంగా అవగాహన కల్పించారు.ప్రజలు చట్టవ్యతిరేక పనులకు దూరంగా ఉండాలని, పరిసరాల్లో ఎలాంటి అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు కనిపించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ప్రజల రక్షణ, పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం ఇటువంటి ఆకస్మిక తనిఖీలు, అవగాహన సదస్సులు నిరంతరం కొనసాగుతాయని పోలీసు అధికారులు స్పష్టం చేశారు.

# వెల్దుర్తిలో ఏపీజేపీఎస్ కార్యాలయం ప్రారంభం





**డోన్ ప్రజా జ్యోతి అక్టోబర్ 11,** నంద్యాల జిల్లా వెల్దుర్తి మండలంలో ఆదివారం జర్నలిస్టుల కార్యాలయం ఓపెనింగ్ లో ,సీఐ యుగంధర్, ఎస్ఐ నరేష్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు, సీఐ చేతుల మీదుగా ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టుల పరిరక్షణ సమితి మండల కార్యాలయాన్ని రూబెన్ కట్ చేసి ప్రారంభం చేశారు, సంఘం జెండాను ఆవిష్కరించి, వెల్దుర్తి జర్నలిస్టులకు ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టుల పరిరక్షణ సమితి గుర్తింపు కార్డులను అందజేశారు, సీఐ యుగంధర్, ఎస్సై నరేష్, మాట్లాడుతూ,జర్నలిస్టులు ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తూ ప్రజల కోసం పనిచేయాలని, స్వార్థ ప్రయోజనాలకు దూరంగా ఉంటూ వృత్తి విలువలను కాపాడాలని తెలిపారు,జర్నలిస్టులు సమాజంలో కీలక పాత్ర పోషిస్తున్నారని, ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో మీడియా బాధ్యత ఎంతో ముఖ్యమని. వెల్దుర్తి ప్రాంతంలో వార్తల సేకరణలో వాస్తవాలకు ప్రాధాన్యతనిస్తూ ప్రజా ప్రయోజనాలే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. వెల్దుర్తిలో ఏపీజేపీఎస్ మండల కమిటీని ఏర్పాటు చేసి కార్యాలయాన్ని ప్రారంభించడం అభినందనీయమని అన్నారు.

**జర్నలిస్టుల ఐక్యతే సంఘానికి బలం**

అనంతరం ఏపీజేపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం. శివరామయ్య ఆచారి మాట్లాడుతూ అతి తక్కువ కాలంలోనే రాష్ట్రవ్యాప్తంగా సంఘం శాఖలను ఏర్పాటు చేసుకోవడం ఆనందంగా ఉందన్నారు. వెల్దుర్తి మండల కమిటీ నాయకులు, సభ్యులు అంకితభావంతో పనిచేస్తూ సంఘం అభ్యున్నతికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.చిన్న, పెద్ద అనే తేడాలు లేకుండా జర్నలిస్టులందరూ ఒక్కటేననే భావనతో సంఘాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. డోన్ నియోజకవర్గం అధ్యక్షుడు నాగరాజు మాట్లాడుతూజర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, వృత్తిపరమైన గౌరవం, భద్రత, సంక్షేమానికి ప్రాధాన్యతనివ్వడమే ఏపీజేపీఎస్ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. జర్నలిస్టులకు ఎలాంటి సమస్య ఎదురైనా వారి పక్షాన నిలబడి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. జర్నలిస్టులంతా ఐకమత్యంతో ముందుకు సాగితేనే హక్కుల సాధన సాధ్యమవుతుందని తెలిపారు.డోన్ నుంచి వెల్దుర్తికి ఏపీజేపీఎస్ సభ్యులు బైక్ ర్యాలీగా వెల్దుర్తికి చేరుకున్నారు. సమావేశంలో సంఘం బలోపేతం, జర్నలిస్టుల సమస్యలు, భవిష్యత్ కార్యాచరణపై నాయకులు తమ అభిప్రాయాలను వెల్లడించారూ. మధ్యాహ్నం భోజనం అనంతరం మీటింగు ముగిసినది

**పాల్గొన్న నాయకులు, సభ్యులు**

ఏపీజేపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు శివరామ ఆచారి, కార్యదర్శి విజయ్, కోశాధికారి జయాకర్, సహాయ కార్యదర్శి ప్రసాద్, కర్నూలు జిల్లా ఇన్‌చార్జి యాగంటి, లీగల్ అడ్వైజర్ శివరామకృష్ణ, డోన్ అధ్యక్షుడు నాగరాజు, ఉపాధ్యక్షుడు జెర్మియా, కార్యదర్శి సుధాకర్, సహాయ కార్యదర్శి గిరిబాబు, కోశాధికారి ఖ శ్రీనివాసులుయాదవ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రంగన్న గౌడ్ కమిటీ నెంబర్లు సురేంద్ర, లోకేష్, ఉమ్మడి జిల్లా జర్నలిస్టుల స్పోర్ట్స్ జిల్లా చైర్మన్ చిరంజీవి, డోన్ ఏపీజేపీఎస్ నాయకులు ఎన్. శ్రీనివాసులు, సురేంద్ర, సునీధర్ వెల్దుర్తి మండల అధ్యక్షుడు రాజు, గౌరవ అధ్యక్షుడు ఖాజా హుస్సేన్, రాజు, ఉపాధ్యక్షులు, కార్యదర్శి, సహాయ కార్యదర్శి మౌలాలి, కమిటీ సభ్యులు, బేతంచర్ల అధ్యక్షుడు మద్దిలేటి స్వామి, రఫీ, బాలశేఖర్‌తో పాటు ఏపీజేపీఎస్ నాయకులు, కార్యకర్తలు, పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు. కార్యాలయ ప్రారంభోత్సవం సందర్భంగా వెల్దుర్తి కమిటీ సభ్యులకు పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు.

# బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు టీడీపీతోనే సాధ్యం

**- బీసీల అభ్యున్నతికి టీడీపీ, ఎన్డీయే ప్రభుత్వం కట్టుబడి ఉంది**

**- జగన్ రెడ్డి బీసీ రిజర్వేషన్లను అడ్డుకునేందుకే సుప్రీంకోర్టును ఆశ్రయించారు**

**- చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు**



**చీపురుపల్లి , ప్రజాజ్యోతి న్యూస్ :** బీసీలకు రాజకీయంగా, ఆర్థికంగా అండగా నిలిచేది తెలుగుదేశం పార్టీయేనని చీపురుపల్లి ఎమ్మెల్యే, మాజీ మంత్రి కిమిడి కళావెంకటరావు పేర్కొన్నారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించడం టీడీపీ, ఎన్డీయే ప్రభుత్వంతోనే సాధ్యమని ఆయన స్పష్టం చేశారు. బీసీలకు రాజకీయ సాధికారత కల్పించడంతో పాటు, వారి ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోందని తెలిపారు.టీడీపీ ఆవిర్భావం నుంచే బీసీలకు ప్రాధాన్యం తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచే స్వర్గీయ నందమూరి తారక రామారావు బీసీలను రాజకీయంగా, సామాజికంగా ముందువరుసలో నిలబెట్టారని కళావెంకటరావు పేర్కొన్నారు. ఎన్టీఆర్ ప్రారంభించిన బీసీల అభ్యున్నతి ప్రస్థానాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, యువనేత నారా లోకేష్ కొనసాగిస్తున్నారని తెలిపారు. బీసీలకు రాజకీయ అవకాశాలు కల్పించడంతో పాటు, ఆర్థికంగా ఎదిగేందుకు అవసరమైన అండదండలు అందిస్తున్నారని వివరించారు. బీసీల ఎదుగుదల జగన్‌కు ఇష్టం లేదు బీసీలు రాజకీయంగా, ఆర్థికంగా ఎదిగి సాధికారత సాధించడం వైఎస్సార్‌సీపీ అధినేత జగన్ రెడ్డికి ఇష్టం లేదని కళావెంకటరావు విమర్శించారు. బీసీలకు అధిక ప్రాధాన్యం లభించకుండా అడ్డుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించే అంశంలో జగన్ రెడ్డి వ్యవహారశైలి బీసీలకు నష్టం కలిగించేలా ఉందని మండిపడ్డారు. బీసీల హక్కులను కాపాడుతాం బీసీలకు దక్కాల్సిన 34 శాతం రిజర్వేషన్లను అడ్డుకునేందుకే జగన్ రెడ్డి సుప్రీంకోర్టును ఆశ్రయించారని కళావెంకటరావు ఆరోపించారు. బీసీల రాజకీయ ప్రాతినిధ్యాన్ని పెంచి, వారికి సముచిత న్యాయం చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. బీసీల హక్కులు, సంక్షేమం, అభివృద్ధికి తెలుగుదేశం పార్టీ నిరంతరం కృషి చేస్తుందని ఆయన స్పష్టం చేశారు.

## దుర్గామాత ఆశీస్సులు ప్రతి కుటుంబం పై ఉండాలి

**- బావరాజుపాలెంలో ఘనంగా దేవీ నవరాత్రి ఉత్సవాలు**

**- ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా పంచాయతీ రాజ్ ఛాంబర్ అధ్యక్షులు పిన్నింటి భానోజీ నాయుడు**



**రణస్థలం , ప్రజాజ్యోతి న్యూస్ :** ఎచ్చెర్ల నియోజకవర్గం రణస్థలం పంచాయతీ పరిధిలోని బావరాజుపాలెం కాలనీలో దేవీ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా దుర్గామాతకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి, అమ్మవారి ఆశీస్సులు ప్రతి కుటుంబంపై ఉండాలని భక్తులు ప్రార్థించారు. ఈ పూజా కార్యక్రమంలో ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షులు పిన్నింటి వెంకట బానోజీ నాయుడు (పిన్నింటి భాను), మజ్జి వెంకటరమణ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, యువతకు ఉద్యోగ అవకాశాలు లభించాలని, ప్రతి ఒక్కరికీ ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు కలగాలని ప్రార్థనలు చేశారు.దేవీ నవరాత్రుల సందర్భంగా కాలనీలో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించగా, కాలనీ కమిటీ సభ్యులు, యువత, భవానీ భక్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకట్రావు, చిన్నారావు, అప్పారావు, రత్నం, శ్రీధర్ తదితరులు పూజా కార్యక్రమాల నిర్వహణలో పాల్గొన్నారు.దుర్గామాత కృపతో ప్రజలందరికీ శాంతి, సౌభాగ్యం కలగాలని, గ్రామంలో ఐకమత్యం వెల్లివిరియాలని ఆకాంక్షించారు.భక్తిప్రపత్తులతో సాగిన ఈ కార్యక్రమంతో బావరాజుపాలెం కాలనీలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

## జనసేన ప్యాపిలి మండలంలో సమన్వయకర్తగా రేణుక నాయక్



**ప్యాపిలి అక్టోబర్ 11 ప్రజా జ్యోతి న్యూస్** డోన్ నియోజకవర్గ అసెంబ్లీ సమన్వయకర్తగా ప్యాపిలి మండల పరిధిలోని సీతమ్మ తండా గ్రామానికి చెందిన రేణుక నాయక్ ను నియమిస్తూ జనసేన అధిష్టానం ఉత్తర్వులు జారీ చేసింది. ఉత్తర్వులు అందుకున్న రేణుక నాయక్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో అసెంబ్లీ సమన్వయకర్తగా తనను ఎంపిక చేసిన జనసేన అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే తనకు అప్పగించిన బాధ్యతలను జనసేన నాయకులతో కలిసి సమర్థవంతంగా నిర్వర్తిస్తానని పేర్కొన్నారు.

## కరణంగారి తోటలో కనకదుర్గమ్మ ఆలయంలో శరన్నవరాత్రి మహోత్సవాల పోస్టర్ ప్రదర్శనలి



**గొల్లప్రోలు (ప్రజా జ్యోతి)** గొల్లప్రోలు కరణంగారి తోటలో వేంచేసియున్న శ్రీ కనకదుర్గమ్మ వారి శరన్నవరాత్రి మహోత్సవాల పూజా కార్యక్రమాల వివరాలతో కూడిన కార్యక్రమ పత్రికను ఆదివారం ప్రదర్శించారు. గొల్లప్రోలు తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు గుంద్ర సుబ్బారావు, ఇతర టీడీపీ నాయకులు అమ్మవారిని దర్శించుకున్న అనంతరం ఈ పోస్టర్‌ను ప్రదర్శించిన అనంతరం టీడీపీ పట్టణ అధ్యక్షుడు గుంద్ర సుబ్బారావు మాట్లాడుతూ.. అమ్మవారి ఆశీస్సులతో ఈ శరన్నవరాత్రి మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో, అత్యంత వైభవంగా జరిగి విజయవంతం కావాలని ఆకాంక్షించారు. పట్టణ ప్రజలందరూ ఈ ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, భక్తులు స్థానికులు పాల్గొని కార్యక్రమ పోస్టర్‌ను ప్రదర్శించారు.

## భద్రాద్రి రామయ్యను దర్శించుకున్న పాలకొండ జనసేన ఎమ్మెల్యే

**స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు**

**ఘన స్వాగతం పలికిన ఎటపాక జనసేన మండల నాయకులు**



**ఎటపాక, అక్టోబర్ 11 (ప్రజాజ్యోతి):** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి వారిని ఆదివారం పాలకొండ నియోజకవర్గ జనసేన పార్టీ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యేకు అర్చకులు, అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆయన, మూలవిరాట్టును దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు ఎమ్మెల్యేకు వేదాశీర్వచనం పలికి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎటపాక జనసేన నాయకులు ఎమ్మెల్యే జయకృష్ణకు శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎటపాక జనసేన పార్టీ మండల అధ్యక్షుడు మారాసు గంగాధర్‌తో పాటు మండల నాయకులు కొమ్ము వెంకటేష్, మొల సతీష్, గోవిందు వెంకట్, గోడేటి నాగరాజు, పేరాల వీరయ్య, కందుల సంపత్, శివకృష్ణ, కొల్లు రాము తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాద బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే గిత్త జయసూర్య



**ప్రజా జ్యోతి నందికొట్కూరు** నంద్యాల జిల్లా నందికొట్కూరు పట్టణంలోని సూర్యనగర్ కూడలి సమీపంలో రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో మాజీ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి కాటేపోగు నాగ సురేష్‌తో పాటు ప్రేమ్, శ్యాంసుందర్ తీవ్రంగా గాయపడ్డారు. వీరు అల్లూరుకు బయలుదేరుతుండగా ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు సమాచారం.ఈ ప్రమాద విషయం తెలుసుకున్న నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య బాధితుల ఇంటికి వెళ్లి వారిని పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకుని, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.ఈ పరామర్శ కార్యక్రమంలో నిమ్మకాయల మోహన్, లింగాల స్వాములు, సీపీఐ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## స్వర్ణ కవచ అలంకరణలో వాసవి మాత

**ప్యాపిలి అక్టోబర్ 11 ప్రజా జ్యోతి న్యూస్** దసరా శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మొదటిరోజు వాసవి మాత అమ్మవారు స్వర్ణ కవచ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రతి సంవత్సరం లాగే పట్టణంలోని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు రాజా మురళి కృష్ణ ఆధ్వర్యంలో అమ్మవారి శాలలో శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. స్వర్ణ కవచ అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవారిని ఆర్యవైశ్యులు భక్తిశ్రద్ధలతో దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు . భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేసిన కమిటీ సభ్యులకు ఆర్యవైశ్యులు, మహిళలు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు



బిజినెస్

# ఆన్‌లైన్ షాపింగ్ జోరు..
## 48 గంటల్లో రూ.24,000 కోట్ల సేల్స్!

దసరా, దీపావళి వంటి పండుగల సీజన్ వచ్చిందంటే చాలు.. కొత్త బట్టలు, స్మార్ట్‌ఫోన్లు, టీవీలు, ఫ్రిజ్‌లు లాంటి వస్తువులు కొనుగోలు చేసేందుకు చాలామంది ఆసక్తి చూపిస్తారు. ముఖ్యంగా.. ఆన్‌లైన్‌లో భారీ డిస్కౌంట్లు, బ్యాంక్ ఆఫర్లు, ఎక్స్ఛేంజ్ డీల్స్ అందుబాటులో ఉండటంతో షాపింగ్ చేసేవారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఈసారి కూడా పండుగల సేల్స్‌లో ఇదే ట్రెండ్ కనిపిస్తోంది. ప్రముఖ ఈ-కామర్స్ సంస్థలు ప్రారంభించిన సేల్స్‌కు వినియోగదారుల నుంచి భారీ స్పందన లభించింది. కేవలం 48 గంటల్లోనే (రెండు రోజుల్లో) ఏకంగా రూ.24,200 కోట్ల విలువైన వస్తువులు అమ్ముడైనట్లు రెడ్‌సీర్ స్ట్రాటజీ కన్సల్టెంట్స్ నివేదిక వెల్లడించింది.



### రెండు రోజుల్లోనే..
అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, మీషో, జియో వంటి ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌లలో పండుగల సేల్స్ ప్రారంభం కావడంతో ఆన్‌లైన్ షాపింగ్ ఊపందుకుంది. రెడ్‌సీర్ నివేదిక ప్రకారం.. మొదటి రెండు రోజుల్లోనే దేశవ్యాప్తంగా సుమారు 6 కోట్ల నుంచి 6.5 కోట్ల మంది వినియోగదారులు ఈ సేల్స్‌లో పాల్గొన్నారు. వీరు మొత్తం 8 కోట్ల నుంచి 9 కోట్ల వరకు ఆర్డర్లు చేసినట్లు అంచనా. సాధారణ రోజుల్లో జరిగే వ్యాపారంతో పోలిస్తే ఈ రెండు రోజుల్లో నమోదైన అమ్మకాలు సుమారు ఆరు రెట్లు ఎక్కువగా ఉండటం విశేషం. అంటే, పండుగల సమయంలో ఆన్‌లైన్ షాపింగ్‌కు ప్రజలు ఎంత ప్రాధాన్యం ఇస్తున్నారో ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. మరోవైపు.. నిత్యావసరాలు, ఇతర వస్తువులను తక్కువ సమయంలో ఇంటికి చేర్చే క్విక్ కామర్స్ సేవలకు కూడా డిమాండ్ పెరిగింది. ఈ విభాగంలో సాధారణ రోజులతో పోలిస్తే నాలుగు నుంచి ఐదు రెట్లు అధిక వ్యాపారం నమోదైనట్లు నివేదిక పేర్కొంది.

### స్మార్ట్‌ఫోన్ సేల్స్ ఇలా
ఈ పండుగల సేల్స్‌లో స్మార్ట్‌ఫోన్లు అత్యధిక అమ్మకాలు సాధించిన ఉత్పత్తులుగా నిలిచాయి. కొత్త ఫోన్లు కొనుగోలు చేయాలనుకునేవారికి భారీ డిస్కౌంట్లు, పాత ఫోన్లపై ఎక్స్ఛేంజ్ ఆఫర్లు అందుబాటులో ఉండటంతో చాలామంది ఈ అవకాశాన్ని ఉపయోగించుకున్నారు. నివేదికలో వెల్లడైన.. మొత్తం అమ్మకాల్లో స్మార్ట్‌ఫోన్ల వాటా 38 నుంచి 40 శాతం వరకు ఉంది. వీటి విలువ సుమారు రూ.9,100 కోట్ల నుంచి రూ.9,600 కోట్లుగా అంచనా వేశారు.

### గృహోపకరణాలకు డిమాండ్
స్మార్ట్‌ఫోన్ల తర్వాత కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్, గృహోపకరణాలు మంచి అమ్మకాలను నమోదు చేశాయి. టీవీలు, ఫ్రిజ్‌లు, వాషింగ్ మెషీన్లు వంటి వస్తువులను కొనుగోలు చేసేందుకు చాలామంది ఆసక్తి చూపించారు. ఈ విభాగం మొత్తం అమ్మకాల్లో 25 నుంచి 27 శాతం వాటాను దక్కించుకున్నట్లు నివేదిక అంచనా వేసింది. వీటి అమ్మకాల విలువ సుమారు రూ.6,000 కోట్ల నుంచి రూ.6,500 కోట్ల వరకు ఉంది.

### ఫ్యాషన్ ఉత్పత్తుల సేల్స్
కొత్త బట్టలు, చెప్పులు, ఇతర ఫ్యాషన్ ఉత్పత్తుల కొనుగోళ్లు కూడా జోరుగా సాగాయి. మొత్తం అమ్మకాల్లో.. ఫ్యాషన్ విభాగం 15 నుంచి 18 శాతం వాటాను పొందినట్లు అంచనా. ఈ విభాగం ద్వారా.. సుమారు రూ.3,630 కోట్ల నుంచి రూ.4,350 కోట్ల విలువైన అమ్మకాలు జరిగినట్లు నివేదిక పేర్కొంది. ముఖ్యంగా తక్కువ ధరల్లో అందుబాటులో ఉండే ఫ్యాషన్ దుస్తులకు చిన్న పట్టణాల నుంచి కూడా మంచి స్పందన లభిస్తోంది.

### చిన్న పట్టణాల్లోనూ కూడా..
గతంలో ఆన్‌లైన్ షాపింగ్ ఎక్కువగా మెట్రో నగరాలకే పరిమితమై ఉండేది. కానీ ఇప్పుడు టైర్-2 నగరాలు, చిన్న పట్టణాల్లోనూ ఈ-కామర్స్ వినియోగం పెరుగుతోంది. ఇంటి వద్దకే వస్తువులు డెలివరీ కావడం, ధరలను పోల్చి చూసుకునే అవకాశం ఉండటం, ఆన్‌లైన్ ఆఫర్లు అందుబాటులో ఉండటం ఇందుకు ప్రధాన కారణాలుగా చెప్పవచ్చు.

# వెండి భారీ పతనం.. అసలు కారణం ఇదే!



సాధారణంగా బంగారం, వెండి అంటే చాలామందికి ఇష్టం. కొందరు ఆభరణాల కోసం కొనుగోలు చేస్తే.. మరికొందరు భవిష్యత్తులో మంచి లాభాలు వస్తాయనే ఆశతో పెట్టుబడులు పెడుతుంటారు. అయితే, గత కొంతకాలంగా బంగారంతో పోలిస్తే వెండి ధరలు భారీగా పడిపోతున్నాయి. దీంతో వెండిలో పెట్టుబడి పెట్టినవారు ఆందోళన చెందుతున్నారు. గతంలో మంచి రాబడులు ఇచ్చిన వెండి ఇప్పుడు ఎందుకు తగ్గుతోంది? అసలు ధరల పతనానికి కారణాలేంటి? అనే విషయాలు ఈ కథనంలో తెలుసుకుందాం.

### అందుకే వెండికి డిమాండ్
వెండిని మనం సాధారణంగా ఆభరణాలు, పూజా సామగ్రి, పట్టీలు, మెట్టెలు, దేవుడి విగ్రహాలు, గ్లాసులు వంటి వస్తువుల తయారీలో ఉపయోగిస్తుంటాం. అయితే.. వెండికి డిమాండ్ పెరగడానికి ఇవే ప్రధాన కారణాలు కావు. పారిశ్రామిక రంగంలో కూడా వెండిని విస్తృతంగా వినియోగించడంతో వెండికి డిమాండ్ విపరీతంగా పెరిగింది. ముఖ్యంగా ఎలక్ట్రిక్ వాహనాలు, సోలార్ విద్యుత్ పరికరాలు, ఎలక్ట్రానిక్ చిప్‌లు, డేటా సెంటర్లు వంటి రంగాల్లో వెండి కీలక పాత్ర పోషిస్తుంది. వెండికి విద్యుత్‌ను సమర్థవంతంగా ప్రసారం చేసే లక్షణం ఉండటంతో అనేక ఎలక్ట్రానిక్ పరికరాల్లో దీన్ని ఉపయోగిస్తారు. అందువల్ల పారిశ్రామిక రంగంలో డిమాండ్ పెరిగినా, తగ్గినా వెండి ధరలపై ప్రభావం పడుతుంది. అంతర్జాతీయ మార్కెట్లలో జరిగే మార్పులు కూడా వెండి ధరలను ప్రభావితం చేస్తాయి.

### బంగారం, వెండి ధరల్లో వ్యత్యాసం
ఇటీవల బంగారం, వెండి ధరల మధ్య వ్యత్యాసం కనిపిస్తోంది. ఈ ఏడాది ఇప్పటివరకు బంగారం ధర సుమారు 3 శాతం తగ్గగా, వెండి ధర ఏకంగా 16 శాతం పడిపోయింది. గత ఆరు నెలల్లో వెండి 20.14 శాతం, గత నెలలో 8.14 శాతం తగ్గినట్లు నివేదికలు చెబుతున్నాయి. పరిశ్రమల్లో వెండి వినియోగం తగ్గితే.. భవిష్యత్తులో వెండికి డిమాండ్ తగ్గే అవకాశం ఉంటుందని పెట్టుబడిదారుల్లో ఆందోళన కలుగుతోంది. అమెరికా డాలర్ బలపడటం కూడా వెండి ధరలను ప్రభావితం చేయవచ్చు. అంతర్జాతీయ మార్కెట్‌లో వెండి సాధారణంగా డాలర్లలో ట్రేడవుతుంది. డాలర్ బలపడినప్పుడు ఇతర కరెన్సీలు ఉపయోగించే కొనుగోలుదారులకు వెండి ఖరీదుగా మారే అవకాశం ఉంటుంది. దీంతో డిమాండ్‌పై ప్రభావం పడవచ్చు.

### ఈ రోజు వెండి ధరలు
వెండి రేటు గత వారం రోజులుగా స్థిరంగా ఉంది. దీంతో కేజీ సిల్వర్ ధర హైదరాబాద్, విజయవాడలలో రూ.2.45 లక్షల వద్ద ఉంది. ఢిల్లీలో కేజీ వెండి రేటు రూ.2.40 లక్షల వద్ద ఉంది.

## గ్రీన్ కార్డు ప్రోగ్రామ్ సస్పెన్షన్‌పై స్పందించిన ఇన్ఫోసిస్




ఇంటర్నెట్ డెస్క్: అర్హులైన విదేశీ కార్మికులకు గ్రీన్‌కార్డు కోసం కంపెనీలు స్పాన్సర్ చేయడానికి వీలు కల్పించే పర్మ్ కార్యక్రమం నుంచి అమెరికా తమను సస్పెండ్ చేయడంపై ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ స్పందించింది. ఈ నిర్ణయం తమ కార్యకలాపాలపై గణనీయమైన ప్రభావం చూపదని భావిస్తున్నట్లు పేర్కొంది. ఈ మేరకు తన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో కంపనీ వెల్లడించింది. 'ట్రంప్ సర్కారు పర్మ్ ప్రోగ్రాం నుంచి ఇన్ఫోసిస్‌ను సస్పెండ్ చేసింది. ఇది కంపెనీ కార్యకలాపాలపై పెద్దగా ప్రభావం చూపదని భావిస్తున్నాం. అమెరికాలో సాంకేతికతకు, ఆవిష్కరణలకు, స్థానిక ఉద్యోగాల నియామకాలకే కంపెనీ పెట్టుబడులు పెడుతోంది. అమెరికాలో వర్తించే నిబంధనలకు, చట్టాలన్నింటికీ కట్టుబడి ఉన్నాం" అని ఇన్ఫోసిస్ తెలిపింది. హెచ్-1బీ వీసా ఉద్యోగులకు గ్రీన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకునేందుకు కంపెనీలను అనుమతించే పర్మినెంట్ లేబర్ సర్టిఫికేషన్ ప్రోగ్రామ్ (పర్మ్) నుంచి మైక్రోసాఫ్ట్, టాటా, ఇన్ఫోసిస్, విప్రో సహా మొత్తం 8 దిగ్గజ ఐటీ కంపెనీలను అమెరికా సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే. అయితే, గత కొన్నేళ్లుగా భారత ఐటీ కంపెనీల గ్రీన్ కార్డు దరఖాస్తులను గణనీయంగా తగ్గించినట్లు టెక్ వర్గాలు చెబుతున్నాయి. యూఎస్ ఆర్థిక సంవత్సరం-26లో టీసీఎస్ కేవలం 2 పర్మ్ దరఖాస్తులు మాత్రమే సమర్పించడం గమనార్హం.

# మూడో టీ20లో భారత్ థ్రిల్లింగ్ విక్టరీ
## సిరీస్‌లో 2-1 ఆధిక్యం

**మూడో టీ20లో వెస్టిండీస్‌పై భారత్ ఘన విజయం**
**14 పరుగుల తేడాతో గెలిచి సిరీస్‌లో 2-1 ఆధిక్యం**
**విరుచుకుపడ్డ అభిషేక్ శర్మ (69), ఇషాన్ కిషన్ (37)**
**మూడు వికెట్లతో రాణించిన అర్ష్‌దీప్ సింగ్**



ఈ నెల 14న హైదరాబాద్‌లో ఇరుజట్ల మధ్య నాలుగో టీ20 ఇండోర్ వేదికగా వెస్టిండీస్‌తో జరిగిన మూడో టీ20లో టీమిండియా 14 పరుగుల తేడాతో ఉత్కంఠ విజయం సాధించింది. పరుగుల వరద పారిన ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటర్లు, ఆ తర్వాత బౌలర్లు సమష్టిగా రాణించడంతో భారత్ గెలుపొందింది. ఈ విజయంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో 2-1 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో 223 పరుగుల భారీ స్కోరు సాధించి ఆలౌటైంది. యువ ఓపెనర్ అభిషేక్ శర్మ (30 బంతుల్లో 69; 6 ఫోర్లు, 5 సిక్సర్లు) విండీస్ బౌలర్లకు చుక్కలు చూపించాడు. అతనికి ఇషాన్ కిషన్ (18 బంతుల్లో 37) తోడవడంతో స్కోరు బోర్డు పరుగులు పెట్టింది. ఆ తర్వాత తిలక్ వర్మ (28), నితీశ్ కుమార్ రెడ్డి (21), అక్షర్ పటేల్ (20) కూడా కీలక పరుగులు జోడించడంతో భారత్ భారీ స్కోరు చేయగలిగింది. విండీస్ బౌలర్లలో రోస్టన్ చేజ్, షమార్ స్ప్రింగర్, షమార్ జోసెఫ్ తలా రెండు వికెట్లు పడగొట్టారు. 224 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో వెస్టిండీస్‌కు ఆదిలోనే ఎదురుదెబ్బ తగిలింది. ఫామ్‌లో ఉన్న కెప్టెన్ షాయ్ హోప్ (5)ను అర్ష్‌దీప్ సింగ్ తక్కువ స్కోరుకే పెవిలియన్ చేర్చాడు. అయితే, షిమ్రాన్ హెట్మెయర్ (43), కమిల్ పూరన్ (42) దూకుడుగా ఆడి జట్టును ఆదుకునే ప్రయత్నం చేశారు. భారత బౌలర్లు క్రమం తప్పకుండా వికెట్లు తీయడంతో విండీస్ లక్ష్యానికి దూరమైంది. చివర్లో షమార్ స్ప్రింగర్ (11 బంతుల్లో 35 నాటౌట్) మెరుపు ఇన్నింగ్స్ ఆడినా ఫలితం లేకపోయింది. భారత బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్ 3 వికెట్లతో సత్తా చాటగా, నమన్ ధీర్ 2 వికెట్లు తీశాడు. ఈ సిరీస్‌లో ఒక జట్టు లక్ష్యాన్ని కాపాడుకోవడం ఇదే తొలిసారి. మ్యాచ్‌కు మంచు ప్రభావం పెద్దగా లేకపోవడం భారత బౌలర్లకు కలిసొచ్చింది. ఇరుజట్ల మధ్య నాలుగో టీ20 మ్యాచ్ ఈ నెల 14న హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియంలో జరగనుంది.

## ఆ 'నలుగురు కలిసి' 600 వికెట్లు..
## ఆసీస్ బౌలర్ల సరికొత్త చరిత్ర!



ఆస్ట్రేలియా ప్రఖ్యాత బౌలింగ్ చతుష్టయం టెస్ట్ క్రికెట్‌లో సరికొత్త చరిత్ర సృష్టించింది. పేసర్లు పాట్ కమ్మిన్స్, మిచెల్ స్టార్క్, జోష్ హేజిల్‌వుడ్, స్పిన్నర్ నాథన్ లైయన్‌లతో కూడిన ఈ బృందం.. కలిసి ఆడిన టెస్టుల్లో 600 వికెట్లు పడగొట్టిన తొలి బౌలింగ్ బృందంగా ప్రపంచ రికార్డు నెలకొల్పింది. దక్షిణాఫ్రికాతో డర్బన్‌లోని కింగ్స్‌మీడ్ మైదానంలో జరుగుతున్న తొలి టెస్టులో ఈ అరుదైన ఘనతను అందుకుంది. ఈ టెస్టు ప్రారంభానికి ముందు ఈ నలుగురు బౌలర్లు కలిసి 37 టెస్టుల్లో 599 వికెట్లు తీశారు. దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో వికెట్లు పడగొట్టడం ద్వారా తమ 38వ టెస్టులో 600 వికెట్ల మైలురాయిని దాటారు. ఈ 38 మ్యాచుల్లో కమ్మిన్స్ అత్యధికంగా 160 వికెట్లు పడగొట్టగా, స్టార్క్ 155, హాజిల్‌వుడ్ 152, లైయన్ 140 వికెట్లతో తమ వంతు పాత్ర పోషించారు. టెస్ట్ క్రికెట్ చరిత్రలో ఒకే బృందంగా ఆడుతూ 600 వికెట్ల మైలురాయిని దాటిన తొలి బౌలింగ్ చతుష్టయం ఇదే కావడం విశేషం. వీరి తర్వాత రెండో స్థానంలో ఉన్న ఇంగ్లండ్‌కు చెందిన జేమ్స్ అండర్సన్, స్టువర్ట్ బ్రాడ్, బెన్ స్టోక్స్, మొయిన్ అలీల చతుష్టయం 34 టెస్టుల్లో కలిసి 433 వికెట్లు మాత్రమే తీసింది. దీన్నిబట్టి ఆసీస్ బౌలర్ల ఆధిపత్యం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ప్రస్తుత మ్యాచ్ విషయానికొస్తే, తొలుత బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా జట్టు మాట్ రెన్షా సెంచరీతో 390 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికాను ఈ నలుగురు బౌలర్లు కట్టడి చేశారు. కమ్మిన్స్ మూడు వికెట్లు తీయగా, హేజిల్‌వుడ్, లైయన్ చెరో రెండు వికెట్లు, స్టార్క్ ఒక వికెట్ పడగొట్టారు. దీంతో దక్షిణాఫ్రికా 197 పరుగులకే 8 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది.

స్పోర్ట్స్

# మరోసారి చెలరేగిన ఫర్హాన్, సదాకత్.. పాక్ ఘన విజయం



స్వదేశంలో శ్రీలంకతో జరుగుతున్న మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను పాక్ మరో మ్యాచ్ మిగిలుండగానే కైవసం చేసుకుంది. ఈ టోర్నీ తొలి మ్యాచ్‌లో 4 వికెట్ల తేడాతో గెలిచిన ఆతిథ్య జట్టు.. ఇవాళ జరిగిన రెండో మ్యాచ్‌లో 82 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. తొలి మ్యాచ్‌లో చెలరేగిన పాక్ ఆటగాళ్లు సాహిబ్‌జాదా ఫర్హాన్, మాజ్ సదాకత్ రెండో మ్యాచ్‌లోనూ విజృంభించారు. తొలి మ్యాచ్‌లో తృటిలో సెంచరీ మిస్ (89) చేసుకున్న ఫర్హాన్ రెండో టీ20లోనూ భారీ అర్ధ సెంచరీ సాధించాడు. తొలి మ్యాచ్‌లో మెరుపు అర్ధ సెంచరీ (50) చేసిన మాజ్ సదాకత్ రెండో టీ20లో నాలుగు పరుగుల తేడాతో (96) సెంచరీని చేజార్చుకున్నాడు. ఫర్హాన్, సదాకత్ చెలరేగడంతో తొలుత బ్యాటింగ్ చేసిన పాక్ నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 215 పరుగులు చేసింది. పాక్ ఇన్నింగ్స్‌లో ఫకర్ జమాన్ (22), హసన్ నవాజ్ (19 నాటౌట్) కూడా మెరుపు ఇన్నింగ్స్‌లు ఆడారు. లంక బౌలర్లలో తీక్షణ, ఎషాన్ మలింగ, షనక తలో వికెట్ పడగొట్టారు. అనంతరం భారీ లక్ష్య ఛేదనలో శ్రీలంక చేతులెత్తేసింది. 74 పరుగులకే 6 వికెట్లు కోల్పోయిన ఆ జట్టు నిర్ణీత ఓవర్లు పూర్తయ్యేసరికి 7 వికెట్ల నష్టానికి 133 పరుగులు మాత్రమే చేయగలిగింది. పాక్ బౌలర్లలో ఇమ్రాన్ రంధవ (4-0-11-3) అద్భుతంగా బౌలింగ్ చేశాడు. సల్మాన్ మిర్జా 2, సైమ్ అయూబ్, షాదాబ్ ఖాన్ తలో వికెట్ పడగొట్టారు. ఈ సిరీస్‌లోని నామమాత్రపు చివరి టీ20 అక్టోబర్ 13న జరగనుంది.

# రొటీన్ సినిమాలకు చెక్ పెట్టి కొత్త ప్రయోగాలు చేస్తున్న కిరణ్ అబ్బవరం!



యువ నటుడిగా టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న కిరణ్ అబ్బవరం ఇప్పుడు జోరు పెంచారు. వైవిధ్యభరితమైన కథలతో ప్రేక్షకులను అలరిస్తున్న ఆయన, తాజాగా తన అప్‌కమింగ్ ప్రాజెక్టులకు సంబంధించి ఎన్నో ఆసక్తికరమైన విశేషాలను పంచుకున్నారు. ఒకవైపు కమర్షియల్ హంగులతో పాటు, మరోవైపు సరికొత్త జోనర్లలో నటిస్తూ తన కెరీర్‌ను పరుగులు పెట్టిస్తున్నారు. గతంలో వచ్చిన 'మీటర్' సినిమా ఫ్లాప్ కావడం తనకెంతో నేర్పించిందని, రొటీన్ కథలను ప్రేక్షకులు ఆదరించరనే సత్యాన్ని ఆ సినిమా ద్వారా గ్రహించానని కిరణ్ ఓపెన్‌గా చెప్పారు. ఇకపై ప్రతి విషయంలోనూ ఆత్మవిమర్శ చేసుకుంటూ ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలోనే ఆయన స్వీయ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'రియాలిటీ' మధ్యతరగతి యువకులు పెళ్లి విషయంలో ఎదుర్కొనే ఒత్తిళ్లు, తక్కువ బడ్జెట్‌లో వివాహం చేసుకోవాలనుకునే కుర్రాడి కష్టాల ఆధారంగా ఈ సినిమా వినోదాత్మకంగా రానుంది. డిసెంబర్ 25న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. కేవలం సినిమాలకే పరిమితం కాకుండా డిజిటల్ వరల్డ్‌లోకి కూడా అడుగుపెడుతున్నారు కిరణ్. 'డియర్ కామ్రేడ్' ఫేమ్ భరత్ కమ్మ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'గువ్వల చెరువు ఘాట్' అనే వెబ్ సిరీస్‌తో ఆయన ఓటీటీలోకి ఎంట్రీ ఇస్తున్నారు. 1980ల నాటి రాజకీయ నేపథ్యంతో ఎనిమిది ఎపిసోడ్లుగా రూపొందుతున్న ఈ సిరీస్‌లో ఆయన జర్నలిస్ట్‌గా కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇక భారీ చిత్రాల విషయానికొస్తే.. 'కాంతార: చాప్టర్–1'కి పని చేసిన శ్రీకాంత్ పుప్పాల డైరెక్షన్‌లో 'ఇంద్రపుత్ర' సినిమా చేస్తున్నారు. ఇది పీరియాడిక్ డ్రామా కాదని, కేవలం తొలి 15 నిమిషాలు మాత్రమే మైథలాజికల్ టచ్ ఉండే నేటి తరపు కథ అని ఆయన క్లారిటీ ఇచ్చేశారు. అలాగే తనే స్వయంగా నిర్మాతగా వ్యవహరిస్తున్న 'హతః' అనే హారర్ థ్రిల్లర్ సినిమా ప్రేక్షకులను సీట్ల అంచున కూర్చోబెట్టడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. మొత్తానికి వైవిధ్యమైన కథలతో కిరణ్ అబ్బవరం చేస్తున్న ఈ కొత్త ప్రయోగాలు టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారాయి.

# కామ్రేడ్ కల్యాణ్ మూవీ.. రెండో రోజు ఊహించని కలెక్షన్స్..!




శ్రీ విష్ణు హీరోగా వచ్చిన లేటేస్ట్ మూవీ కామ్రేడ్ కల్యాణ్. ఈ చిత్రంలో మహిమ నంబియార్ హీరోయిన్ నటించింది. ఈ సినిమాకు జానకీరామ్ దర్శకత్వంలో తెరకెక్కించారు. ప్రస్తుతం ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద సందడి చేస్తోంది. మొదటి రోజు పాజిటివ్ టాక్ రాకపోయినప్పటికీ.. వసూళ్లపరంగా రాణించింది. మొదటిరోజు రూ.4.5 కోట్ల గ్రాస్ కలెక్షన్ వచ్చినట్లు వెల్లడించారు. అయితే రెండో రోజు ఈ చిత్రం వసూళ్లపరంగా దూసుకెళ్లింది. ఫస్ట్ డే కేవలం రూ.4.5 కోట్లు మాత్రమే రాబట్టిన ఈ మూవీ.. రెండో రోజు ఊహించని కలెక్షన్స్ సాధించింది. శనివారం ఒక్కరోజే రూ.8 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టింది. రెండో రోజుల్లో కలిపి ప్రపంచవ్యాప్తంగా రూ.12 కోట్లకు పైగా గ్రాస్ కలెక్షన్స్ వసూలు చేసింది. ఈ విషయాన్ని తెలియజేస్తూ ప్రత్యేక పోస్టర్ రిలీజ్ చేశారు మేకర్స్.

కామ్రేడ్ కల్యాణ్ కథేంటంటే..

'కామ్రేడ్ కళ్యాణ్' విషయానికొస్తే 90వ దశకంలోని ఆంధ్రా ఒడిశా సరిహద్దు ప్రాంతం. ఓ మాదిరిగా చదువుకున్న తాడికొండ కళ్యాణ్ (శ్రీవిష్ణు).. ఊరిలో ఓ థియేటర్‌ని లీజుకు తీసుకుని నడిపిస్తుంటాడు. అప్పుడే అక్కడి అడవుల్లో నక్సలైట్ దళాల ఏరివేత కోసమని ప్రత్యేకంగా ఐపీఎస్ అధికారి జార్జ్‌కుట్టి (షైన్ టామ్ చాకో) వస్తాడు. మాస్టార్ (సాయిచంద్) దళానికీ, జార్జ్‌కుట్టీకి మధ్య యుద్ధం కొనసాగుతుండగానే, ఆ ఊరిలోకి ఒరియా అమ్మాయి సితారదేవి (మహిమా నంబియార్) తన తల్లిదండ్రులతో కలిసి వస్తుంది. ప్రాణాపాయ స్థితిలో ఉన్న తన తల్లి సరస్వతమ్మ (రాధికా శరత్‌కుమార్)ని కాపాడిన సితారని చూసి తొలి చూపులోనే కళ్యాణ్ ప్రేమలో పడతాడు. ఆమెతో కలిసి జీవితాన్ని పంచుకోవాలనుకుంటాడు. సితార కోసం చేసిన కొన్ని పనుల వల్ల థియేటర్‌ని నడిపే కళ్యాణ్.. కామ్రేడ్ కళ్యాణ్ అవుతాడు. పోలీసులకు మోస్ట్ వాంటెడ్‌గా మారిపోతాడు. అడవిలోని అన్నలకు, కళ్యాణ్‌కు సంబంధమేంటి? తన ప్రేయసి సితార కుటుంబాన్ని కష్టాల నుంచి గట్టెక్కించాడా? సితార కుటుంబం కష్టాల్లో కూరుకుపోవడానికి కారణమేమిటి? అనేది మిగతా స్టోరీ.

# రవితేజ కొత్త సినిమా టైటిల్ ఖరారు.. 'తులాభారం'తో వస్తున్న మాస్ మహారాజా!




మాస్ మహారాజా రవితేజ, విభిన్న చిత్రాల దర్శకుడు వివేక్ ఆత్రేయ కలయికలో రాబోతున్న కొత్త సినిమా టైటిల్‌ను చిత్ర బృందం ప్రకటించింది. ఈ చిత్రానికి 'తులాభారం' అనే ఆసక్తికర టైటిల్‌ను ఖరారు చేస్తూ, ఒక ప్రత్యేకమైన టైటిల్ డాక్యుమెంటరీని విడుదల చేసింది. ఈ వినూత్న ప్రకటనతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. బ్రిడ్జ్ ప్రొడక్షన్స్ పతాకంపై ఈ సినిమా తెరకెక్కుతోంది. వివేక్ ఆత్రేయ తనదైన శైలిలో కథను సిద్ధం చేయగా, రాక్‌స్టార్ వివేక్ సాగర్ సంగీతం అందిస్తున్నారు. రవితేజ మార్క్ ఎనర్జీ, వివేక్ ఆత్రేయ సృష్టించే బలమైన పాత్రలు కలిసి ప్రేక్షకులకు కొత్త అనుభూతినిస్తాయని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. తాజాగా విడుదల చేసిన 'తులాభారం' టైటిల్ డాక్యుమెంటరీ సినిమాపై క్యూరియాసిటీని మరింత పెంచుతోంది. ఇందులో చిత్ర నిర్మాణం, నేపథ్యానికి సంబంధించిన కొన్ని విశేషాలను పంచుకున్నారు. ఈ సినిమాలో రవితేజ సరసన ప్రియాంక మోహన్, అనశ్వర రాజన్ కథానాయికలుగా నటిస్తుండగా, జేడీ చక్రవర్తి, తరుణ్ భాస్కర్ కీలక పాత్రలు పోషించనున్నట్లు మేకర్స్ తెలిపారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన మరిన్ని వివరాలను త్వరలోనే అధికారికంగా వెల్లడిస్తామని చిత్ర బృందం పేర్కొంది.

# ఎన్టీఆర్ -- ప్రశాంత్ నీల్ 'డ్రాగన్' షూటింగ్‌పై క్రేజీ అప్‌డేట్.. నవంబర్ నుంచి కొత్త షెడ్యూల్ షురూ!



టాలీవుడ్ మోస్ట్ అవైటెడ్ ప్రాజెక్ట్ అయిన 'డ్రాగన్' మూవీ కోసం యంగ్ టైగర్ ఎన్టీఆర్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే మాస్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ తెరకెక్కిస్తున్న ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌కు సంబంధించి చిత్ర యూనిట్ నుంచి ఒక ఆసక్తికరమైన వార్త ఫిల్మ్ సర్కిల్స్‌లో వైరల్ అవుతోంది. గాయం నుంచి కోలుకుంటున్న తారక్ త్వరలోనే మళ్లీ సెట్స్‌లోకి అడుగుపెట్టేందుకు సన్నాహాలు చేస్తున్నారు. హైదరాబాద్‌లోని ప్రముఖ అల్యూమినియం ఫ్యాక్టరీలో ఈ చిత్రం కోసం ఒక భారీ సెట్‌ను ఇప్పటికే నిర్మించారు. నవంబర్ మొదటి వారం నుంచి ఈ సెట్‌లో 'డ్రాగన్' కొత్త షెడ్యూల్ ప్రారంభం కానున్నట్లు తెలుస్తోంది. ఈ షెడ్యూల్‌లో ఎన్టీఆర్‌తో పాటు చిత్రంలోని ఇతర ప్రధాన తారాగణంపై కొన్ని కీలకమైన, ఉత్కంఠభరితమైన సన్నివేశాలను తెరకెక్కించనున్నారు. ఇదిలా ఉంటే, ప్రశాంత్ నీల్ సినిమాలలో ఇప్పటివరకు విజువల్స్ అన్నీ ప్రధానంగా డార్క్, బ్లాక్ అండ్ గ్రే షేడ్స్‌లో ఉండటం తెలిసిందే. అయితే, ఎన్టీఆర్‌తో తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో మాత్రం ఒక ప్రత్యేకత ఉండబోతోందని టాక్. ఈ సినిమాలో వచ్చే ఫ్లాష్ బ్యాక్ ఎపిసోడ్స్ పూర్తిగా కలర్‌ఫుల్‌గా, సరికొత్త విజువల్ వండర్‌లా సాగుతాయని ప్రచారం జరుగుతోంది. మైత్రీ మూవీ మేకర్స్ మరియు ఎన్టీఆర్ ఆర్ట్స్ సంయుక్తంగా అత్యంత భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, రాక్ స్టార్ రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు. తారక్ కెరీర్‌లో మరో సరికొత్త మైలురాయిగా నిలవబోతున్న ఈ సినిమాపై అంచనాలు రోజురోజుకూ తారాస్థాయికి చేరుకుంటున్నాయి.



# విజయ్ దేవరకొండ రుద్రతాండవం.. రణబాలిలో ఈ సాంగ్ చూశారా..?

తెలుగు సినీ ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాల్లో 'రణబాలి' ఒకటి. విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంటగా నటిస్తున్న ఈ పీరియాడిక్ యాక్షన్ డ్రామాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ క్రమంలో సినిమా ప్రమోషన్స్‌ను మరింత జోరుగా నిర్వహిస్తున్న మేకర్స్.. తాజాగా రెండో పాట 'కోబలి'ని విడుదల చేశారు.

**రణబాలి నుంచి రెండో పాట**

విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న ప్రధాన పాత్రల్లో నటించిన 'రణబాలి' అక్టోబర్ 16న ప్రేక్షకుల ముందుకు రానుంది. సినిమా విడుదల తేదీ దగ్గరపడుతున్న నేపథ్యంలో చిత్ర బృందం ప్రమోషన్స్‌ను వేగవంతం చేసింది. ఇందులో భాగంగా ముందుగా స్పాటిఫైలో విడుదలైన 'కోబలి' పాట లిరికల్ వీడియోను తాజాగా యూట్యూబ్‌లోనూ విడుదల చేశారు. 'కోబలి' పాట పవర్‌ఫుల్‌గా సాగుతూ ఆకట్టుకుంటోంది. అర్థవంతమైన సాహిత్యం ఈ పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. అజయ్–అతుల్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. సినిమా విడుదలకు ముందు వచ్చిన ఈ రెండో పాటతో 'రణబాలి'పై ప్రేక్షకుల్లో ఆసక్తి మరింత పెరిగే అవకాశం ఉంది.

Printed by Sree Seshasai Enterprises Published by Vaddi Srinivas Reddy on behalf of Sai Krishna Publications, printed at # 3-88, Chandra Theater, Main Road, Gosala, Krishna District - 521151 Andhra Pradesh and published at D.No. 6-121, 1st Floor, Sphurthy Building, Gosala Village, Urdu School Street, Vijayawada, Krishna District-521151 Andhra Pradesh. Editor Vaddi Srinivas Reddy- 94402 31967 . PRGI No. APTEL/26/A0119,